V3 NEWS
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శనివారం
03-08-2024
సంపుటి : 01 | సంచిక : 91 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ CMD

## క్వార్టర్ ఫైనల్లోకి టీమిండియా

హాకీలో ఆస్ట్రేలియాపై భారత్ చారిత్రక విజయం



2

## ఏ నోటిఫికేషన్లు ఎప్పుడొస్తాయంటే?

తెలంగాణలో జాబ్ క్యాలెండర్ విడుదల

అసెంబ్లీలో ప్రకటించిన ప్రభుత్వం

**విశ్వంభర, హైదరాబాద్**

రాష్ట్రం ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసింది. ఏయే ఉద్యోగాలు, ఎప్పుడు భర్తీ చేయాలనే వివరాలను అందులో పొందుపరిచింది. రాష్ట్రంలో రానున్న అయిదేళ్లలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ఇందుకు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం శుక్రవారం శాసనసభలో విడుదల చేసింది. వేర్వేరు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేసే నెల, ఎప్పుడు పరీక్షలు నిర్వహిస్తారనే వివరాలను పొందుపర్చింది. నియామకాలు నిర్వహించే ఏజెన్సీ, ఉద్యోగాలకు కావాల్సిన అర్హతలను వివరించింది.

అక్టోబరులో గ్రూపు 1 పరీక్షలు

జాబ్ క్యాలెండర్ ప్రకారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలు జరుగుతాయి. గ్రూప్ 1 పరీక్షలను అక్టోబర్‌లో నిర్వహిస్తామని, గ్రూప్ 2 పరీక్షలను డిసెంబర్‌లో, గ్రూప్ 3 పరీక్షలు నవంబర్‌లో నిర్వహిస్తామన్నారు. కాగా ఈ ఖాళీలకు ఇప్పటికే నోటిపికేషన్లు విడుదలై పరీక్షలు మాత్రమే నిర్వహించాల్సి ఉంది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించి మెయిన్స్‌కు అర్హత పొందిన వారి జాబితాను

మిగతా2లో...

### నిరుద్యోగుల ఆశలు నెరవేర్చడానికే



"రాష్ట్రమంతా దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతీయువకుల ఆశలను నిజం చేయడానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇచ్చిన హామీ మేరకు, మేం ప్రభుత్వంలోకి రాగానే నిరుద్యోగులకు బాసటగా ఉద్యోగాలను నియమించే ప్రక్రియను మొదలుపెట్టాం. తద్వారా నిరుద్యోగ యువతీయువకులకు పరీక్షలు ఎప్పుడు జరుగుతాయో తేదీలతో సహా ముందుగానే క్యాలెండర్‌ను ప్రకటిస్తున్నాం"

**- మల్లు భట్టి విక్రమార్క, ఉప ముఖ్యమంత్రి**



## 30 వేల ప్రభుత్వ పాఠశాలలకు
# ఉచిత విద్యుత్

- వేలాది మంది ఉపాధ్యాయుల చేతుల్లోనే తెలంగాణ భవిష్యత్తు
- తెలంగాణ ఉద్యమంలో టీచర్ల పాత్ర మరువలేనిది
- ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇచ్చే బాధ్యత నాది..
- పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల సమ్మేళనంలో సీఎం



**విశ్వంభర, హైదరాబాద్**

రాష్ట్రంలోని 30 వేల ప్రభుత్వ పాఠశాలన్నింటికీ ఉచిత విద్యుత్ అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. టీచర్ల జీతం నుంచి పాఠశాలలకు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదన్నారు. ఉపాధ్యాయులే తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు అని పేర్కొన్నారు. వారికి ఏది కావాలన్నా ఇచ్చే బాధ్యత తమ ప్రభుత్వానిదని స్పష్టంగా చెప్పారు. పేదలకు విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులతో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ పిల్లల భవిష్యత్తును తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు ఇచ్చారని, వారిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత టీచర్లపైనే ఉందన్నారు. 'కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను కలవాలని కోదండరాంకు విజ్ఞప్తి చేసి ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయించాం. తెలంగాణ భవిష్యత్తు ఎక్కడుందని అడిగితే ఎల్బీ స్టేడియంలోని ఉందని చెప్తాను. తెలంగాణ ఉద్యమంలో

మిగతా2లో...

సిట్ విచారణకు సుప్రీం
## తిరస్కరణ

- మాజీ న్యాయమూర్తితో విచారణ అనుచితమే..
- ఆర్టికల్ 32 ప్రకారం ఈదశలో జోక్యం చేసుకోవడం తొందరపాటే
- ఎలక్టోరల్ బాండ్ల స్కామ్స్ పిటిషన్లపై ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యలు

2



## మమ్మల్ని వేధిస్తున్నారు..

- ప్రతిపక్ష సభ్యులను ప్రభుత్వం టార్గెట్ చేస్తోంది
- చట్టాలను ప్రభుత్వం దుర్వినియోగం చేయడం సరికాదు
- అసెంబ్లీలో కేటీఆర్ వ్యాఖ్యలు



2

3



దానం నాగేందర్ వ్యాఖ్యలతో
## గందరగోళం

- పోడియం వైపు దూసుకొచ్చిన బీఆర్ఎస్ సభ్యులు
- దానంను వెనక్కు తీసుకెళ్లిన కాంగ్రెస్ సభ్యులు
- సభాపతికి క్షమాపణలు చెప్పిన నాగేందర్

సభ్యత్వం రద్దు చేస్తే తప్ప
## బుద్ధిరాదు

- బీఆర్ ఎస్ సభ్యుల తీరును ఓపికతో చూస్తున్నాం
- సభ్యుడికి మైక్ ఇవ్వొద్దనే అధికారం వారికి ఎక్కడిది?
- లాంగ్వేజ్ వేరు నాలెడ్జ్ వేరు కేటీఆర్.. తెలుసుకో
- అసెంబ్లీలో నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి

2



మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 114 | ₹ 136 |
| **స్కిన్** | **స్కిన్‌లెస్** |
| ₹ 197 | ₹ 224 |

భారీగా నష్టపోయిన
## స్టాక్ మార్కెట్లు

రూ.5 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరి..

ఆటో, ఐటీ, రియాల్టీ సెక్టర్లలో ఒత్తిడి

3





17 శాతం పెరిగిన రెవెన్యూ
## రాబడులు

స్పష్టం చేసిన కాగ్ నివేదిక

అసెంబ్లీలో విడుదల చేసిన ప్రభుత్వం

2

పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ
## పూర్తి చేస్తాం

- నాగార్జున సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసిన
- మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

3



# ఏ నోటిఫికేషన్లు ఎప్పుడొస్తాయంటే?

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే విడుదల చేశారు. ఈ ఏడాది అక్టోబర్‌లోనే మరోసారి గ్రూప్1 నోటిఫికేషన్ ఇచ్చి 2025 ఫిబ్రవరిలో ప్రిలిమ్స్ నిర్వహిస్తామని ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌లో తెలిపింది. గ్రూప్1 మెయిన్స్‌ను 2025 జులైలో నిర్వహిస్తామని పేర్కొంది. వచ్చే ఏడాది మేలో మరోసారి గ్రూపు2 నోటిఫికేషన్ విడుదల చేసి, అక్టోబర్‌లో పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. వచ్చే ఏడాది జులైలో గ్రూప్3 నోటిఫికేషన్ ఇచ్చి, నవంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపింది.

**వైద్యారోగ్య శాఖ నోటిఫికేషన్ సెప్టెంబరులో**

వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్ నియామకాల కోసం సెప్టెంబర్ నెలలో నోటిఫికేషన్ ఇచ్చి నవంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తామని వివరించింది. ట్రాన్స్‌కోలో వివిధ ఇంజినీరింగ్ ఉద్యోగాల భర్తీకి అక్టోబర్‌లో నోటిఫికేషన్ ఇచ్చి, వచ్చే ఏడాది జనవరిలో నియామక పరీక్ష నిర్వహిస్తామని తెలిపింది. వివిధ శాఖల్లోని ఇంజినీరింగ్ ఉద్యోగాల కోసం అక్టోబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేసి, వచ్చే ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొంది.

**నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్**

వివిధ శాఖల్లో గెజిటెడ్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జనవరిలో నోటిఫికేషన్ ఇచ్చి, ఏప్రిల్‌లో పరీక్షలు నిర్వహిస్తామని వివరించింది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ విడుదల చేసి, మేనెలలో పరీక్షలు పెడతామని తెలిపింది. ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో నోటిఫికేషన్ ఇచ్చి ఆగస్టులో పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొంది.

* డిగ్రీ కాలేజీల్లో అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టులకు వచ్చే ఏడాది జూన్‌లో నోటిఫికేషన్ ఇచ్చి సెప్టెంబర్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొంది. నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి వచ్చే ఏడాది జనవరిలో నిర్వహిస్తామని తెలిపింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఏప్రిల్‌లో పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొంది. ప్రతి ఏడాది రెండుసార్లు టెట్ నిర్వహిస్తామని హామీ ఇచ్చిన సర్కార్, 2025 ఏప్రిల్‌లో మరోసారి నోటిఫికేషన్ ఇచ్చి జూన్‌లో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపింది.
* సింగరేణిలో పలు ఉద్యోగాల కోసం 2025 జులైలో నోటిఫికేషన్ ఇచ్చి, నవంబర్‌లో పరీక్షలు పెడతామని ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌లో వివరించింది. వచ్చే ఏడాది జులైలో మరోసారి గ్రూప్1 మెయిన్స్ ఉంటుందని జాబ్ క్యాలెండర్‌లో పేర్కొన్న సర్కార్, ఈ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఎప్పుడు ఇస్తారు. ప్రిలిమ్స్ ఎప్పుడు ఉంటుందనే వివరాలను పొందుపర్చలేదు. ప్రిలిమ్స్ అర్హత సాధించిన వారు, మెయిన్స్ రాస్తారని మాత్రం పేర్కొన్నారు.

**కాంగ్రెస్ నిరుద్యోగులను మోసం చేసింది: కేటీఆర్**

రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ బోగస్ అంటూ ఆయన విరుచుకుపడ్డారు. ఎన్నికల హామీ మేరకు ప్రశ్నిస్తారనే భయంతో రెండు పేపర్ల మీద ఏదో రాసుకొచ్చి ఇదే జాబ్ క్యాలెండర్ అంటూ నిరుద్యోలను మభ్యపెడుతున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌పై చర్చకు అవకాశం ఇవ్వాలని స్పీకర్ ను కోరితే ఇవ్వలేదని అన్నారు. మేం ప్రశ్నిస్తామనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ నుంచి పారిపోయిందని ఎద్దేవా చేశారు.

## క్వార్టర్ ఫైనల్లోకి టీమిండియా

### హాకీలో ఆస్ట్రేలియాపై భారత్ చారిత్రక విజయం

**పారిస్:** టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకంతో చరిత్ర సృష్టించిన భారత పురుషుల హాకీ జట్టు పారిస్ విశ్వక్రీడల్లోనూ పతక దిశగా దూసుకెళ్తోంది. ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. చావోరేవో మ్యాచ్‌లో సంచలన ఆటతో బలమైన ఆస్ట్రేలియాపై రికార్డు విజయంతో క్వార్టర్స్ బెర్తు సాధించింది. గ్రూప్ బి చివరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలో టీమిండియా అదరగొట్టింది. విశ్వ క్రీడల్లో కొరకరాని కొయ్యలా మారిన ఆస్ట్రేలియాను ఆస్ట్రేలియాను మట్టికరిపించింది. బెల్జియం చేతిలో 21 ఓటమి నుంచి తేరుకున్న భారత జట్టు శుక్రవారం దుమ్మురేపింది. ఆద్యంతం ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో కంగారులకు భారత్ చెక్ పెట్టింది. గ్రూప్‌బీలో శుక్రవారం ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా 32తో విజయం సాధించింది. భారత్ తరపున కెప్టెన్ హర్మన్ ప్రీత్ మరోసారి నిలకడైన ప్రదర్శనతో సత్తాచాటి రెండు గోల్స్ సాధించాడు. అభిషేక్ శర్మ ఓ గోల్ వేశాడు. కాగా, ఒలింపిక్స్‌లో 52 ఏళ్ల తర్వాత భారత్ ఆస్ట్రేలియాపై తొలిసారి విజయం సాధించింది. 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్ తర్వాత ఆసీస్‌ను భారత్ ఓడించడం ఇదే మొదటిసారి. ఆస్ట్రేలియాపై గెలుపు కోసం అయిదు దశాబ్దాల నిరీక్షణకు శుక్రవారం తెరపడింది. ఇప్పటికే ఇరు జట్లు క్వార్టర్స్‌కు అర్హత సాధించిన విషయం తెలిసిందే. అయితే మ్యాచ్‌ను భారత్ 42తో ముగించేది. నాలుగో గోల్ చేసిన టీమిండియా సంబరాలు చేసుకుంది. కానీ ఆస్ట్రేలియా రివ్యూని కోరింది. స్టిక్ చెక్‌తో థర్డ్ అంపైర్ ఆ గోల్‌ను రద్దుచేశాడు. దీంతో 32తో మ్యాచ్ ముగించింది. మ్యాచ్ ఆరంభమైన 12వ నిమిషంలో అభిషేక్ గోల్ సాధించాడు. కాసేపటికే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ గోల్ కొట్టి భారత్ ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. పెనాల్టీ కార్నర్‌ను అద్భుతంగా గోల్‌గా మలిచాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియా ఖాతా ప్రారంభించినా మూడో క్వార్టర్‌లో హర్మన్‌ప్రీత్ భారత్‌కు మూడో గోల్ అందించాడు. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఎటాకింగ్ షాట్లను శ్రీజేష్ గొప్పగా డిఫెండ్ చేశాడు.

# 30 వేల ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్

(మొదటి పేజీ తరువాయి)

టీచర్లు పోషించిన పాత్ర మరువలేనిది' అని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులకు అవమానం

రాష్ట్రం సాధించుకున్నాక ఉపాధ్యాయులకు గౌరవం దక్కుతుందని అనున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కానీ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉపాధ్యాయులకు గౌరవం లేదన్నారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులను ఏవిధంగా అవమానించిందో అందరూ చూశారని ఆవేదన చెందారు. విద్యాశాఖకు బడ్జెట్‌లో రూ.21 వేల కోట్లు కేటాయించా మని పేర్కొన్నారు. 30 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 26 లక్షల మంది విద్యార్థులు ఉన్నారన్నారు. 10 వేల ప్రైవేటు పాఠశాలల్లో 33 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని వివరించారు. విద్యావ్యవస్థలో ఎక్కడో లోపం ఉందని, ప్రభుత్వం నుంచి ఉన్న లోపాన్ని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని వెల్లడించారు. పదేళ్లుగా టీచర్లకు ఏనాడూ ఒకటో తేదీన జీతాలు పడలేదని ధ్వజమెత్తారు. యజమాని మీద విశ్వాసం ఉన్నప్పుడే ఉద్యోగి నిజాయితీగా పని చేస్తాడని అన్నారు. గత యజమాని కేసీఆర్‌పై ఉపాధ్యాయులకు ఎప్పుడూ విశ్వాసం లేదని విమర్శించారు. ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించడానికి ఎవరైనా వస్తే వెంటనే స్పందించానని ప్రజా ప్రతినిధులకు తెలిపారు.

సమ్మేళనం ఏర్పాటులో రాజకీయం లేదు

"టీచర్లు తేనెటీగల్లా వారి పని వారు చూసుకుంటారు. ఎవరైనా ముడితే కలిసికట్టుగా దాడి చేస్తారు. టీచర్ల సమస్యలను పరిష్కరించాడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. 30 వేల మందికి పైగా టీచర్లకు పదోన్నతులు ఇచ్చాం. మంత్రులు, అధికారులు టీచర్లకు అందుబాటులో ఉండాలని చెప్పాను. ప్రతినెల ఒకటో తేదీన మీ ఖాతాలో జీతం పడేలా చూసే బాధ్యత నాది అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో రాజకీయం లేదని, ఏమీ ఆశించలేదన్నారు." తెలంగాణ భవిష్యత్తు మా చేతుల్లో లేదు మీ చేతుల్లో ఉంది. అమెరికాలో చదివానని అసెంబ్లీలో ఒక వ్యక్తి అన్నారు. నువ్వు ఎక్కడ చదువుకున్నావని నన్ను ఆ వ్యక్తి అడిగారు. నేను ప్రభుత్వ పాఠాశాలలో చదివానని గర్వంగా చెప్తున్నాను. ప్రభుత్వ పాఠాశాలలో చదివి సీఎం స్థాయికి ఎదిగాను" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.




# సిట్ విచారణకు సుప్రీం తిరస్కరణ

**విశ్వంభర, ఢిల్లీ:** ఎలక్టోరల్ బాండ్ల స్కామ్‌పై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో దర్యాప్తు జరిపించాలని కోరుతూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే సుప్రీంకోర్టు ఈ పిటిషన్లను తిరస్కరించింది. ఎలక్టోరల్ బాండ్ల విక్రయంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ, కార్పొరేట్ సంస్థల మధ్య 'క్విడ్ ప్రోకో' జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో స్వచ్ఛంద సంస్థల (ఎన్జీవోలు)తోపాటు పలువురు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు (పిల్స్) సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. ఎన్నికల సంఘం (ఈసీ) విడుదల చేసిన డేటా ద్వారా 'షెల్, లాస్ మేకింగ్ కంపెనీల' నుంచి రాజకీయ పార్టీలకు నిధులు సమకూరడంపై దర్యాప్తు జరపాలని కోరాయి.

ఎలక్టోరల్ బాండ్ల అమ్మకాల్లో 'క్విడ్ ప్రోకో'కు సంబంధించిన ఆరోపణలపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, కోర్టు పర్యవేక్షణలో సిట్‌తో దర్యాప్తు జరిపించాలని అభ్యర్థించాయి. ఈ పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం విచారించింది. సాధారణ చట్టం కింద చర్యలు తీసుకునే మార్గాలు ఉన్నప్పటికీ.. దీనిపై మాజీ న్యాయమూర్తితో విచారణకు ఆదేశించడం అనుచితమే అవుతుందని పేర్కొంది. ఆర్టికల్ 32 ప్రకారం ఈ దశలో జోక్యం చేసుకోవడం కూడా తొందరపాటే అవుతుందని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**ఇవి ఆదాయపు పన్ను చట్టంకు సంబంధించిన చర్యలు..**

ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు స్వీకరించిన విరాళాలను రికవరీ చేయడంతోపాటు, వాటి ఆదాయపన్ను మదింపులను తిరిగి తెరవాలని పిటిషనర్లు కోరడాన్ని సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఆదాయపు పన్ను చట్టం కింద ఇవి సదరు శాఖ అధికారులకు సంబంధించిన చర్యలని పేర్కొంది. ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారంలో క్విడ్ ప్రో కో జరిగి ఉండవచ్చనే ఆరోపణల నేపథ్యంలో వాటిపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరపాలని కోరుతూ సుప్రీం కోర్టులో నాలుగు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిని పరిశీలించిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం.. సిట్ ఏర్పాటుకు నిరాకరించింది.

రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల చెల్లుబాటుపై సుప్రీంకోర్టు ఈ ఏడాది ఫిబ్రవరిలో సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ పథకం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. ఎన్నికల బాండ్ల జారీని బ్యాంకులు తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది. ఎటువంటి వివరాలు తెలియని ఎన్నికల బాండ్లను స్వీకరించడం అంటే సమాచార హక్కును ఉల్లంఘించడమేనని ధర్మాసనం తెలిపింది. నల్లధనాన్ని అరికట్టేందుకు ఇదొక్కటే మార్గం కాదని, ఆ కారణంతో సహ చట్టాన్ని ఉల్లంఘించడం సమంజసం కాదని అభిప్రాయపడింది. విరాళాలు ఇచ్చిన పేర్లు రహస్యంగా ఉంచడం తగదని, ఇది ఆదాయపు పన్ను చట్టాన్ని కూడా ఉల్లంఘించినట్లు అవుతుందని తెలిపింది.

**ఏంటీ ఎన్నికల బాండ్లు..?**

ఎన్నికల బాండ్లు ఒక ప్రామిసరీ నోట్ లాంటివి. ఇవి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)లో లభ్యమవుతాయి. వ్యక్తులు, కంపెనీలు వీటిని కొనుగోలు చేయవచ్చు. అలా కొనుగోలు చేసిన వాటిని నచ్చిన రాజకీయ పార్టీలకు విరాళంగా ఇవ్వొచ్చు. రాజకీయ పార్టీలు తమకు వచ్చిన బాండ్లను నగదుగా మార్చుకొని పార్టీ కార్యక్రమాల కోసం వినియోగించుకుంటాయి. రాజకీయ పార్టీల విరాళాల విషయంలో పారదర్శకత తీసుకురావాలనే ఉద్దేశంతో కేంద్రంలోని అధికార బీజేపీ ప్రభుత్వం 2018లో ఈ ఎన్నికల బాండ్ల పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అయితే, రాజకీయ పార్టీలు తాము స్వీకరించిన విరాళాల గురించి బహిర్గతం చేయాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం ఆర్థిక చట్టం 2017 సవరణ చేసింది. దాంతో ఎన్నిక బాండ్ల విధానంలో పారదర్శకత లోపించిందని పలువురు విమర్శించారు. ఈ క్రమంలోనే ఈ పథకాన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి.

# 17 శాతం పెరిగిన రెవెన్యూ రాబడులు

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో రెవెన్యూ రాబడులు గణనీయంగా పెరిగాయని కాగ్ నివేదికలో వెల్లడించింది. 202324 ఆర్థిక ఏడాదిలో రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై కాగ్ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో విడుదల చేసింది. రాష్ట్ర జీఎస్‌డీపీ 202122తో పోలిస్తే 202223లో 16 శాతం పెరిగిందని పేర్కొంది. రెవెన్యూ రాబడుల వృద్ధి రేటు ఒక శాతం తగ్గిందని వెల్లడించింది. సొంత పన్నుల రాబడి గణనీయంగా 17శాతం పెరిగిందని తెలిపింది.

కొన్ని పథకాల నిధుకు ఖర్చు కాలే : సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.2,06,977 కోట్లకు పెరిగిందని, 2023 మార్చి నాటికి పూర్తి కావాల్సిన 20 ప్రాజెక్టుల అంచనా వ్యయం పెరిగిందని వెల్లడించింది. రూ.2,749 కోట్ల మేర ద్రవ్యలోటు తక్కువ చేసి చూపించారని వివరించింది. ఏపీ నుంచి తెలంగాణ విద్యుత్ కంపెనీలకు బకాయిలు రాలేదని నివేదికలో తెలిపింది. ఇళ్లు, గొర్రెల పంపిణీ, ఆయిల్‌పామ్ పథకాల నిధులు ఖర్చు కాలేదని స్పష్టం చేసింది. దళితబంధు, రుణమాఫీ పథకాలకు కేటాయింపుల్లో భారీగా ఖర్చు కాలేదని వెల్లడించింది.

**2 నెలల్లో రాష్ట్ర ఖజానాకు రూ.22 వేల కోట్లకు పైగా ఆదాయం**

'202223లో ప్రభుత్వం ఇచ్చిన రుణాలు, అడ్వాన్స్‌లు 150 శాతం పెరిగాయి. సొంత రాబడి లేని సంస్థలకు ప్రభుత్వం రుణాలు ఏర్పాటు చేసింది. 202223లో బడ్జెట్ వెలుపలి




రుణాలు రూ.1,18,629 కోట్లుగా అంచనా. ఆయా రుణాలకు ప్రభుత్వం తదుపరి రుణాలుగా రూ.17,829 కోట్లు అందించింది. రాష్ట్రాభివృద్ధి రుణాలపై వడ్డీపై ఖర్చు తక్కువగా అంచనా వేస్తున్నారు. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లను భారీగా అంచనా వేస్తున్నారు.' అని కాగ్ నివేదికలో పేర్కొంది.

బిల్లుకు మద్దతు తెలిపిన ప్రతిపక్షాలు : కాగ్ నివేదిక ప్రవేశపెట్టిన అనంతర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రానికి పేరు తెచ్చిన క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. నిఖత్ జరీన్, మహమ్మద్ సిరాజ్‌కు గ్రూప్1 ఉద్యోగాలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. సవరణ బిల్లుకు ఆమోదం తెలపాలని కోరారు. ప్రభుత్వం తెచ్చిన పబ్లిక్ సర్వీస్ నియామకలపై తెచ్చిన బిల్లులకు ప్రతిపక్ష పార్టీలు మద్దతు తెలిపాయి. ప్రతి మండల కేంద్రంలో క్రీడామైదానం ఏర్పాటు చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. నిఖత్, సిరాజ్ రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తెచ్చారని ఎంఐఎం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారులకు అన్ని విధాలుగా అండగా ఉండాలి వారు కోరారు.



# మమ్మల్ని వేధిస్తున్నారు..

**ప్రతిపక్ష సభ్యులను ప్రభుత్వం టార్గెట్ చేస్తోంది**
**చట్టాలను ప్రభుత్వం దుర్వినియోగం చేయడం సరికాదు**
**అసెంబ్లీలో కేటీఆర్ వ్యాఖ్యలు**

**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రతిపక్ష సభ్యులను ప్రభుత్వం టార్గెట్ చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. తమ పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కేసులు పెడుతున్నారన్నారు. మమ్మల్ని వేధిస్తున్నారు. పోస్టులు డిలీట్ చేయాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని కేటీఆర్ శాసనసభలో తెలిపారు. రాష్ట్రంలో శాంతి, భద్రతలను కాపాడటంలో రాజీపడబోమని, ఎవరిపై వేధింపులు ఉండబోవని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పగా.. దీనిపై కేటీఆర్ స్పందించారు. తాము లేవనెత్తిన కొన్ని అంశాలపై మంత్రి స్పందించలేదన్నారు. ఐపీసీ స్థానంలో తీసుకొచ్చిన కొత్త న్యాయచట్టాలపై కర్ణాటక, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలు కొన్ని సవరణలు తీసుకొచ్చాయని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎలాంటి సవరణలు తీసుకురావడం లేదన్నారు. కేంద్రం తెచ్చిన చట్టాలపై తెలంగాణ ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలన్నారు. సవరణలు చేసే ఉద్దేశం ఉంటే ఎప్పుడు ఆ బిల్లు తీసుకొస్తారో సభకు తెలియజేయాలని కేటీఆర్ కోరారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు, చర్యలకు వ్యతిరేకంగా నిరాహారదీక్షలు చేయడం కూడా కొత్త చట్టాల ప్రకారం నేరమని.. అలాంటి చట్టాల్లో సవరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

**చట్టాలను ప్రభుత్వం దుర్వినియోగం చేయడం సరికాదు..**

తెలంగాణలో పోలీసుల వైఖరిని కేటీఆర్ తప్పుబట్టారు. వివిధ ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలపై అనధికార ఒత్తిడి, బలప్రయోగం సరికాదన్నారు. చట్టాలను ప్రభుత్వం దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. ఇటీవల పౌరహక్కుల సంఘం నాయకులు హైదరాబాద్‌లోని ఓ హాలులో సమావేశం పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వలేదని.. ఇలాంటి విషయాల్లో ప్రభుత్వం మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని కేటీఆర్ సూచించారు. అసెంబ్లీ హాల్‌లో ఫోటోలు, వీడియోలు తీయడంపై కేటీఆర్ స్పందిస్తూ.. పార్లమెంట్‌లో గతంలో కాంగ్రెస్ ఎంపీలు ఫోటోలు, వీడియోలు తీసిఉండొచ్చన్నారు. ఈ వ్యాఖ్యలను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఖండించారు. పార్లమెంట్, అసెంబ్లీలో ఫోటోలు, వీడియోలు తీయడం పూర్తిగా నిషేధమని, అలాంటి చర్యలకు పాల్పడితే స్పీకర్‌కు చర్యలు తీసుకునే అధికారం ఉందన్నారు. తాను మాట్లాడేటప్పుడు మంత్రులు రన్నింగ్ కామెంట్రీ చేయడం సరికాదని కేటీఆర్ పేర్కొన్నారు. ఎవరైనా ఫోటోలు, మార్ఫింగ్ చేస్తే చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో అధికారపక్షం మరింత బాధ్యతతో వ్యవహరించాల్సి ఉంటుందన్నారు.

**అది సహేతుకమైన చర్య కాదు..**

కేటీఆర్ వ్యాఖ్యలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పందించారు. రెండు రోజుల క్రితం అసెంబ్లీ హాల్‌లో తీసిన వీడియో పంపిస్తానని.. అది సహేతుకమైన చర్య కాదన్నారు. అలా వీడియో మార్ఫింగ్ చేసి ప్రచారం చేయడం దుర్మార్గపు చర్యగా, దుశ్చర్యగా స్పీకర్ పేర్కొన్నారు. సభకు సంబంధించిన అంశాలను ఇలా మార్ఫింగ్ చేయడం సరికాదన్నారు. ఆ వీడియో సభ్య సమాజం తలదించుకునేలా ఉందని, వీడియో చూసిన తర్వాత మీరు మాట్లాడాలంటూ కేటీఆర్‌కు స్పీకర్ సూచించారు.

# సభ్యత్వం రద్దు చేస్తే తప్ప బుద్ధిరాదు

**విశ్వంభర, హైదరాబాద్:** ఓ సభ్యుడికి మైక్ ఇవ్వొద్దనే అధికారం బీఆర్ ఎస్ సభ్యులకు ఎక్కడిదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. దానం నాగేందర్ సభలో మాట్లాడితే తప్పేంటంటూ బీఆర్ ఎస్ సభ్యుల తీరుపై మండిపడ్డారు. శుక్రవారం శాసనసభలో ఆయన బీఆర్ ఎస్ సభ్యులు, కేటీఆర్‌ల తీరును ఎండగట్టారు. బీఆర్ఎస్ సభ్యుల తీరును ఓపికతో చూస్తున్నామని.. కోమటిరెడ్డి, సంపత్‌ని గత సభలో ఏం చేసారో మనం చూడలేదా? అని అన్నారు. ఓ అరడజను మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేస్తే గాని వారికి బుద్ధి రాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లాంగ్వేజ్, నాలెడ్జ్ వేర్వరని కేటీఆర్ తెలుసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హితవు పలికారు. అవతలి వారిని అవహేళన చేయకూడదనే అవగాహన ఆయనకు ఉండాలన్నారు. గత ప్రభుత్వంలో గజ్వేల్‌కు ఇచ్చిన నీటిని శ్రీపాద ఎల్లంపల్లి పైప్ లైన్ నుంచి తీసుకెళ్లినట్లు సీఎం ఆరోపించారు. చంద్రబాబు, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డిల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నా హైదరాబాద్ అభివృద్ధికి వారిద్దరూ కృషి చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా చెప్పారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డును వైఎస్ఆర్ మణిహారంగా తీర్చిదిద్దారని రేవంత్ రెడ్డి కొనియాడారు. ఓఆర్ఆర్ లోపల నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు హైడ్రాను సిద్ధం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

**మూసీ ప్రక్షాళనపై డీపీఆర్ అడుగుతున్నారు..**

గత ప్రభుత్వంలో కాళేశ్వరం కట్టడం, కూలడం రెండూ జరిగిపోయినట్లు రేవంత్ రెడ్డి అన్నారు. అయినా ఇంత వరకు ఎలాంటి డీపీఆర్ లేదని, కానీ మూసీ అభివృద్ధి పనులు మొదలుపెట్టకముందే కేటీఆర్ డీపీఆర్ అడుగుతున్నారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. మూసీ కబ్జాలను త్వరలోనే తొలగిస్తామని వెల్లడించారు. అలాగే అక్రమంగా నిర్మించిన 10,800ఇళ్లు మూసీపై ఉన్నాయని, వారందరికీ ప్రత్యమ్నాయం చూపించి భూమి కేటాయిస్తామన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంలో క్రైమ్ రేటు తగ్గింది..**

హైదరాబాద్‌లో రోడ్లపై నీరు ఆగకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గుర్తించిన 141ప్రాంతాల్లో డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది ఉంటారని, ఆఫీసులకే పరిమితం అయిన అధికారులను ఫిజికల్ పోలిసింగ్ చేపిస్తున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. అధికారులు రోడ్లపైకి రాకపోతే తానే వస్తానంటూ సీఎం చెప్పారు. బీఆర్ఎస్ హయాంతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో క్రైమ్ రేటు తగ్గినట్లు సీఎం చెప్పుకొచ్చారు. అవసరాన్ని బట్టి ఒక్కో ప్రభుత్వ సంస్థను ఒక్కో సందర్భంలో తీసుకొచ్చారని, అలాగే ఇప్పుడు కాంగ్రెస్ హైడ్రాను తీసుకువస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు.

**శాసనసభ దృశ్యాలను మార్ఫింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి : మంత్రి శ్రీధర్ బాబు**



శాసనసభ ప్రత్యక్ష ప్రసారాల్లోని దృశ్యాలను మార్ఫింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ మేరకు సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. శాసనసభ గౌరవం దిగజార్చే ఎలాంటి చర్యలు సహించబోమని తేల్చి చెప్పారు.

శాసనసభ ప్రత్యక్ష ప్రసారాల్లోని దృశ్యాలను మార్ఫింగ్ చేసి సహచర మంత్రి సీతక్క గౌరవానికి భంగం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ మేరకు సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. శాసనసభ గౌరవం దిగజార్చే ఎలాంటి చర్యలు సహించబోమని తేల్చిచెప్పారు.

తెలంగాణ హైకోర్టు నిర్మాణం : శాసనసభలో తెలంగాణ సివిల్ కోర్టుల సవరణ బిల్లు 2024పై పలువురు సభ్యులు వ్యక్తం చేసిన అభిప్రాయాలపై శ్రీధర్ బాబు సమాధానం ఇచ్చారు. హైకోర్టు నిర్మాణానికి ప్రభుత్వం బడ్జెట్‌లో 1,000 కోట్ల రూపాయలు కేటాయించిందని గుర్తు చేశారు. రాజేంద్రనగర్‌లో 100 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఉన్నత న్యాయస్థాన భవనాలు తెలంగాణ రాష్ట్రం గర్వపడేలా ఉంటాయని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం భూమిని హైకోర్టు నిర్మాణానికి తీసుకోవడం వల్ల పరిశోధనలకు ఎలాంటి ఆటంకం కలగదని స్పష్టం చేశారు. వ్యవసాయ పరిశోధనల కోసం మరో చోట రెట్టింపు భూమి ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు.

జిల్లా కోర్టులకు నూతన భవనాలు, మౌలిక వసతుల కల్పనపై తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇటీవల కేంద్రం రూపొందించిన పలు చట్టాలను యదాతథంగా అమలు చేసే ఉద్దేశం రాష్ట్రానికి లేదని చెప్పారు. న్యాయ శాఖ ఆ చట్టాలను పరిశీలిస్తోందని తెలిపారు. భావ ప్రకటనా స్వేచ్ఛ, పౌర హక్కులకు భంగం కలిగించేలా కేంద్ర చట్టాలు ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గత పదేళ్లలో తాము కూడా నిరసనలు తెలపడానికి అనేక ఇబ్బందులు పడిన విషయాన్ని గుర్తుకు చేశారు. పార్టీ పరంగా ఎప్పుడైనా ధర్నా నిర్వహించాలనుకుంటే అప్పటి ప్రభుత్వం ముందు రోజు రాత్రే గృహ నిర్బంధం చేసేదని ప్రస్తావించారు. తమ ప్రభుత్వంలో హోం శాఖను ముఖ్యమంత్రి నిర్వహిస్తున్నారని పోలీసు విధుల్లో ఎన్నడూ జోక్యం చేసుకోలేదని తేల్చిచెప్పారు. ఎక్కడైనా పోలీసులు అతిగా స్పందించినట్టు తమ దృష్టికి తెస్తే విచారణ జరిపిస్తామని తెలిపారు. అదే సమయంలో శాంతి భద్రతలకు భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్ర ప్రతిష్ఠకు భంగం కలిగించే శక్తులపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. సైబర్ నేరాలను అరికట్టడానికి అవసరమైతే కొత్త చట్టాలు తీసుకొస్తామని అమాయకులెవరూ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి నష్టపడకుండా చూసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. జిల్లా కోర్టుల్లో ప్రస్తుతం 8,91,598 కేసులు పెండింగులో ఉన్నాయని వెల్లడించారు. సిబ్బంది కొరతే ప్రధాన సమస్యైతే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు మంత్రి సీతక్కపై మార్ఫింగ్ వీడియోలు సృష్టించి సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేసిన ఘటనపై శ్రీధర్ బాబు చేసిన అభ్యర్థనకు స్పీకర్ స్పందించి దర్యాప్తుకు ఆదేశాలు జారీ చేశారు.

**దానం నాగేందర్ వీధి రౌడీలా వ్యవహరించాడు: వేముల ప్రశాంత్ రెడ్డి**

దానం నాగేందర్ వీధి రౌడీలా వ్యవహరించాడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. నిండు సభలో దానం నాగేందర్ వీధి రౌడీలా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మాతృమూర్తులను కించపరిచేలా మాట్లాడిన దానంపై స్పీకర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**జాబ్ క్యాలెండర్‌పై కేటీఆర్ నిరసన..**

మరోవైపు జాబ్ క్యాలెండర్‌పై చర్చించేందుకు అవకాశం ఇవ్వలేదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గన్ పార్క్ వద్ద నిరసనకు దిగారు. ఆయనతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ధర్నాలో పాల్గొన్నారు. ఎన్నికలకు ముందు 2లక్షల ఉద్యోగాలు అని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు జాబ్ క్యాలెండర్‌లో పోస్టుల వివరాలు ఎందుకు పెట్టలేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులను రెచ్చగొట్టి ఇప్పుడు బోగస్ జాబ్ క్యాలెండర్ విడుదల చేశారని ఆగ్రహించారు. దీంతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అరెస్టు చేశారు.

# పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం

**విశ్వంభర, హైదరాబాద్ :** నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలో ఏడాదిగా నెలకొన్న నీటి ఎద్దడికి శుక్రవారం తెరపడింది. నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నుండి ఎడమ కాలువకు అధికారికంగా నీటిని విడుదల చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా మూడు జోన్లలో 6.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వరి సాగుకు పేరు గాంచిన నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లోని మొదటి జోన్‌కు శనివారం నుంచి నీరు అందుతుందని ప్రకటించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతోపాటు రెండో జోన్‌కు వచ్చే వారం నుంచి నీరు అందనుంది. పక్షం రోజుల క్రితం నాగార్జున సాగర్ జలాశయంలో 500 అడుగులకు పడిపోయిన నీటి మట్టం 24 గంటల్లో పూర్తి స్థాయి 590 అడుగులకు చేరుకునే అవకాశం ఉంది. ప్రాజెక్టుకు 5.3 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో రోజూ 40 టీఎంసీలకు పైగా వరద నీరు నిల్వ పెరిగింది.వచ్చే ఐదేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం 3035 లక్షల ఎకరాల్లో కొత్త ఆయకట్టును సృష్టిస్తుందని, గ్రామీణ తెలంగాణ ముఖచిత్రాన్ని మారుస్తుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. 6 నుంచి 6.5 లక్షల ఎకరాల్లో కొత్త ఆయకట్టును రూపొందించాలనే వార్షిక లక్ష్యం నిర్దేశించుకున్నామని, పూర్తి నిబద్ధతతో చేస్తామని ఆయన అన్నారు. గత 10 ఏళ్లలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి పారుదల రంగాన్ని నాశనం చేసిందని, సాగునీటి ప్రాజెక్టుల కోసం దాదాపు రూ.1.85 లక్షల కోట్లు ఖర్చు చేసినా చెప్పుకోదగ్గ ఫలితాలు రాలేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు దాదాపు రూ.95 వేల కోట్లు ఖర్చు చేశారని, 95 వేల ఎకరాలు కూడా సాగులోకి రాలేదని విమర్శించారు. అదే విధంగా పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.31 వేల కోట్లు, సీతారామ ప్రాజెక్టుకు రూ.8 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందలేదన్నారు.

మైనర్, మీడియం ప్రాజెక్టులు నిరుపయోగంగా మారడంతో మొత్తం నీటి పారుదల రంగం నిర్లక్ష్యానికి గురై నాశనమైందని ఉద్ఘాటించారు. ఈ ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పునరుజ్జీవం పొందుతాయని ఆయన హామీ ఇచ్చారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు గురించి మాట్లాడుతూ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ హయాంలో దీనిని నిర్మించి ఇందిరాగాంధీ హయాంలో లక్షల ఎకరాలకు సాగునీరు అందించి తాగునీటి అవసరాలను తీర్చారన్నారు. బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టుతో విభేదిస్తూ వేల కోట్ల ప్రజాధనం వృథా అయిందని ఆరోపించారు. నాగార్జున సాగర్ నుంచి విడుదల చేసిన నీరు ఎడమ కాలువ కింద ఉన్న ప్రాంతాల్లో సాగునీరు, తాగు నీటికి ఉపయోగపడుతుందని దాని మార్గంలో ఉన్న పాత చెరువులు, చెరువులను పునరుద్ధరిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తాను కలిసి సాగునీటి రంగాన్ని పటిష్టం చేయడంతోపాటు తెలంగాణ నలుమూలలకూ సాగునీరు, తాగునీరు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఆదేశాల మేరకు మరమ్మతులు చేయిస్తున్న మేడిగడ్డ బ్యారేజీని నింపాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం బ్యారేజీ పనులు నాసి రకంగా జరగడానికి బీఆర్ఎస్ కారణమని, ఎన్‌డీఎస్‌ఏ సలహా లేకుండానే రిజర్వాయర్లు నింపాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం కుంభకోణంపై న్యాయ విచారణ కొనసాగుతోందని, బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

202425 బడ్జెట్‌లో నీటి పారుదల రంగానికి రూ.22,500 కోట్లు కేటాయించామని, రూ.10,820 కోట్లు ప్రాజెక్టులకు, మిగిలిన మొత్తాన్ని రుణాల చెల్లింపులు, వడ్డీలు, ఇతర పనులకు ఖర్చు చేయాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వచ్చే ఐదేళ్లలో నల్గొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

## తెలంగాణలో ఆడపిల్లలపై ఆగని అఘాయిత్యాలు

### - రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలో మహిళలపై వరుస అత్యాచారాలు జరుగుతున్న తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చలనం రావట్లేదని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డా. శిల్పారెడ్డి మండిపడ్డారు. గురువారం జరిగిన ఉప్పల్ లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ లో 9వ తరగతి చదువుతున్న మైనర్ అబ్బాయి అదే స్కూల్ లో 2 వ తరగతి చదువుతున్న బాలిక పై లైంగిక దాడి చేసాడు. స్కూల్ యాజమాన్యం పట్టించుకోకపోవడమే కాకుండా ఈ సంఘటనను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని మహిళా మోర్చా నాయకురాళ్లు స్కూల్ ముందు నిరసనకు దిగారు. రాష్ట్రంలోని స్కూళ్లలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశంపై అవగాహన గాని స్టూడెంట్ కౌన్సిలింగ్ సెషన్స్, పేరెంట్స్ కమిటీ ఏవీ లేవని తెలిపారు. లైఫ్ స్కిల్స్, సెల్ఫ్ డిఫెన్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్మెంట్ కింద 2014 బడ్జెట్ లో ప్రతి విద్యార్థికి నెలకు 50 రూపాయల చొప్పున మోడీ కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికి అమలు చేయడం లేదని శిల్పారెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆపే ప్రయత్నం చేయాలనీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లేనియెడల తెలంగాణ బీజేపీ మహిళా మోర్చా తరుపున ఉధృతంగా పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.

## ధరణిపై దగాచేసిన పెద్దాయన

### అసెంబ్లీలో పొంగులేటి వ్యాఖ్య

**విశ్వంభర, హైదరాబాద్:** భూసంస్కరణలకు ఇందిరాగాంధీ శ్రీకారం చుట్టారని, ప్రధానిగా ఉన్నప్పుడు పీవీ నరసింహారావు కూడా భూసంస్కరణలు చేశారని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో ఆయన భూసంస్కరణలు, ధరణిపై చర్చ సందర్భంగా మాట్లాడారు. ప్రపంచ చరిత్రలో నిలిచిన భూదాన ఉద్యమం తెలంగాణాలోనే పుట్టిందన్నారు. 1973లో కాంగ్రెస్ ప్రభుత్వం సీలింగ్ చట్టం తెచ్చిందని, ఆ చట్టంతోనే పేదలకు భూములు పంచిందని తెలిపారు. వైఎస్ హయాంలో పోడుభూములకు పట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు.

"భూసంస్కరణల్లో విప్లవాత్మక మార్పులు తెస్తామని అనేకమంది చెప్పారు. ఎక్కడ చూసినా భూసమస్యలే కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ లోపభూయిష్టంగా ఉంది. ధరణి తెచ్చిన సమస్యలకు పేదరైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ధరణి పేరుతో అప్పటి పెద్దాయన ప్రజలను దగా చేశారు. ఆ పోర్టల్ వల్ల ప్రజలు చాలా సమస్యలు ఎదుర్కొన్నారు"అని పొంగులేటి అన్నారు.




# భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్లు

**ముంబయి:** స్టాక్ మార్కెట్లు బుధవారం భారీగా నష్టపోయాయి. దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల వరుస లాభాలకు బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో సూచీలు శుక్రవారం భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్ దాదాపు 900 పాయింట్లు నష్టపోగా.. నష్టాల ధాటికి నిఫ్టీ 24,700 స్థాయికి చేరింది. అమెరికాలో వెలువడిన ఫ్యాక్టరీ డేటా ఆ దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనాన్ని సూచిస్తుండడం మదుపర్లలో భయానికి కారణమైంది. దీంతో ఆసియా పాటు మన మార్కెట్లూ నష్టపోయాయి. మదుపర్ల సంపద ఒక్క సెషన్లోనే దాదాపు రూ.5 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.462 లక్షల కోట్ల నుంచి రూ.457 లక్షల కోట్లకు తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 81,158.99 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,867.55) నష్టాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో వెయ్యి పాయింట్లకు పైగా నష్టంతో 80,868.91 వద్ద కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్ చివరికి 885.60 పాయింట్ల నష్టంతో 80,981.60 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 293 పాయింట్ల మేర నష్టపోయి 24,717 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.60గా ఉంది.

సెన్సెక్స్‌లో హెచ్‌ఎఫ్సీ బ్యాంక్, సన్ఫార్మా, కోటక్ మహీంద్రా బ్యాంక్, నెస్లే ఇండియా, ఏషియన్ పెయింట్స్ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్, ఎల్అండ్ టీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 79.62 డాలర్లు వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు తొలిసారి 2,506 డాలర్ల గరిష్ఠాల వద్ద కొనసాగుతోంది.

కారణాలు ఇవే..

* అమెరికా నుంచి నిన్న వెలువడిన ఫ్యాక్టరీ డేటా ప్రపంచ మార్కెట్లలో ఆందోళనకు కారణమైంది. జులై నెలకు గానూ మానుఫాక్చరింగ్ పీఎంఐ 46.8గా నమోదైంది. 50 కంటే దిగువ ఉండటం అంటే తయారీ రంగంలో మందగమనాన్ని సూచిస్తోంది. ఈ క్రమంలో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిపై ఆందోళనల నెలకొనడంతో ప్రపంచమార్కెట్లు నెగిటివ్ స్పందించాయి.
* పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ హమాస్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కూడా మార్కెట్లపై ప్రభావం చూపాయి.
* దేశీయ మార్కెట్ సూచీలు ఇప్పటికే గరిష్ఠ స్థాయిలకు చేరుకున్నాయి. ఈ క్రమంలో ఆందోళనకరమైన వార్తలు రావడం కరెక్షన్కు గురయ్యాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

స్టాక్ మార్కెట్లపై బేర్ పంజా.. భారీగా నష్టపోయిన ఇన్వెస్టర్లు..!

ఆటో, ఐటీ, రియాల్టీ సెక్టర్లలో ఒత్తిడి కనిపించింది. బీఎస్ఈ 30 ఇండెక్స్ లో హెచ్ డీఎఫ్ సీ, సన్ ఫార్మా, నెస్లే ఇండియా, ఏసియన్ పెయింట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్ లాభాల్లో ముగిశాయి.

అదానీ పోర్ట్స్, టాటైన్, బజాజ్ ఫైనాన్స్, ఇండుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ, బజాజ్ ఫిన్ సర్వ్, భారతి ఎయిర్ టెల్, యాక్సెస్ బ్యాంక్, పవర్ గ్రిడ్, ఐటీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, రిలయన్స్, ఎస్బీఐఎన్, అల్ట్రాటెక్ సిమెంట్, ఇన్ఫోసిస్, హెచ్ సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, టీసీఎస్, ఎంఅండ్ఎం, టాటా స్టీల్, ఎల్అండ్ టీ, జేఎస్ డబ్ల్యూ స్టీల్, టాటా మోటార్స్, మారుతి నష్టాల్లో ముగిశాయి.

నిఫ్టీ50లోని 42 స్టాక్స్ నష్టాల్లో స్థిర పడ్డాయి. ఎచిర్ మోటార్స్, టాటా మోటార్స్, మారుతి సుజుకి ఇండియా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ స్టాక్స్ ఐదు శాతం వరకు నష్టపోయాయి. మరోవైపు, దివిస్ ల్యాబ్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, సన్ ఫార్మా, బ్రిటానియా ఇండస్ట్రీస్ స్క్రిప్‌ట్‌లు భారీగా లబ్ధి పొందాయి. బీఎస్ఈలో మారుతి సుజుకి, టాటా మోటార్స్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, లార్సెన్ అండ్ టర్బో భారీగా నష్టపోగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, సన్ ఫార్మా, నెస్లే ఇండియా లబ్ధి పొందాయి. బ్రాడర్ మార్కెట్లో బీఎస్ఈ స్మాల్ క్యాప్, మిడ్ క్యాప్ స్టాక్స్ నష్టాలతో ముగిశాయి. మిడ్ క్యాప్ ఇండెక్స్ భారీగా నష్టపోయింది. నిఫ్టీ రియాల్టీ, నిఫ్టీ ఆటో, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ మెటల్ సెక్టార్ల స్టాక్స్ 23 శాతం వరకూ నష్టపోగా ఫార్మా, హెల్త్ కేర్ సెక్టార్ షేర్లు కొంత లాభాలతో ముగిశాయి.బీఎస్ఈలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, సన్ ఫార్మాతోపాటు ఐదు స్టాక్స్ మాత్రమే లాభ పడ్డాయి. బీఎస్ఈ స్మాల్ క్యాప్, మిడ్ క్యాప్ 1.2 శాతం వరకూ పతనం అయ్యాయి. ఫారెక్స్ మార్కెట్లో యూఎస్ డాలర్ మీద రూపాయి మారకం విలువ మరో జీవిత కాల కనిష్టం రూ.83.75 లకు పడిపోయింది. టీటీకే హెల్త్‌కేర్ రూ. 1,666.20 వద్ద, రూ. 53.15 లేదా 3.30 శాతం పెరిగి రూ. 1,800 వద్ద 52 వారాల గరిష్ట స్థాయిని తాకింది. కేపీఐ గ్రీన్ ఎనర్జీ యొక్క పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థ అయిన సన్ డ్రాప్స్ ఎనర్జియా, 'క్యాప్టివ్ పవర్ ప్రొడ్యూసర్ (సిపిపి)' కింద 28.40 మెగావాట్ల సంచిత సామర్థ్యంతో సౌర విద్యుత్ ప్రాజెక్టులను అమలు చేయడానికి లెటర్స్ ఆఫ్ ఇంటెంట్‌ను అందుకుంది. కేపీఐ గ్రీన్ ఎనర్జీ రూ. 28.15 లేదా 2.93 శాతం పెరిగి రూ. 988.10 వద్ద ఉంది.

## మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మిస్తాం

### సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలో మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి ప్రకటించారు. బేగరికంచలోని స్కిల్ యూనివర్సిటీకి సమీపంలో ఈ నిర్మాణం చేపడతామని తెలిపారు. దీనిపై బీసీసీఐతో ప్రాథమిక చర్చలు పూర్తిచేశామన్నారు. శాసనసభలో సీఎం మాట్లాడారు.రాష్ట్రంలో క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. త్వరలోస్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తామన్నారు. దీనికోసం హరియాణా విధానాన్ని పరిశీలిస్తున్నట్లువెల్లడించారు. క్రీడల కోసం బడ్జెట్లో రూ.321కోట్లు కేటాయించామన్నారు. యూసుఫ్ గూడ,గచ్చిబౌలి, సరూర్నగర్ స్టేడియాల్లో క్రీడలు తగ్గాయని చెప్పారు. ఎల్బీ స్టేడియంలో క్రీడలు తగ్గి..రాజకీయ కార్యకలాపాలు పెరిగాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ క్రికెటర్మహమ్మద్ సిరాజ్కు గ్రూప్1 ఉద్యోగం ఇస్తున్నామన్నారు. బాక్సర్ నిఖత్ జరీన్కు ఆర్థికసాయం చేశామని.. ఇంటిస్థలం కూడా కేటాయించామని తెలిపారు. వ్యసనాల నుంచి యువతను బయటకు తీసుకురావాలంటే క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉందన్నారు. వచ్చే సమావేశాల్లో క్రీడలకు సంబంధించిన పాలసీ తీసుకొస్తామని.. దీనికి సంబంధించి ప్రతిపక్షాలు సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామని తెలిపారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తిని పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దీనికి అందరూ సహకరించాలని సీఎం కోరారు.



తెలంగాణ ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి చాయా చిత్రాన్ని అమ్మనబోలు జడ్.పి.హెచ్.ఎస్ లో పనిచేసిన కూరెళ్ల శ్రీనివాస్ డ్రాయింగ్ డ్రాయింగ్ వేసి సీఎం కు బహుకరించాడు.

- విశ్వంభర, హైదరాబాద్

## దానం నాగేందర్ వ్యాఖ్యలతో గందరగోళం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీలో కొద్ది సేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. శుక్రవారం హైదరాబాద్ నగరంలో అభివృద్ధి కార్యక్రమాలపై సభలో స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ చర్చను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రారంభించారు. బీఆర్ఎస్ సభ్యులనుద్దేశించి పరుష పదజాలం ఉపయోగించారని ఆ పార్టీ సభ్యులు నిరసనకు దిగారు. సభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. దానం వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన బీఆర్ఎస్ సభ్యులు పోడియంవైపు దూసుకొచ్చారు. ప్రతిగా దానం కూడా పోడియంవైపు రావడంతో కాంగ్రెస్ సభ్యులు ఆయన్ను వెనక్కి తీసుకెళ్లారు. దానం నాగేందర్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్యే కేటీఆర్ బీఆర్ఎస్ సభ్యులతో కలిసి సభ నుంచి బయటకు వెళ్లిపోయారు.

అనంతరం బీఆర్ఎస్ సభ్యులపై చేసిన వ్యాఖ్యలను దానం నాగేందర్ వెనక్కి తీసుకుంటానని, సభాపతికి క్షమాపణలు చెప్పారు. తాను సభలో గతంలో ఎప్పుడూ ఇలా మాట్లాడలేదన్నారు. తాను చేసిన వ్యాఖ్యల పట్ల దానం విచారం వ్యక్తం చేశారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు చెప్పారు. తనను రెచ్చగొట్టారని, దీంతో తాను మాట్లాడవలసి వచ్చిందని దానం వివరణ ఇచ్చారు. తన గురించి, తన పనితీరు గురించి అందరికీ తెలుసునన్నారు. అయినప్పటికీ తాను ఉపయోగించిన పదజాలం హైదరాబాద్, తెలంగాణలో మామూలే అన్నారు దానం. దీంతో మరోసారి బీఆర్ఎస్ సభ్యులు, ఎంఐఎం సభ్యులు అభ్యంతరం తెలిపారు. ఈ నేపథ్యంలో స్పందించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్... దానం వ్యాఖ్యలను పరిశీలించి అవసరమైతే రికార్డుల నుంచి తొలగిస్తామన్నారు. దానం చేసిన వ్యాఖ్యలను ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తప్పుబట్టారు. ఇలాంటి వ్యాఖ్యలు సరికాదని, క్షమాపణలు చెప్పాలన్నారు. కాగా, దానం నాగేందర్ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడంపై బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. దానంకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. దానం వ్యాఖ్యలపై నిరసనగా సభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. ఆ తర్వాత గన్ పార్క్ వద్ద జాబ్ క్యాలెండర్ లో ఉద్యోగాల సంఖ్యను ప్రకటించకపోవడంపై, దానం వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ సభ్యులు భారీ నిరసన చేపట్టారు.

## బీఎస్ఎఫ్ డీజీ తొలగింపు కేంద్రం అనూహ్య నిర్ణయం

**ఢిల్లీ:** దేశ సరిహద్దు భద్రతా దళం బీఎస్ఎఫ్ సంబంధించి కేంద్ర ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నితిన్ అగర్వాల్తోపాటు డిప్యూటీ స్పెషల్ డీజీ (పశ్చిమ) వైబీ ఖురానియాలను తొలగించింది. తక్షణమే వారిని తమ రాష్ట్ర కేడర్లకు వెళ్లిపోవాలని ఆదేశించింది.

నితిన్ అగర్వాల్ కేరళ కేడర్ 1989 బ్యాచ్ అధికారి కాగా, ఖురానియా ఒడిశాకు చెందిన 1990 బ్యాచ్ అధికారి.బీఎస్ఎఫ్ చీఫ్ గా నితిన్ అగర్వాల్ గతేడాది జూన్లో బాధ్యతలు చేపట్టారు. పాకిస్థాన్ సరిహద్దు బలగాలకు స్పెషల్ డీజీ (పశ్చిమ) ఖురానియా నేతృత్వం వహిస్తున్నారు. ఆయా బాధ్యతల నుంచి వీరిని తక్షణమే తొలగిస్తున్నట్లు కేబినెట్ నియామకాల కమిటీ వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. బీఎస్ఎఫ్కు చెందిన 2.65 లక్షల మంది పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దులకు రక్షణగా నిలుస్తున్న విషయం తెలిసిందే.



# ఉత్తరాంధ్ర జానపద కళా కీర్తి కిరీటం తప్పెటగుళ్ళు

"
ఆల గొల్లలు తమ వారసత్వంగా వస్తున్న కళ ను బతికించుకోవడం కోసం ఇల్లు వదిలిపెట్టి ఊర్లు తిరుగుతూ ఇరవై, ముప్పయి రోజులు రాత్రింబవళ్లు, శిక్షణ ఇస్తూ మండలానికి ఒక బృందాన్ని తయారు చేస్తూ, ఆర్థికపరమైన సంపాదన ఆశించకుండా ,ఒక కఠోర శ్రమ చేయడం ఆలగొల్లల జీవన విధానం గా మారింది. బతకలేని పరిస్థితి లోఒక్కొక్కరుగా వదిలేస్తూ చివరకు అది కనుమరుగయ్యే సమయం లో, తలకెత్తుకొని తనకున్న ముగ్గురు కొడుకులను ఆకళ కే అంకితం చేసి తను బతికి ఉన్నంతకాలం కళ ను బతికించాలనే తపనతో పని చేస్తున్న ఆ జానపద కళాకారుడి పేరే నీలబోను సత్యం. ఉత్తరాంధ్ర జానపద కళా కీర్తి కిరీటంగా వెలుగొందుతున్న ఆ జానపదకళపేరే తప్పెటగుళ్ళు. ఆలగొళ్ళల కులవృత్తి లో భాగమైన తప్పెటగుళ్ళు కనుమరుగయ్యే స్థితి నుండి నేడు ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ లో *పరిశోధనలు జరిగే స్థాయికి చేరిన ఆ కళా ప్రదర్శన విధానం గురించి, ఆ కళాకారులు పడే కష్టాల గురించి, ...ఉస్మానియా యూనివర్సిటీ లో తప్పెట గుళ్లు కళపై పరిశోధన చేస్తున్న పరిశోధక విద్యార్థిగా ఈ వ్యాసంలోవివరించే ప్రయ త్నం చేస్తాను..



ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఆలగొల్లలు గావు పండుగలు చేసుకున్నప్పుడు ప్రదర్శించే జానపద నృత్య కళ తప్పె టగుళ్ళు. ఇది ఎక్కువగా యాదవులు, కురుమలు ప్రదర్శిస్తారని నేను క్షేత్ర పర్యటనలో భాగంగా శ్రీకాకుళం, విజయనగరం ,విశాఖపట్నం ,ప్రాంతాల్లో పర్యటించినప్పుడు తప్పెట గుళ్ళు కళాకారులు చెప్పారు..... 195060 ప్రాంతం లో ఉత్తరాంధ్రలో ఈ జానపద కళ ప్రఖ్యాతిగాంచింది. అప్పట్లో దేవర రాములు తప్పెట గుళ్ళు కళా ప్రదర్శనలు ప్రఖ్యాతిగాంచారని అతని ఇంటర్వ్యూ చేసినప్పుడు తెలిసింది అతని కళా ప్రదర్శనకు మెచ్చి అప్పటి ప్రభుత్వ పెద్దలు తన కాలికి తొడిగిన గండే పెండేరం లాంటి వెండి గొలుసును అతను మాటల సందర్భం లో నాకు చూపించాడు. ఇప్పటికీ 90 సంవత్సరాల వయసులో ఆ కల బ్రతికితే చాలని సహృదయంతో విన్నవించుకున్నాడు.

**తప్పెటగుళ్ళు వేషధారణ..**

మువ్వల నెక్కరు, కాళ్లకు గజ్జలు, తలపాగా ,తాషా ఆకారంలో ఉన్న డప్పు,ఛాతికి ముందూ, వెనక రెండు లంగోటాలు, నడుము చుట్టూ బంతులు, మెడకు కాసులు ,చెవి దిద్దులు ,చాలా చూడముచ్చటగా కొత్తదనంగా తప్పె ట గుల్ల కళాకారుల ఆహార్యం కనిపిస్తుంది.....

విన్యాసాలు నేను విజయనగరంలో జీకేఆర్ పురంలో నీలబోను సత్యం గారి ప్రదర్శన చూసినప్పుడు వాళ్ళ టీం సభ్యులు చేసిన విన్యాసాలు ఒళ్ళు గగుర్పొడిచే లా ఉన్నవి .వారు

సమ పాదం, స్థిత వర్తము ,శకటాస్య , ఆధ్యార్నిక ,విన్యాసాలు పాదాల మీద మార్చుతూ చేశారు. మొగ్గలు వేయడం ,చెట్లు కట్టడం ,పల్టీలు కొట్టడం ,కంటితో సూది తీయడం, నోటితో నీటి బిందెలు తీయడం, మండీలు కొట్టడం (కాళ్ళ పై ఎగిరి కిందికి దూకడం) ,గుంజీలు తీయడం ,మట్టి కుండ పై నాట్యం మొదలగునవి. ఇందులో ఏ విన్యాసం కుడి ఎడ మైనా కాళ్లు ,చేతులు విరగడం ఖాయమని చెప్పాలి.... ఇక్కడ చెప్పాల్సిన ఇంకో విషయం ఏమిటంటే చాతికి కట్టుకున్న ఎవరి డప్పు ను (తప్పెట) వారే వాయిస్తూ గజ్జలతో ఎగురుతూ, పాట పాడుతూ, విన్యాసాలు ప్రదర్శిస్తారు. అంటే సంగీతం ,సాహిత్యము ,నాట్యము, కలగలిపిన ఒకే ఒక జానపద నృత్యకళ తప్పెట గుళ్ళని చెప్పవచ్చు...... ఇక్కడ ఒక ముఖ్యమైన కళాకారుడు నీల బోను సత్యం గురించి చెప్పే ప్రయత్నం చేస్తాను... రంగస్థలం సినిమాలో నారాయణ శ్రీమన్నారాయణ అనే ఒక బాణి సినిమా స్వరూపాన్నే మార్చి చిట్టిబాబు అన్నను చంపిన హంతకులను హతమార్చి రంగస్థలం కు ఒక కొత్త సర్పంచ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకునేలా చేస్తుంది. ఆ నృత్యం చేస్తూ గంభీరమైన ముఖ వర్చస్సు తో పొడగాటి జుట్టు , మెలి తిరిగిన మీసాలతో ...."నారాయణ శ్రీమన్నారాయణ "అనే పదాన్ని పాట రూపంలో పలికిన వ్యక్తి పేరే నీల బోను సత్యం.ఆ నృత్యం పేరే తప్పెట గుళ్ళు.. తాను నమ్ముకున్న కళ ను తన వారసత్వంగా తనకున్న ముగ్గురు కుమారులకు నేర్పిస్తూ , జీవనం గడపడం, ఎంత కష్టమైనా ఆ కళ ను వదిలే ప్రసక్తే లేదని చెప్పారు. విజయనగరం జిల్లాలోని ఒక చిన్న గ్రామమైన (జీఆర్కే పురం) గోపాలకృష్ణ రంగరాయపురం నుండి జాతీయస్థాయికి, ప్రపంచ స్థాయికి ,తప్పెట గుళ్ళు కళ ను తీసుకెళ్లడం తో పాటు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డును సొంతం చేసుకోవడం ,గల్లీ నుండి ఢిల్లీ దాకా ఎక్కడైనా ప్రదర్శించడం ,బ్రతికి ఉన్నంతకాలం అంకిత భావంతో ఉంటానని ప్రమాణం చేయడం అంటే తప్పెటగుళ్లు నుండి సత్యం ను వేరు చేసి చూడలేము అని చెప్పవచ్చు .....

సత్యం గారు దాదాపు 1988 నుండి ఈ కళ నే నమ్ముకుని బతుకుతున్నాడు. ఒకరకంగా చెప్పాలంటే ఈ కల కోసమే బ్రతుకుతున్నాడు . ఐదవ తరగతి వరకు చదువుకున్నాడు. తల్లిదండ్రులు అప్పలస్వామి, గంగవ్వ భార్య తేజమ్మ ,పిల్లలు తిరుపతి ,అలివేలు, రామలక్ష్మణులు (కవలలు) చదువుకుంటూనే వీరు ఈకళ లోప్రావీణ్య సంపాదించారు... వీరు కళా ప్రదర్శన లో భాగంగా

శశిరేఖా పరిణయం ,ఎల్లమ్మ కథ ,సాంబ దేవుడు పెళ్లి ,చెంచులక్ష్మి, సారంగధర చరిత్ర ,మాల వారి మంగమ్మ ,రెల్లి అప్పమ్మ , మొ.వాటి తో పాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రచారాలు (కుటుంబ నియంత్రణ) కథలుగా చెబుతారు. ఇవన్నీ పైడితల్లి జాతర విజయనగరం, విశాఖ జానపద ఉత్సవాలు, గావు సంబరం ,గంగమ్మ పండుగ ,సింహాద్రి అప్పన్న జాతర ,దేవీ నవరాత్రి ఉత్సవాలు, గణేష్ ఉత్సవాలు మరియు తిరుమల తిరుపతి దేవస్థానం ఉత్సవాల్లో ప్రదర్శిస్తారు. ప్రదర్శన కోసం ముందుగా అన్ని సమకూర్చుకొని కబురు అందగానే అందరూ ఒకే దగ్గర చేరుకునేలా చేస్తాడు సత్యం. వీరి శిష్యులు ఉత్తరాంధ్ర లో ప్రతి మండలంలో కనీసం 30 మంది ఉంటారంటే అతిశయోక్తి కాదు. ఎంతో ప్రతిభ ఉండి ఎందరో శిష్యులు కలిగిన సత్యం గారు ఉపాధి లేక పోయినా తప్పెటగుళ్ళ కళను బ్రతికించడం కోసమే పాటుపడుతూ వందల, వేల కిలోమీటర్లు ప్రయాణం చేస్తూప్రదర్శన లు, ఇస్తూ కళ బ్రతికితే చాలు అనే ఆలోచనతో జీవితాన్ని కొనసాగిస్తున్నారు.... విజయనగరం జిల్లాలో *సరైవలస కొత్తవలస, సీతానగరం, తాళ్లపూడి ,పార్వతీపురం ,కుంచిరెడ్డి పాలెం ,కొండపల్లి ,పెద్దపల్లి బాడంగి ,కోటిపల్లి ,హిందూపురం ,బాలకృష్ణాపురం, యరండ్ర ,మరువల్లి, గజపతినగరం. .... అలాగే శ్రీకాకుళంలో తాటిపాలెం ,అప్పల అగ్రహారం ,ముకుతపాలెం ,విశాఖ జిల్లాలో శివాజీ పాలెం , సీ తన్నపేట, కుశలవాడ ,గుండు పాలెం, గ్రామాల్లో 20 నుండి 30 రోజులు రాత్రి పగలు శిక్షణ ఇచ్చి వేల మందిని తయారు చేసి తప్పె ట గుళ్ళ నృత్య కళ ను అభివృద్ధి చేస్తున్నారు.. సత్యం గారు. ఈ గ్రామాలన్ని తిరుగుతూ ప్రతి గ్రామంలో నెలరోజులు నివాసం ఉండి వారికి పాట, విన్యాసాలు, రాగం, కథలు ,అన్ని నేర్పించి ఒక బృందాన్ని తయారు చేస్తారు .ఆ బృందం చేత వివిధ సందర్భాల్లో ,జాతరలో ఏపీ టూరిజం కార్యక్రమాల్లో పాల్గొని ప్రదర్శనలు ఇప్పిస్తుంటాడు. ఇది మా పూర్వీకుల నుండి వస్తున్న కళ దీన్ని పది కాలాల పాటు సమాజంలో ఉండేలా చేయాలన్నదే తన లక్ష్యం అని చెప్తాడు సత్యం వినమ్రంగా....

నీల బోను బోను సత్యం ఇచ్చిన జాతీయ స్థాయి ప్రదర్శనలు.. నాగాలాండ్ రాజధాని కోహిమాలో, ఏపీ టూరిజం జానపద కళారూపం తరపున పాల్గొని ప్రదర్శన ఇచ్చాడు పశ్చిమబెంగాల్లోని కలకత్తాలో ,ఒరిస్సా రాజధాని భువనేశ్వర్ లో, పూరి జగన్నాథ రథయాత్ర సందర్భంగా, న్యూఢిల్లీ లోని శిల్పారామంలో, హర్యానాలోని సూరజ్ ఖండ్ మేళా లో, దూరదర్శన్ బెంగుళూరు, ఆకాశవాణి బెంగళూరు ,వారి ఆహ్వానం మేరకు ప్రదర్శనలు ఇచ్చారు... తెలంగాణలో హైదరాబాద్ శిల్పారామంలో సంక్రాంతి సంబరాల సందర్భంగా ప్రదర్శన ఇచ్చారు. చెన్నై జాతీయ నృత్య కళా పోటీలో పాల్గొని ప్రథమ బహుమతి పొందిన సత్యం గారికి బిరుదు లు గౌరవాలు కూడా వచ్చాయి .గండ పెండేరంతో కనకాభిషేకం చేసిన సంస్థలు నృత్య కళా రత్న అనే బిరుదును కూడా ప్రసాదిం చా యి ...

**తప్పెటగుళ్ళు కళా ప్రదర్శన సినిమా ప్రస్థానం**

రంగస్థలం సినిమా ద్వారా తప్పెటగుళ్ళు ప్రదర్శన తెలుగు రాష్ట్రాల్లో కొన్ని నెలల పాటు మారుమోగింది....కానీ అంతకుముందే ఆర్ నారాయణ మూర్తి గారి అన్నదాత సుఖీభవ తో పాటు పలాస, వెంకీ మామ, నమో వెంకటేశా, నాగార్జున నాని కలిసి నటించిన దేవదాసు సినిమాల్లో కూడా తప్పెట గుళ్ళు ప్రదర్శన ఒక వెలుగు వెలిగింది.....

నా ఈ క్షేత్ర పర్యటన మొత్తం విజయ విజయవంతం కావడానికి గురజాడ పేరు మీద స్కూల్ నడిపిస్తున్న శ్రీ కృష్ణాజీ గారు మాకు ఎంతగానో సహకరించారు. మనిషి గంభీరంగా ఉన్నప్పటికీ చాలా అభ్యుదయ భావాలు ఉన్న వ్యక్తి . ఆంధ్రా లో జనవిజ్ఞాన వేదిక లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. మాతో ప్రేమగా మాట్లాడి మా పరిశోధన గురించి తెలుసుకున్నాడు మాకు కొన్ని పుస్తకాలు కూడా బహుమతిగా ఇచ్చాడు .

తర్వాత డప్పు శ్రీను అన్నను కలవమని చెప్పి మమ్మల్ని కారులో పంపించిన మంచి మనిషి కృష్ణాజీ గారు .అతడి చొరవతోనే మా ఫీల్డ్ వర్క్ సజావుగా సాగిందని చెప్పగలను. డప్పు శ్రీను అన్న ను కలిసి కళా ప్రదర్శన గురించి ఇంటర్వ్యూ చేశాము . ఆ తర్వాత రాజశేఖర్ అన్న గారి సహాయంతో వైటాల్ అనే హోటల్లో బస చేసి మరొక రోజు ఉండి మా క్షేత్ర పర్యటన ముగించుకున్నాము. ఇక్కడ చెప్పవలసిన ఇంకొక విషయం ఏమిటంటే తప్పెట గుళ్ళు అనే కళా ప్రదర్శనలో స్త్రీలు ఎక్కువగా ఎవరు ఉండరు. కానీ విజయనగరంలో పక్కనే 10 కిలోమీటర్ల దూరంలోనివాసం ఉన్న గంగ అనే కళాకారిణి దగ్గరికి వెళ్ళాము .గంగది ఒక విషాద గాథ. తప్పెట గుళ్ళు ప్రదర్శించే స్త్రీలు లేరు .అయినా చాలా కష్టాలకు ఓర్చి ఆమె ప్రదర్శనలు ఇచ్చింది. తప్పెట గుళ్ళు లో మండీ లు కొట్టడం , ఆగ కుండా, 12 గంటలు ప్రదర్శన ఇవ్వడం , గంగ ప్రత్యేకత.ప్రస్తుతం దీనావస్తలో ఉందని ఆమె ను ఇంటర్వ్యూ చేయడం ద్వారా ,ఆమె నివాసం కమ్మల గుడిసె ను చూసాక , ఎవరూ లేరని, తెలిసింది. గంగక్క వృత్తాంతం విన్నప్పుడు నిజంగా నాకు కన్నీళ్లు వచ్చాయి. తప్పెట గుళ్ళు కళ ను నమ్ముకుని చివరకు ఏమీ లేకుండా బతుకెల్ల దీ స్తున్న గంగ పై ఒక డాక్యుమెంటరీ తీసినా సరిపోయే కథ ఉంది.

నేను తిరిగి విజయనగరం వెళ్ళేసరికి అక్కడ నాతోపాటు సూర్యాపేట నుండి వచ్చిన సోదర పరిశోధక విద్యార్థి యం. సైదులు మెంటాడనుండి పల్లి తిరుపతి రావు గారు రాసినటువంటి తప్పెట గుళ్ళు "పుస్తకాన్ని కృష్ణాజిగారి సహాయం తో , సాక్షి బ్యూరో ఇన్చార్జి సూరిబాబు గారి చొరవతో రిపోర్టర్ నాయుడు గారు ఆ పుస్తకాన్ని మాకు అందజేశారు.....

ఇన్ని కష్టాలకోర్చి ఇన్ని ప్రదర్శనలు ఇచ్చినప్పటికీ నీల బోని సత్యం, అతని శిష్యులు దినసరి కూలీలు గానే మారారు. వీరు గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లో వలస పోయి బ్రతుకుతున్నారు .వీరి ప్రదర్శన సమాజ శ్రేయస్సు కోసం సంఘంలో స్నేహభావం, సమా న త్వాన్ని, నేర్పుతూ నృత్య కళ ను సజీవం గా ఉంచాలన్నదే సత్యం గారి తపన. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కళాకారులకు పింఛన్ కానీ ఏదైనా ఉపాధి కానీ చూపి సహాయ సహకారాలు అందిస్తే మా బతుకులకు భరోసా ఉంటుందని సత్యం గారు ఆవేదన వ్యక్తం చేశారు.సింహాద్రి అప్పన్న ఉన్నంతకాలం తప్పెట గుళ్ళు నృత్య కళ బ్రతికి ఉంటుందని అది చిరకాలం వర్ధిల్లాలని నేను ఆశతో హైదరాబాద్ బస్సు ఎక్కాను.



డాక్టర్ తెల్జల గిరీశం
9160306564

# తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి ప్రదాత ప్రియంవద

**నేడు ఆమె వర్ధంతి**

హైదరాబాద్ సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుంచి 1948 మధ్య వీరోచిత పోరాటం చేశారు. దీన్నే తెలంగాణ విమోచనోద్యమంగా కూడా పిలుస్తారు. నిజాం ఉస్మాన్ అలీఖాన్ స్థాయి నుంచి గ్రామాల్లోని దొరల వరకూ సాగిన అణచివేత విధానాలకు నిరసనగా తెలంగాణ సాయుధ పోరాటం పురుడు పోసుకుంది. వెట్టి చాకిరీ, భావ వ్యక్తీకరణపై తీవ్ర ఆంక్షలు, మాతృ భాషలపై అణచివేత, మతపరమైన నిరంకుశ ధోరణులు వంటి ఎన్నో పరిణామాలు పోరాటానికి నేపథ్యంగా నిలిచాయి.

రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం దక్షిణాసియాలో, భారత దేశంలో స్వాతంత్ర్యానంతరం జరిగిన తొలి సాయుధ రైతాంగ తిరుగు బాటుగా జాతీయ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించింది. ఆ విధంగా అది ఎన్నో సాయుధ పోరాటాలకు, ఉద్యమాలకు ఈ పోరాటం స్ఫూర్తి దాయకంగా నిలిచింది.

నిజాం నిరంకుశ పాలనకు, దొరల, భూస్వాముల, దేశముఖ్ దోపిడీకి, అణిచివేతకు, హింసకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటమిది. దేశంలోనే తొలిసారిగా భూ సమస్యను బలంగా ముందుకు తెచ్చి భూ సంస్కరణల చట్టానికి నాంది పలికిన పోరాటమిది. తెలంగాణలో ముఖ్యంగా నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలో ప్రతిపల్లె, ప్రతి గడప సాయుధ పోరులో మమేకమైనవే. దొడ్డి కొమరయ్య అమరత్వం నుంచి ప్రారంభమైన పోరులో వేలాదిమంది పోరాట యోధులను నిజాం పోలీసులు, రజకార్లు, భూస్వాములు, గుండాలు హత మార్చిన హృదయ విదారక నేపథ్యం.

ఈ పోరాటం మామూలు వ్యక్తి నుండి మేధావుల వరకు ఆడమగ తేడా లేకుండా ఎందరినో కదనరంగం లోకి ఆకర్షించింది. అలాంటి వారిలో దాయం ప్రియంవద ఒకరు.

దాయం ప్రియంవద (1928 ఆగస్టు 3, 2013) తెలంగాణ సాయుధ పోరాటంలో పోరాడిన మహిళ. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దాయం రాజిరెడ్డి సోదరి. భీమిరెడ్డి నరసింహారెడ్డి, శశిరేఖ, మల్లు స్వరాజ్యం తదితర ఉద్యమ కారులంతా ప్రియంవద సమీప బంధువులు.

నల్గొండ జిల్లా, తుంగతుర్తి మండలం వెంపటి సమీపంలోని తూర్పుగూడెంలో 1928లో లక్ష్మమ్మ, రామకృష్ణారెడ్డి దంపతులకు ఆమె జన్మించారు. ప్రియంవదది మధ్య తరగతి వ్యవసాయ కుటుంబం. రష్యన్ సాహిత్యం, గోర్కి నవలలు, రెండో ప్రపంచ యుద్ధం గురించి వెలువడిన పుస్తకాల పట్ల ఆసక్తిని కలిగి చదవడం వల్ల నాటి సమకాలీన పరిస్థితిని ఒంట పట్టించు కున్నారు.

సుశిక్షితురాలైన గెరిల్లా సైనికురాలు ప్రియంవద తెలంగాణ సాయుధ పోరాటంలో కాలూనారు. 1943 లో 15ఏళ్ళ వయసు లోనే అన్న రాజిరెడ్డితో కలిసి ఖమ్మం ఆంధ్రమహాసభలో పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులు బొమ్మగాని ధర్మభిక్షం, భీమిరెడ్డి నరసింహారెడ్డి, దాయం రాజిరెడ్డి లతో కలిసి సూర్యాపేట ప్రాంతంలో జరిగిన ఉద్యమాల్లో పాల్గొన్నారు. గెరిల్లా సైనికురాలిగా ఆయుధం పట్టడానికి ముందు ఆమె విజయవాడలో ఆత్మరక్షణ, ఆయుధశిక్షణ పొందారు. సాయుధ పోరాటంలో గాయపడ్డ యోధులకు వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేకంగా ఆరోగ్యసేవిక (నర్సింగ్) ట్రైనింగ్ పొందారామె.

పదిహేనేళ్ల ప్రాయంలో ఆమె ఉద్యమం పట్ల ప్రభావితమయ్యారు. స్త్రీల సమస్యలపై, రైతు కూలీల సమస్యలపై అన్నతో కలిసి ఉద్యమ బాట పట్టారు. 1952లో జరిగిన ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో పిడిఎఫ్ అభ్యర్థుల విజయానికి కృషిచేశారు. మహిళా హక్కుల సాధన, బాల్య వివాహాల నిర్మూలన, బాలికా విద్య కోసం ఉద్యమం చేపట్టారు. మహిళల కూలీరేట్ల పెంపు కోసం ఆమె రాజీలేని పోరాటం సాగించి, పెద్ద రైతు కుటుంబ నేపథ్యం కలిగిఉన్న అర్ధశేరు వడ్లు మాత్రమే ఉండే రోజు కూలీని, రెండుశేర్ల వడ్లు కూలీగా ఇప్పించారు.


ఆంధ్రమహాసభలు వరంగల్, ఖమ్మంలో జరిగిన తర్వాత అన్న రాజిరెడ్డిని భువనగిరి ప్రాంతంలో పార్టీ ఆర్గనైజర్‌గా నియమించారు. ఇబ్బందుల్లో ఉన్న రాజిరెడ్డికి తోడుగా కొలనుపాక జైన మందిరంలో నడిపే స్కూలులో యాభై రూపాయల జీతంతో టీచర్‌గా చేరారు. అక్కడ ఒక సంవత్సరంపాటు పనిచేశారు. ఆసమయంలో వీరి కుటుంబంపై ప్రభుత్వం నిషేధం విధించడంతో 1944లో విజయవాడ వెళ్లారు. అక్కడ జరిగిన అఖిలభారత కిసాన్ మహాసభకు వలంటీర్‌గా పనిచేశారు. ఆ తర్వాత వివిధ గ్రామాలకు వెళ్లి తెలంగాణ సాయుధ పోరాటం గురించి ఆడవాళ్లలో చైతన్యం కలిగించారు.

నల్గొండ జిల్లాలో పలు గ్రామాల్లో తిరిగి, పోరాట వ్యూహాల గురించి సమాజంలోస్త్రీలకుండే ఇబ్బందులు, వాటిని ఎదుర్కొనే పద్ధతులను గురించి, ఉత్తేజ ప్రసంగాల ద్వారా వివరించే ప్రయత్నాలు చేశారు. చదువు విషయంలో ఎవరైనా ముందుకొస్తే వాళ్ళకు పాఠాలు చెప్పారు.

ఊళ్ళలో రజాకార్ల ఒత్తిడి ఎక్కువగా ఉన్న సమయంలో అమ్మను, నాన్నను చూసేందుకు సొంతూరుకు వెళ్ళిన విషయం తెలుసుకున్న పోలీసులు రాత్రి సమయంలో స్టేషనుకు, ఆపై తుంగతుర్తి క్యాంపుకు, తర్వాత సూర్యాపేటకు, చివరకు హైదరాబాద్ తరలించి, చంచల్‌గూడ జైల్లో బంధించారు. మూడు నెలల తర్వాత జైలు నుంచి బయటికి వచ్చిన ఆమె ఆయుధాలు పట్టి కాల్చడం నేర్చుకున్నారు. దళంలో ప్రత్యక్షంగా పాల్గొనకుండా పరోక్షంగా మాత్రమే సహాయం అందించారు. మరోసారి స్వంత ఇంటిలో అరెస్టయి సికింద్రాబాద్ కంటోన్మెంట్ జైలుకు, ఆనంతరం వరంగల్ జైలుకు పంపబడ్డారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జైళ్ళలోనూ ఆమె జైలు జీవితం గడిచింది. ఎంచుకున్న లక్ష్య సాధన కోసం ఆమె వివాహం చేసుకోకఒంటరిగానే బతికారు. ఉద్యమ రోజుల్లో ప్రజలకు అత్యంత దగ్గరగా గడిపిన ఆమె చివరి రోజుల్లో ప్రజా జీవితానికి దూరంగా జీవిస్తూ 2013, ఆగస్టు 3 న తుది శ్వాస విడిచారు.

# గురువులకే గురువు శ్రీపాద పినాక పాణి

**ఆగస్టు 3న శ్రీపాద పినాక పాణి జయంతి**



కర్ణాటక సంగీతం అనగానే మనకు వెంటనే స్ఫురణకు వచ్చే పేర్లు అన్నమయ్య, క్షేత్రయ్య, రామదాసు, త్యాగయ్య తదితరులు. శాస్త్రీయ కర్ణాటక సంగీతం నేటికీ సంప్రదాయ రీతిలో కొన సాగుతున్నదంటే ఇలాంటి కారణ జన్ములైన సంగీతజ్ఞులు తమ సర్వస్వాన్నీ సంగీతానికి ధారపోసిన ఫలితమే. అయితే నిరాడంబరంగా, నిశ్శబ్దంగా, నిర్విరామంగా సంగీతానికి తొంభయ్యేళ్ళకి పైగా కృషి చేసిన ఒక గొప్ప సంగీత విద్వాంసుని సేవల గురించి చాలామందికి తెలియక పోవచ్చు. శత వత్సర జీవన యానంలో సంగీతమే ప్రపంచంగా జీవించిన సంగీత తపస్వి ఆయన. వృత్తి రీత్యా వైద్యుడే అయినా, సంగీతజ్ఞుడినని చెప్పుకోవడానికే ఇష్టపడిన అరుదైన వ్యక్తిత్వం ఆయనకే సొంతం. ఆయన కేవలం గాయకుడే కాదు, కేవలం వైణికుడే కాదు. సంగీత శాస్త్రాన్ని ఆసాంతం అవగాహన చేసుకున్న వాగ్గేయకారుడు కూడా. వందలాది వాగ్గేయకారుల కృతులకు స్వరరచన చేసి ఒక చోట పుస్తకంగా అచ్చు వేయడానికి తన జీవితకాలాన్ని వెచ్చించిన కళా పిపాసి, సిద్ధి పొందిన తాపసి ఆయన.

నూకల చిన సత్యనారాయణ, నేదునూరి కృష్ణమూర్తి, శ్రీరంగం గోపాలరత్నం, మల్లాది సూరిబాబు, నేతి శ్రీరామశర్మ, ఓలేటి వేంకటేశ్వర్లు, సినీ నేపథ్య గాయని ఎస్. జానకి, ఎందరో లబ్ధ ప్రతిష్టులైన గాయకులకు సంగీతం నేర్పి, గురువులకే గురువుని పేరు ప్రఖ్యాతులు గడించిన సంగీత కళా నిధి ఆయన. ఆయనే డాక్టర్ శ్రీపాద పినాక పాణి. ఈ శతాబ్దపు అద్భుత సంగీత విద్వాంసుడు, మధుర గాయకుడు, సంగీత కళానిధి, పద్మ భూషణ్ డాక్టర్ శ్రీపాద పినాకపాణి. సంగీత కళాభివృద్ధికి విశిష్ట కృషిచేసి, భావి తరాలకు అందించాలన్న కుతూహలంతో అనేక సంగీత రచనలు చేసి, తన శిష్య, ప్రశిష్యులకు సంగీతంలోని మెలకువలు నేర్పించిన సంగీత శాస్త్ర విశారదుడు. నిరంతర పరిశ్రమతో, సంక్లిష్టమైన, విషయాలను సమన్వయించి నిశితంగా పరిశీలించి, విశ్లేషించి రాగ యుక్తంగా శిష్యులకు నేర్పేవారు.

ఒకవైపు రోగాలను, మరోవైపు రాగాలను సరిచేసిన సవ్యసాచి డాక్టర్ శ్రీపాద పినాక పాణి (ఆగష్టు 3, 1913 మార్చి 11, 2013) వైద్య, సంగీత రంగాలలో నిష్ణాతులు. శాస్త్రీయ సంగీతం తెలుగునేలపై అంతంత మాత్రంగా ఆదరణ ఉన్నరోజులు. నాటక పద్యాలలోనో, హరికథలలోనో తప్ప శాస్త్రీయ సంగీతం అంతగా వినబడని ఆ రోజులలో, తమిళ నాట లాగే శాస్త్రీయ సంగీతం తెలుగునాట వర్ధిల్లాలని నిరంతరం తపన పడ్డారు. శాస్త్రీయ సంగీత వైభవాన్ని ఆకాంక్షించారు. ఆ దిశగా ఎందరో సంగీత శిఖామణులను తెలుగు వారికి అందచేశారు.

శ్రీపాద పినాక పాణి శ్రీకాకుళం జిల్లా ప్రియాగ్రహారంలో 1913, ఆగష్టు 3 వ తేదిన కామేశ్వరరావు, జోగమ్మ దంపతులకు జన్మించారు. రాజమండ్రికి చెందిన లక్ష్మణరావు గారి వద్ద తొలి సంగీత పాఠాలకు శ్రీకారం చుట్టారు. 1939వ సంవత్సరంలో విశాఖపట్నం ఆంధ్ర వైద్య కళాశాల నుండి ఎం.బి.బి.ఎస్. పట్టా తీసుకున్నారు.1945వ సంవత్సరంలో జనరల్ మెడిసన్ ఎం.డి. పూర్తి చేశారు. తర్వాత రాజమండ్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ గా ప్రభుత్వ సర్వీసులో చేరారు.1951 నుండి 1954 వరకు విశాఖలో వైద్య కళాశాలలో సివిల్ సర్జన్ గా పనిచేశారు. 1957లో కర్నూలు వైద్య కళాశాలకు బదిలీ అయి, అక్కడే కళాశాల ప్రిన్సిపాల్ గా, సూపరింటెండ్ గా పనిచేసి 1968 లో పదవీ విరమణ చేసారు. కర్నూలులో స్థిరపడ్డారు.

సంగీతం వింటూనే నొటేషన్స్ రాయగల నైపుణ్యం ఆయనకు దేవుడిచ్చిన వరం. పదవీ విరమణానంతరం, త్యాగరాజాది వాగ్గేయకారుల రచనలు, గీతాలు, స్వరజతులు, స్వరపల్లవులు, తాన పద వర్ణములు, కృతులు, జావళీలు మొదలైన సంగీత రచనలు ఏరి కూర్చి, పుస్తక రచనకు శ్రీ కారం చుట్టారు. సంగీత సౌరభం పేరుతో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించిన నాలుగు సంపుటాలలో శ్రీపాద స్వర పరచిన అన్నమాచార్య కృతులు 108, త్యాగరాజాది వాగ్గేయ కారుల కృతులు 607, ముత్తు స్వామి దీక్షితుల కృతులు 173, పదములు 44, జావళీలు 40, తానవర్ణములు 56, థిల్లనాలు 10, మొత్తం 1088 సంగీత అంశాలు ఉన్నాయి. పాణినీయం, ప్రపత్తి, స్వరరామమ్, అభ్యాసమ్, నా సంగీత యాత్ర పుస్తకాలు ఆయన విరచితాలు.

సంగీతకళా శిఖామణి, సప్తగిరి సంగీత విద్వాన్ మణి, సంగీత కళానిధి, గానకళా సాగర, కళా ప్రపూర్ణ ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ పురస్కారం, సంగీత నాటక అకాడమీ పురస్కారాలు అందుకొన్నారు. ఆయన సంగీతాన్ని కేంద్రనాటక అకాడమీ రికార్డ్ చేసి ఆర్కైవ్స్ లో పొందు పరచింది. 1977 లో సంగీత నాటక అకాడమీ అవార్డు, 1978 లో ఆంధ్ర విశ్వ విద్యాలయంచే కళాప్రపూర్ణ బిరుదు, 1984లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదుతో సత్కరించింది. 2011 లో సంగీత నాటక అకాడమీ ఠాగూర్ ఫెలో గౌరవాన్ని పొందారు. 2012, ఆగష్టు 3 న తన 99 వ జన్మదినాన తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే "జ్ఞాన విద్యా వారధి" బిరుదు పొందడం జరిగింది.

అనేకమంది వాగ్గేయకారులు రచించిన పాటలకు స్వరాలతో, అనుస్వర, గమక సహితంగా స్వరరచన చేసి పినాకపాణి సంగీత సౌరభంలో పొందుపరిచారు. సంగీత సౌరభం అనే పుస్తకంలో అన్నమయ్య కీర్తనలూ, క్షేత్రయ్య పదాలూ, జావళీలూ, వర్ణాలూ ఇలా దాదాపు రెండు వేలకు పైగా పాటలకు స్వర రచన అందించారు. స్వతహాగా వైద్యులు కావడం వలన రోగానికి కారణం వెతికినట్లే, సంగీతం ఎలా నేర్పాలి? ఎలా నేర్పితే సులభతరం అవుతుందనే విషయాలపై లోతుగా అధ్యయనం చేసి గ్రంథస్థం చేశారు. సంగీతాభిమానుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయారు.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## అనుమతులు లేకుండా
# వైద్యం చేస్తే కఠిన చర్యలు



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం** : భద్రాచలంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్ లను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ అనుమతులు లేకుండా ఆసుప త్రులు స్థాపించినా, ల్యాబ్ లను ఏర్పాటు చేసిన కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శా ఖ పోగ్రాం అధికారి ఎం. హెచ్. ఎన్ డాక్టర్ పి. చైతన్య, డిప్యూటీ డెమో మొహమ్మద్ ఫైజ్ మోహిఉద్దీన్ హెచ్చరించారు. శుక్రవారం భద్రా చలం పట్టణంలోకి పలు ప్రయివేటు ఆసుపత్రు లు, రక్త పరీక్ష కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్ యాక్ట్ 2010 ప్రకా రం వైద్య ఆరోగ్య శాఖ నుంచి అన్ని అనుమతులు తీసుకోవాలని, తనికీలప్పుడు చట్టప్ర కారం అనుమతులు లేని యెడల అటువంటి వాటిని సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, ఆయు ష్, నేచురోపతి, సిద్ధా, ఫిజియో దేరపి, క్లినికల్ స్థాపన చట్టం కింద నమోదు చేసుకోవాలని సూచించారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్ తనిఖీని నిర్వహించి, రికార్డులను పరిశీలించా లని, స్కానింగ్ చేయడానికి వెళ్లే ముందు ఫా రమ్ ఎఫ్‌ను పూర్తి చేసి వైద్య ఆరోగ్య శాఖకు అందించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

# మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండల కేంద్రంలో గ్రామ మాదిగ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దళిత బాంధవులు తన జీవితాన్ని సర్వస్వాన్ని త్యాగం చేసి వర్గీకరణను తారా స్థాయికి తీసుకుపోయిన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అణగారిన వర్గాల షెడ్యూల్ క్యాస్ట్ లో ఉప కులాలను వర్గీకరణ చేసుకోవచ్చని తీర్పు ఇవ్వడం మాదిగ జాతికి ఇది గొప్ప వరం అని, 30 సంవత్సరాలు సుదీర్ఘ పోరాట ఉద్యమ స్ఫూర్తిని తీసుకొని రాబోవు కాలంలో కూడా మరిన్ని జాతికి మంచి చేకూరే ఉద్యమాలు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మంగళపల్లి నరసింహ, గురిగళ్ళ లక్ష్మయ్య, ముత్తి కృష్ణ, కాలే వెంకటేష్ , మంకీ మహేష్ ,సిద్ది గారి దాసు ,కంబాలపల్లి అంజి, మహేష్, కొప్పు కృష్ణ , సిద్దిగారి కుమార్ ,ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి అబ్బు రమేష్ ,సురేష్, శీను,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడుకి
# బిజెపి నాయకుల సన్మానం



**విశ్వంభర, మెట్పల్లి:** జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికయిన మైలరపు లింబాద్రిని శుక్రవారం మేట్ పల్లి పట్టణం లోని వారి నివాసానికి వెళ్లి శాలువాతో సన్మానించి శుభాభి నందనలు తెలిపారు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్. వారితోపాటు బీజేపీ మేట్ పల్లి పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్,బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనికేల నవీన్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోరూపాక రమేష్, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షులు సుంకేటి విజయ్, బిజెవైఎం జిల్లా కార్యదర్శి సాడిగే మహేష్, ఇబ్రహీంపట్నం మండల ప్రధాన కార్యదర్శి సుంచు రణధీర్ రెడ్డి, మేట్ పల్లి పట్టణ బిజెవైఎం కార్యదర్శి పులిమామిడి తిరుమల్, ఆత్మకూర్ గ్రామ బూత్ అధ్యక్షులు మెడిచెల్మెల రవి, మర్రి నందకిషోర్, గొపు ప్రశాంత్, బీజేపీ,బిజెవైఎం నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజి,
# సీసీ రోడ్ పనుల ప్రారంభం



**విశ్వంభర, షాద్ నగర్ :** షాద్ నగర్ మున్సిపాలిటీ 15వ వార్డులో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ స్థానిక వార్డు కౌన్సిలర్ మానస యాదగిరి కలిసి మున్సిపల్ జనరల్ ఫండ్ పది లక్షలు, సీసీ రోడ్ల కొరకు ఐదు లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్బంగా మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ 28 వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్,కాలనీ వాసులు ఎంకపల్లి రవి కుమార్, చించేటి పోచయ్య, డోలు అంజి, సవాళ్ళ నరేష్,సవాళ్ళ శ్రీను,చించేడ్ వినోద్, చించొడ్ వినయ్, సవాళ్ళ సురేష్,ముత్యాల్ కుమార్,మహిళలు డోలు రాములమ్మ, విట్యాల అమృత, ముత్యాల యాదమ్మ, మమత, గీత తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధాశ్రమంలో అన్నదానం

**విశ్వంభర, నార్కెట్‌పల్లి:** నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం పుష్ప దంపతుల పెళ్లిరోజు సందర్భంగా మాజీ ఎంపీటీసీల ఫోరమ్ జిల్లా అధ్యక్షులు పాశం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో అన్నదానం, పండ్లు పంపిణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐతరాజు యాదయ్య, పుల్లెంల అచ్చాలు, ప్రజ్ఞాపురం సత్యనారాయణ, సమ్మద్, ఐతరాజు వెంకన్న, సిద్ధగొని స్వామి, బింగి కొండయ్య, మాదాసు నరసింహ, రహీమ్ ఖాన్, కరీంఖాన్, చిన్న, సూరబోయిన ప్రసాద్, బింగి, మహేష్, దైద నాగరాజు,జిల్లా పృధ్వి, సలీం, మాదాసు విజయ్, ఫయాజ్, చాంద్ పాల్గొన్నారు.

## లక్ష్మాపురంలో ఫ్రైడే డ్రైడే



**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామంలో వైద్య సిబ్బంది శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో ఖాళీగా ఉన్న తొట్లల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు నివాసం ఏర్పరచుకొని ప్రజలకు విష జ్వరాలు వస్తాయని తెలియజేస్తూ నిల్వ ఉన్న నీటిని తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాలిని, గ్రామపంచాయతీ కార్యదర్శి విఠల్ కుమార్, గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఉప్పు ప్రకాష్, ఆశా వర్కర్ సునీత, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, మిషన్ భగీరథ వాటర్ మాన్ బాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## పదోన్నతులు పొందిన టీచర్లతో ముఖ్యమంత్రి ముఖాముఖి

**విశ్వంభర, హుజూర్‌నగర్ :** హుజూర్నగర్ నియోజకవర్గం లోని సుమారు 228 మంది టీచర్లు ప్రమోషన్లు పొందారు. వీరు హిందీ, తెలుగు బోధనా టీచర్లు. 2010 నుండి ప్రమోషన్లకు నోచుకోలేదు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాగ్దానం ప్రకారం అందరికీ ఒకేసారి ప్రమోషన్ ఇవ్వడం జరిగినది. నియోజకవర్గ స్థాయిలో ఒకేసారి ఇంతమంది ప్రమోషన్ రావడంతో టీచర్లు అందరూ కలిసి ముఖ్యమంత్రితో ముఖాముఖి పంచుకోవడానికి ఈరోజు ఎల్బీ స్టేడియానికి హుజూర్నగర్ నియోజకవర్గం నుండి నాలుగు బస్సుల్లో 220 మంది పాల్గొన్నారు. హుజూర్నగర్ ఆర్డీవో సమక్షంలో టీచర్లందరికీ అల్పాహారం, స్నాక్స్ అందించారు. ఇదంతా రెవెన్యూ సిబ్బంది, పోలీసులు, ఇన్చార్జీలుగా ఉన్న ఎంఈఓ సైదా నాయక్, శత్రు నాయక్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతుల నుండి రైతు బీమా దరఖాస్తులు స్వీకారాయించడం జరిగింది. ఈ సందర్భంగా ఏవో అరుణకుమారి మాట్లాడుతూ రైతు పట్టాదారు పాస్ బుక్ కలిగిన రైతులందరూ ఆగస్టు 5 తారీకు లోపల రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఆమనగ ల్లు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ఆదికృత డీలర్ల షాపులలో ఎరువుల లభ్యత గురించి తనిఖీ చేశారు. సంఘటోనిపల్లి విఠాయిపల్లి గ్రామాలలో పర్యటించి వాన కాలంలో వేసిన పత్తి, జొన్న, మొక్కజొన్న, పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలు చేపట్టవలసిం దిగా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి కే.రాణి, నిట్ట నారాయణ, కొప్పు యాదయ్య, లక్ష్మారెడ్డి, భూపతిరెడ్డి పల్లె దశరథం, కొప్పు జంగయ్య, లక్ష్మమ్మ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీకి మాదాసి, మాదారి కురువల వినతి

**విశ్వంభర, షాద్ నగర్ :** మాదాసి, మాదారి కురువలకు అన్యాయం జరుగుతుందంటూ శుక్రవారం మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్ రెడ్డికి షాద్ నగర్ తాలూకా బండ వెంకటేష్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కురువ సంఘం నాయకులు మాట్లాడుతూబీ ఇదివరకు తప్పుడు కుల పత్రాలు జారీ చేశారని ఎస్సీ సర్టిఫికెట్స్ బదులుగా బి సి–బి 11 సర్టిఫికెట్ ఇస్తున్నారని గెజిట్లో కురువ కులం లేదని, కురువ కులం పూర్తి పేరు మాదాసి, మాదారి కురువ అని గేజిట్లో ఉందని అన్నారు. దీన్ని పూర్తిగా గుర్తించి మాకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేయాలని విన్నవించుకోవడం జరిగింది. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి ప్రభుత్వానికి తమ సమస్యల గురించి వివరించి తమకు న్యాయం జరిగేటట్టుగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బండ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కోరే రాజు,మీడియా కన్వీనర్ బండ కుమార్, మీడియా కార్యదర్శి గొరికె అర్జున్ పాల్గొన్నారు.

## వాసవి మాత ఆలయంలో ఆషాడమాస ఉత్సవాలు

**విశ్వంభర, కామారెడ్డి :** కామారెడ్డి పట్టణంలో వాసవి మాత ఆలయంలో గత ఐదు వారాల నుండి అమ్మవారి ఉత్సవాలు జరుగుతున్నాయి. అమ్మవారి ఉత్సవాలు జరపడం జరుగుతుంది. ఈ ఉత్సవాలు కామారెడ్డి పట్టణ సంఘం, వాసవాంబ సేవా సమితి, వాసవి మహిళా సేవా సమితి వారు ఉత్సవాలలో పాల్గొన్నారు. ఈ వారం అమ్మవారికి ఒక్క వెయ్యి ఒక వంద తామర పుష్పాలతో అలంకరించడం జరిగింది. దాదాపు అమ్మవారి ఆలయానికి 500 మంది ఆర్యవైశ్యుల మహిళలు, పురుషులు హాజరయ్యారు. పూజ అనంతరం అల్పారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మోటూరి శ్రీకాంత్, కార్యదర్శి భూమేష్, కోశాధికారి రాజేందర్ గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ కూర శ్రీనివాస్, అడ్మిషన్స్ సెక్రెటరీ శ్రీధర్, యువజన సంఘం అధ్యక్షులు వలపి శెట్టి భాస్కర్, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి శర్మ, గౌతమ్ శర్మ, శ్రీనివాస్ శర్మ ఈ యొక్క పూలదాత బాంబే డైయింగ్ రాములు పాల్గొన్నారు.





## మున్సిపల్ ఆధ్వర్యంలో వన మహోత్సవం

**విశ్వంభర, మెట్పల్లి :** మెట్పల్లి పట్టణంలోని మారుతి నగర్ సమీపంలో వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా టెకోమ, మందారం, గుల్మోర్ వంటి మొక్కలు నాటి వాటి రక్షణ కోసం ట్రీ గార్డ్స్ అమర్చడం జరిగింది. ఈ కార్యక్రమంను ఉద్దేశించి మెట్పల్లి మున్సిపల్ కమిషనర్ టి మోహన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ వనమహోత్సవం కార్యక్రమంను ఒక బాధ్యతగా స్వీకరించి మొక్కలు నాటి, నాటడమే కాకుండా వాటి సంరక్షణకు పాటుపడాలని అలా వాటిని సంరక్షించినప్పుడే వనమహోత్సవం విజయవంతం అవుతుందని అన్నారు. అంతేకాకుండా పర్యావరణంకు మేలు జరుగుతుందని వారు తెలపడం జరిగింది. కార్యక్రమంలో ఆర్ఐ అక్షయ్. ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు. ముజీబ్. జూనియర్ అసిస్టెంట్ విజయ్. నిజాం. పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.



# సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

### ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**విశ్వంభర, అంబర్ పేట్ :** బాగ్ అంబర్‌పేట డివిజన్ మల్లికార్జుననగర్‌లో 80 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శుక్రవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మా వెంకటరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, అధికారులు డిఈ ఈ ప్రవీణ్, ఏఈ మాజిద్, ఏఈ సౌమ్య, వర్క్ ఇన్స్పెక్టర్ రవి, డివిజన్ ప్రెసిడెంట్ చంద్ర మోహన్ , పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం

**విశ్వంభర, చింతపల్లి :** అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఎల్లంకి రాజేష్ ఆధ్వర్యంలో చింతపల్లి మండల కేంద్రంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లంకి రాజేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ఈ ప్రజా ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఎన్నో పోరాటాలు చేసినా గాని ఉద్యోగ నోటిఫికేషన్‌లు ఇవ్వడంలో నిరుద్యోగులకు మొండి చేయి చూపించిందని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలలలోనే ఉద్యోగ నోటిఫికేషన్ ను విడదలు చేసి, ఈరోజు జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేసి నిరుద్యోగులకు అండగా ఉంటుందని నిరూపించిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గోవిందు రవికుమార్, మండల నాయకులు కొండల్ యాదవ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు కోటేష్, సాయి, నరేష్, శ్రీనాథ్, అజయ్, బన్నీ, సాత్విక్ పాల్గొన్నారు.

# మన ఊరు - మన దుకాణం




**విశ్వంభర, కామారెడ్డి :** కామారెడ్డి పట్టణంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మన ఊరు మన దుకాణంతో ఐదు కూడలిలలో ఫేక్సీలను ఏర్పాటు చేశారు. ఈ ఫేక్సీలు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. కామారెడ్డి పట్టణం వందల సంవత్సరాల నుండి వ్యాపారంకు నిలయంగా ఉన్నపట్టణంలో వేల మంది వ్యాపారాలు జీవనోపాధిగా నడుస్తుంది. ఈ పట్టణానికి పెద్ద వ్యాపార నిలయంగా పేరుంది. పట్టణంలో గంజి మార్కెట్ ఎంతో ప్రసిద్ధిగాంచింది. గతంలో కామారెడ్డి మార్కెట్లో బెల్లం వందల లారీలు వస్తూ ఉండేవి కానీ కాలక్రమేపి గంజి అన్నది కనుమరుగైపోయింది. బెల్లం సారాయికి ఉపయోగిస్తున్నారని ప్రభుత్వం దానిని నిషేదించింది. బెల్లం వ్యాపారం కనుమరుగడంతో వ్యాపారస్తులు రైతులు కూలీలు వేరే వ్యాపారం వైపు వెళ్లిపోయారు. కామారెడ్డిలో ఫార్మా కంపెనీ అనేది తెలంగాణ ఆంధ్ర మహారాష్ట్ర కర్ణాటకలో పెద్ద పెద్ద ఫార్ములా ఏజెన్సీలు కామారెడ్డిలో ఉన్నాయి. దానిలో వేలమంది జీవనోపాధి పొందుతున్నారు. కానీ కార్పొరేట్ సంస్థలు ఏర్పాటు చేయడంతో స్థానిక వ్యాపారస్తులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కామారెడ్డి పట్టణంలో అన్ని వ్యాపారాలు జోరుగా నడిచేవి. కానీ కార్పొరేట్ సంస్థలు ఏర్పాటు చేయడంతో అన్ని వ్యాపారాలు కుదేలయ్యాయి. ఈ విషయంపై చాంబర్ అధ్యక్షులు కంచర్ల లింగమును వివరణ తీసుకోగా స్థానిక వ్యాపారులకు ఉపాధి లేదు, కాబట్టి ఇటువంటి ప్లెక్సీలు ఏర్పాటు చేసి వారికి ఉత్సాహపరు-స్తున్నామని తెలిపారు. స్థానిక వ్యాపారులను ప్రోత్సహించాలని ఆయన వినియోగదారులకు కోరారు.

# తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మక్కాలో ప్రార్ధనలు



**విశ్వంభర, బషీర్‌బాగ్ :** ప్రముఖ సంఘ సేవకుడు, టీఎన్జీవో యూనియన్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి హుస్సేని ముజీబ్ తనయుడు సయ్యద్ అసదుద్దీన్ వారి బంధువులు సయ్యద్, నవాజుద్దీన్, మొహమ్మద్ బలాలుద్దీన్ పవిత్ర పుణ్య క్షేత్రం సౌదీ అరేబియాలో ఉమ్రా చేసి క్షేమంగా హైదరాబాద్‌కు తిరిగి చేరుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా పక్షాన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని ముజీబ్ పవిత్ర మక్కా మదీనా సందర్శించిన తన సుపుత్రుడికి, బంధువులకి స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, ఆరోగ్యంగా, హార్దిక అభివృద్ధి, చెందారని నూతన ప్రభుత్వం అన్ని సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను భారతదేశం మొదటి స్థానంలో ఉండాలని తెలంగాణ ఉద్యోగులందరూ సుఖశాంతులతో ఉండాలని తెలంగాణ రాష్ట్ర ప్రజలు భారతదేశంలో అన్ని రంగాలలో ముందుకు సాగాలని అల్లాను కోరుకుంటున్నామని సయ్యద్ అసురుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా సేవా రత్న పురస్కార గ్రహీత టీఎన్జీవోస్ యూనియన్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని భగవంతుని ప్రార్థిస్తూ ఇంకా మంచి మంచి పదవులను చేపట్టాలని చేపట్టాలని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్, విద్యావేత్త,అడ్వకేట్ మహమ్మద్ అఖ్తర్ షరీఫ్, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ మాజీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అఖ్తర్ అలి అన్నారు.



ఫతేనగర్ అయ్యప్ప సేవ సమితి ఆధ్వర్యంలో అయోధ్యలోని బాల రాముడిని, కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట అయ్యప్ప సేవ సమితి సభ్యులు ఉన్నారు.

– విశ్వంభర, కూకట్‌పల్లి

# నిర్బంధాలతో ప్రశ్నించే గొంతును నొక్కలేరు

**బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ**



**విశ్వంభర, ఎల్బీనగర్ :** అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రశ్నించే గొంతును నొక్కలేరని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. శుక్రవారం ఆర్కే పురం లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దొంగే దొంగా దొంగా అన్నట్లుగా సబిత ఇంద్రారెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసి ఆమె దిష్టిబొమ్మ దగ్ధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిండు శాసనసభలో మహిళలను అగౌరపరిచి వారి పార్టీ నాయకులతో దిష్టిబొమ్మ దగ్ధం చేయించడం గతంలో ఎప్పుడు చూడలేదన్నారు. అధికారంలో ఉండి మహిళా ఎమ్మెల్యేలను అవమానించడం తగదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలపై సబితా ఇంద్రరెడ్డి శాసనసభలో ప్రశ్నించినందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు టార్గెట్ చేస్తూ అవమాన పరచడం మానుకోవాలన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే సబితా ఇంద్రారెడ్డికి క్షమాపణలు చెప్పి, అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలని హితవు పలికారు. అసెంబ్లీలో జరిగిన అన్యాయాన్ని ప్రజలకు తేలపాలని స్పీకర్‌ని అడిగితే 4 గంటలు మైకు ఇవ్వకుంట నిలబెట్టడం దారుణం అని అన్నారు. సబితా ఇంద్రారెడ్డి ప్రజల మనిషి అని తమ, మన అని బేధం లేకుండా సహాయ సహకారాలు అందిస్తుంది అని అన్నారు. ఆమె పై ప్రభుత్వం చేస్తున్న దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, గొడుగు శ్రీనివాస్, ఆకుల అరవింద్, కొంద్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, వెంకటేష్ గౌడ్, పెంబర్తి శ్రీనివాస్, నవీన్, అనురాధ, శంకర్ పాల్గొన్నారు.

# ఎంబిబిఎస్ వైద్య విద్యార్థికి పాఠ్యపుస్తక చేయూత




**విశ్వంభర, వరంగల్ :** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ వరంగల్ జిల్లా వారు నేడు వరంగల్ లోని రంగసాయిపేటకు చెందిన దళిత సామాజిక వర్గానికి చెందిన వెంకటేశ్వర్లు కుమార్తె అయిన దుద్ది గాయత్రి ఎంబిబిఎస్ చివరి సంవత్సరం మహబూబాద్ లో మెడికల్ కాలేజీలో చదువుతున్నది వారి ఆర్థిక పరిస్థితి బాగా లేనందున ఖరీదైన మెడికల్ పుస్తకాలు కొనలేక బాధపడుతున్న సమయంలో ఇంటర్నేషనల్ ఫెడరేషన్ వరంగల్ వారిని సంప్రదించగా వారికి రూ, 25000/- విలువ గల మెడికల్ బుక్స్ వారి స్వగృహంలో అందించడం జరిగింది. వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు గట్టు మహేష్ బాబు, వరంగల్ జిల్లా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షులు పుల్లూరి మధు, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళా విభాగ అధ్యక్షురాలు వల్లాల శైలజ, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా సెక్రెటరీ గుమ్మడవెల్లి సురేష్, వల్లాల నాగేశ్వరరావు, మంచాల విజయ్ కుమార్, బొమ్మినేని మనోహర్ రెడ్డి, ఎర్ర నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# 255 సర్వే భూములు పోలీస్ బెటాలియన్‌కు ఇవ్వద్దు



**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని 255 సర్వేనెంబర్ లో గల పేదల భూములను పోలీస్ బెటాలియన్ కు కేటాయించవద్దని మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కర్నే ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో 255 సర్వేనెంబర్ లోని బాధిత రైతులు తమ భూములలో పోలీస్ బెటాలియన్‌ను కేటాయించకుండా చూడాలని కోరుతూ కర్నే ప్రభాకర్ కు వినతిపత్రం అందజేశారు. భూ బాధితుల సమస్యలు తెలుసుకున్న కర్నే ప్రభాకర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రానికి అతి సమీపంలో ఉన్న ఈ భూమినీ పేదలు గత 70 ఏళ్లుగా చదును చేసుకుని వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. ఈ భూముల్లో ఉన్న రాళ్లు రప్పలను తీసివేసి వ్యవసాయ యోగ్యంగా మార్చుకున్నారన్నారు. ఇదే భూములలో అనేకమంది పేదలు పశువులు, గొర్రెలు, మేకలు మేపుతూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఇదే సర్వే నెంబర్ లో గాంధీనగర్ తండా గిరిజనులు నివసిస్తున్నారన్నారు. పోలీస్ బెటాలియన్ ఏర్పాటు వల్ల గిరిజనుల సాధారణ జీవన స్థితిగతులకు ఇబ్బందులు ఏర్పడతాయని హెచ్చరించారు. ఇతర గిరిజన తండాలకు వెళ్లి రహదారికి ఈ భూమి చుట్టూ ఉన్న పట్టా భూములకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. పేద ప్రజలకు అనేక ఇబ్బందులు కలిగించే ఈ పోలీస్ బెటాలియన్ ఏర్పాటును ప్రభుత్వం తక్షణం ఇక్కడ నుంచి మార్చాలని, సాగుకు ఉపయోగం లేని, గ్రామాలకు దూరంగా ఉన్న ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని కర్నే ప్రభాకర్ డిమాండ్ చేశారు. లేదంటే తానే స్వయంగా బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాకు దిగుతానని కర్నే ప్రభాకర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు చిలువేరు అంజయ్య, మెగావత్ నరసింహ నాయక్, బానోత్ బాలకృష్ణ నాయక్, సిలివేరు వీరేశం, బొడ్డుపల్లి గాలయ్య, బొడ్డుపల్లి బిక్షమయ్య, బీఆర్ఎస్ నాయకులు వడ్డేపల్లి రాములు, కొండ యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# పిట్టల శ్రీనివాస్ మృతదేహానికి నివాళులు

**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రానికి చెందిన సీపీఎం పార్టీ నాయకులు పిట్టల శ్రీనివాస్ అకాల మృతి చెందడంతో ఆయన భౌతికకాయానికి అపార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చేరుపల్లి సీతారాములు, జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, ఇతర నాయకులు శ్రీనివాస్ మృతదేహానికి ఘనంగా నివాళులర్పించారు. పిట్టల శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం : భద్రాచలంలోని** ఆర్టీసీ బస్టాండ్ వద్ద ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నెంబర్ ప్లేట్లు లేని ద్విచక్ర వాహనాలను, వాహనాలు నడుపుతున్న మైనర్‌లను కనుగొన్నారు. భద్రాచలం ఏఎస్పీఆధ్వర్యంలో నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడుపుతున్న వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రేపటి నుంచి ప్రతిరోజు నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ ఉంటుందని ఎస్ఐ మధు ప్రసాద్ తెలిపారు.





# ఎస్సీ రిజర్వేషన్ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలి

**విశ్వంభర,బషీర్ బాగ్:** పార్లమెంట్ సమావేశాల్లో దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ బిల్లు పెట్టించి చట్టబద్దత కల్పించే బాధ్యత పార్లమెంటరీ విపక్ష నేత రాహుల్ గాంధీ, ఇండియా కూటమి తీసుకోవాలని దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నాగళ్ల పోచయ్య ఇశ్రాయేల్, ఎంవీ జాన్సన్, ఆంద్రూస్ జేవియర్, బి. కిష్టయ్య లూకాస్, ప్రకాష్, భాస్కర్, భూమమ్మా లు డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ బిల్లు కు కృషి చేయని పక్షంలో దళిత క్రైస్తవ ద్రోహి కాంగ్రెస్ పార్టీ మిగిలిపోతుందని ఆరోపించారు.అధికారంలో ఉన్నప్పుడు బిల్లు పెట్టదని, ప్రతిపక్షంలో ఉన్నపుడు కొట్లాడారాని మండిపడ్డారు. గత 70 సం"రాలుగా దగాపడ్డ దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ బిల్లు పై వివక్షతో బిల్లు పెట్టకుండా కమీషన్ల పేర కాలయాపన చేస్తూన్నారని అన్నారు.



# ఐటీఐలలో ప్రవేశాలకు రెండవ విడత దరఖాస్తులు

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాచలం 2024-25 విద్యా సంవత్సరమునకు గాను ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాల కొరకు రెండవ విడత ఆన్లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఆశ్రమ పారిశ్రామిక శిక్షణ సంస్థ, కృష్ణసాగర్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ ధర్మాచారి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు iti.telangana.gov.in అనే వెబ్సైట్ నందు ధ్రువీకరణ పత్రాలు అప్లోడ్ చేసుకోని, పదవ తరగతి పాస్ అయి, 2024 ఆగస్టు 01 నాటికి 14 సంవత్సరాల నిండిన వారై ఉండి, ఈ నెల 02 వ నుండి 12వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలియజేశారు.



# తల్లిపాల వారోత్సవాలు

**విశ్వంభర, షాద్‌నగర్ :** తల్లి పాల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం షాద్ నగర్ కమ్యూనిటీ హాస్పిటల్ లో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్, శ్రీనివాస్ రెడ్డి, పీడీ ఎలాజీస్ట్, కలిమోద్దీన్, శ్రీనివాసరావు, స్టాఫ్ నర్స్, వినీత రాణి, ఏఎన్ఎం. స్వప్న, అంగన్వాడీ టీచర్స్ ఆశ వర్కర్స్ రేణుకా దేవి, వసంత, నుశ్రత్ బేగం, కవిత, భారతి, నాగజోతి, పుష్పలత, శోభారాణి, సీ.డీ.పీ.ఓ. నాగమణి సూపర్ వైజర్, వెంకటమ్మ, అండాలు, రేవతి, డాక్టర్, విజయలక్ష్మి హాస్పెటల్ సిబ్బంది పాల్గొన్నారు.



## మాదిగల 12 శాతం రిజర్వేషన్ల కోసం
# పోరాటం చేస్తాం

**డాక్టర్ పిడమర్తి రవి**

**హైద్రాబాద్, విశ్వంభర :** తెలంగాణ రాష్ట్రంలో మాదిగల 12 శాతం రిజర్వేషన్ కోసం తమ పోరాటం కొనసాగిస్తామని , భవిషత్తు కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని మాదిగ సంఘాల నాయకులు, మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టులో అనుకూలంగా తీర్పు ఇచ్చిన సందర్బంగా తెలంగాణ రాష్ట్రంలో మాదిగల భవిష్యత్తు కార్యచరణకు శ్రీకారం చుట్టడం కోసం మాదిగ సంఘాల నాయకులు అందరు కలిసి కట్టుగా ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రివర్యులు చంద్రశేఖర్, ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం, వరప్రసాద్, సైదులు, సతీష్ మాదిగ తదితరులు సమావేశమయ్యారు.

## కోరుట్ల మండల మాజీ సర్పంచుల
# ముందస్తు అరెస్ట్



**విశ్వంభర, కోరుట్ల :** తెలంగాణ రాష్ట్రంలో సర్పంచులకు పెండింగ్ బిల్లులను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని నిరసనగా హైదరాబాదులో తలపెట్టిన సర్పంచుల నిరసన ధర్నాకు రాష్ట్ర వ్యాప్త పిలుపును ఇవ్వడంతో కోరుట్ల మండల తాజా మాజీ సర్పంచ్ లను ముందస్తుగా అరె-స్టు చేసి కోరుట్ల పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామాల్లో అభివృద్ధి కోసం సర్పంచులు అప్పులు తీసుకొచ్చి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరిగిందని, ప్రజలకు పారిశుద్ధ్య నీటి, అన్ని రకాల వసతులను కల్పించడంలో సర్పంచులు చేసిన కృషి అనిర్వచనీయమైనదని అలాంటి వారికి పెండింగ్ బిల్లులు చెల్లించి చేదోడుగా నిలవాల్సిన ప్రభుత్వం, పెండింగ్ బిల్లులను విడుదల చేయకుండా గ్రామ అభివృద్ధి చేసిన సర్పంచులను పోలీస్ స్టేషన్లో నిర్బంధించడం అనేది కాంగ్రెస్ ప్రభుత్వం పనికిమాలిన చర్యగా భావిస్తున్నామని జగిత్యాల జిల్లా సర్పంచుల ఫోరం తాజా మాజీ అధ్యక్షులు దారిశెట్టి రాజేష్ మండిపడ్డారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులు నాగులపేట భాస్కర్ రెడ్డి,కల్లూరు అంజయ్య, రాజనర్సు, రాధా సందయ్య, నూతిపెల్లి ముత్తయ్య, నరసయ్య, కోరెపు రవి తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఘట్టుప్పల మండల కేంద్రంలో
# చేనేత కార్మికుల నిరసన ర్యాలీ




**విశ్వంభర, ఘట్టుప్పల :** ఘట్టుప్పల మండల కేంద్రంలో చేనేత కార్మికుల సమస్యలపై చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. తహశీల్దార్ రాములుకి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ పథకాలు చేనేత త్రిఫ్ట్, భీమా ,చేనేత మిత్ర, నూలు సబ్సిడీ పథకాలను కొనసాగింపు పై అలాగే చేనేత రుణాలు మాఫీ, చేనేత కార్మికులకు పని కల్పించాలని వస్త్రాలు సొసైటీలో నిల్వ ఉన్న సరుకును ఖరీదు చేయకుండా చేనేత రంగాన్ని గుర్తించకుండా అవలంబిస్తున్నందుకు ప్రభుత్వంపై కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్యల్ని ప్రభుత్వం పరిష్కరించి చేనేత కార్మికులకు పథకాలను కొనసాగించాలని కోరారు.

## సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



**విశ్వంభర, షాద్ నగర్ :** అసెంబ్లీలో బీసీ కులాల గురించి ప్రస్తావించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసారు. వెనుకబడ్డ బీసీ కులాలు, మంగలి, సాకలి, కుమ్మరి కులాలు గురించి ప్రస్తావించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాయి బ్రాహ్మణులకు ప్రజాస్వామ్య బద్ధంగా న్యాయం జరగడంలేదని అన్నారు. పార్టీలకు అతీతంగా మాట్లాడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కు ధన్యవాదాలు తెలిపారు. వృత్తిపై ఆధారపడి బతికే నాయి బ్రాహ్మణులకు వ్యతిరేకంగా వేరే జాతుల వారు ఈ వృత్తి చేయడం వల్ల అసలైన నాయి బ్రాహ్మణులకు ఉపాధి కోల్పోవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు రోమియో రమేష్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు బసవప్ప, నాయి బ్రాహ్మణ సంఘం కన్వీనర్ జి బాలరాజు, టౌన్ ప్రధాన కార్యదర్శి జంగయ్య, పశుపుల శ్రీనివాస్, మందారం నరసింహులు, వెంకటముని, వెంకటయ్య, నరేందర్, మధు, కృష్ణ, నర్సింలు, ప్రకాష్, శ్రీకాంత్, అంచయ్య, నరేష్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఓజోన్ ఆసుపత్రిలో బోనాల సంబరాలు



**విశ్వంభర, ఎల్బీనగర్ :** బోనాల పండుగ పల్లె ప్రజల యొక్క సంస్కృతిక సాంప్రదాయాలకు ప్రతీకా అని ఓజోన్ చైర్మన్, ప్రముఖ వైద్య నిపుణులు బీవీ సత్యసాయి ప్రసాద్ అన్నారు. శుక్రవారం కొత్తపేటలోని ఓజోన్ ఆసుపత్రిలో నిర్వహిం చిన బోనాల వేడుకలకు ఓజోన్ ఆసుపత్రి సీఈవో సిహెచ్ శ్రీనివాసరావుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్య బృందం, సిబ్బంది సాంప్రదాయ బద్ధంగా దుస్తులు ధరించి బోనాలతో ఘనంగా వేడుకలు నిర్వహించారు. అనంతరం ఓజోన్ చైర్మన్, ప్రముఖ వైద్య నిపుణులు బీవీ సత్యసాయి ప్రసాద్ మాట్లాడుతూ బోనాల పండుగ ఉత్సవాల్లో పాలుపంచుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. హైదరాబాద్ మహానగరంతో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే బోనాల పండుగ మన సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచిందని ఆయన కొనియాడారు. బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ బోనాల ఉత్సవాలలో ఓజోన్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ దీప్తి, ప్రముఖ వైద్యులు ఇంద్రసేనారెడ్డి, పూజిత, వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## కేపీహెచ్‌బిలో డీసీపీ ఆకస్మిక తనిఖీ




**విశ్వంభర, కూకట్‌పల్లి:** కె.పీ.హెచ్.బి పోలీస్ స్టేషన్‌ను బాలనగర్ డిసిపి సురేష్ కుమార్, ఏసిపి కూకట్పల్లి శ్రీనివాసరావు ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులు, విచారణ లో ఉన్న ఫైళ్లను తనిఖీలు చేసి, పెండింగ్ లో ఉన్న కేసుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలని ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వ రరావు సిబ్బంది ఉన్నారు.

# చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం**



**విశ్వంభర, హైదరాబాద్ :** చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కోరారు. కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం అధ్యక్షతన బీసీల మహా ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. త్వరలో జరుపబోయే జనాభా గణనలో కులాల వారి లెక్కలు తీయాలని, పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టి, బీ.సీ లకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ బడ్జెట్ 2 లక్షల కోట్లకు పెంచాలని, కేంద్రం లో బీ.సీ లకు ప్రతేక మంత్రిత్వశాఖ చేయాలనీ, బీసీ క్రిమిలేయరును ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ ఆగష్టు 6, 7వ తేదీల్లో ఢిల్లీలో భారీఎత్తున నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల నుంచి 5,000 వేల మందికి పైగా భారీ ఎత్తున తరలి వస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ హాజరై బీసీ సమస్యలపై కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిపై పోరాటానికి సిద్దం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చౌటుపల్లి సురేష్, తెలంగాణ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ జలపల్లి కిరణ్, హైదరాబాద్ గ్రేటర్ ఉపాధ్యక్షులు పండరినాథ్ పాల్గొన్నారు.

## కుక్క కాటు గురైన చిన్నారులను
# పరామర్శించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, కూకట్‌పల్లి :** వీధి కుక్కల నిర్వహణ కట్టడి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలానగర్ లో 24 మంది పిల్లలను, వృద్ధులను కుక్కలు కరిచిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధితులను వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క బాల నగర్ డివిజన్లోనే 24 మందిని కుక్కలు కరిస్తే, నగరంలో పరిస్థితి ఏ విధంగా ఉందో అని ఆవేదన వ్యక్తం చేసారు. కుక్కకాటు బాధితులకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలన్నారు. సమాచారాన్ని వెంటనే ముఖ్యమంత్రి జిహెచ్ఎంసి మేయర్ మంత్రుల దృష్టికి తీసుకు వెళ్తానని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును
# హర్షించిన ఎమ్మార్పీఎస్



**విశ్వంభర, ఆమనగల్ :** అమనగల్ మండల కేంద్రంలో సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పు పట్ల ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు మల్లెపోగు మల్లేష్ మాదిగ హర్షం వ్యక్తం చేశారు. మండల ఎమ్మార్పీఎస్ అద్వర్యంలో డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ ఏర్పాటు చేసి ఎస్సీ వర్గీకరణపై దేశవ్యాప్తంగా ఉద్యమాలు నడిపా రన్నారు. 30 సంవత్సరాల నుండి ఎంతో మంది కార్యక ర్తల పోరాట ఆశయం ఈరోజు సుప్రీంకోర్టు తీర్పుతో ఫలించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జంతుక యాదయ్య మాదిగ, జంతుక జానయ్య మాదిగ, పులికంటి మైసయ్య మాదిగ, వస్పుల సాయిలు మాదిగ, ఒగ్గు మహేష్ మాదిగ, పోతుగంటి కృష్ణ మాదిగ, రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి తుడుం చంద్ర కిరణ్ జిల్లా ఉపాధ్యక్షులు జంతుక కిరణ్ మాదిగ, వస్పుల రవి మాదిగ, మిఠాయిపల్లి రమేష్, అల్లాజి పాల్గొన్నారు.



## అక్రమంగా అరెస్టులు చేయడం సిగ్గు చేటు

**విశ్వంభర, ఎల్బీనగర్ :** ప్రజా పాలన చేస్తున్నామని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటు అని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతా రెడ్డి అన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎవరైనా నిరసన తెలిపే హక్కు ఉంటుందని, హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తుందని అన్నారు. తెలంగాణలో ప్రస్తుతం ప్రజా పలన జరగడంలేదని దగా పాలన జరుగుతుందని సునితా రెడ్డి అన్నారు. నిండు శాసనసభలో మహిళ శాసన సభ్యురాలని చూడకుండా అవమానించిన కాంగ్రెస్ పార్టీ వారే దిష్టిబొమ్మలను దగ్ధం చేయడం ఎంతవరకు సబబు అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే సబితా ఇంద్రా రెడ్డికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.




## మందకృష్ణ మాదిగ, ప్రధాని మోదీ ఫోటోలకి పాలభిషేకం

**విశ్వంభర, షాద్ నగర్ :** భారత రాజ్యాంగంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పొందుపర్చిన ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు మాదిగ ఉప కులాలు అందుకోవడంలో ఇన్ని రోజులు నష్టపోయారని ఈ రోజు సుప్రింకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన చారిత్రాత్మక మైన తీర్పుతో ఎన్నో ఏళ్ల నుంచి మాదిగ ఉపకులాల పోరాటం వారి కృషి ఫలించిందని తెలిపారు. గత ముప్పై ఏళ్ల నుండి ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ ఎస్సీ వర్గీకరణపై పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే ఎస్సీ వర్గీకరణ అంశం పైన బీజేపీ ప్రభుత్వం మద్దతు తెలపడంతోనే సుప్రింకోర్టులో వర్గీకరణపై సానుకూలంగా తీర్పు వచ్చిందని అందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని వారికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చ షాద్ నగర్ ప్రసిడెంట్ గంగపురి సురేష్, బీజేపీ కార్యకర్తలు చటన్ పల్లి గ్రామంలో మందకృష్ణ మాదిగ, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోటోలకి పాలభిషేకం చేశారు. మాదిగ ఉపకలాల సామాజిక వర్గం రుణపడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చటన్ పల్లి గ్రామంలో బీజేపీ కార్యకర్తలు కటికల రాజు, ప్రేమ్, చెన్నయ్య, రామకృష్ణ, రమేష్, బాలస్వామి, వెంకటేష్, నరసింహులు పాల్గొన్నారు.

## మహాదేవపూర్ వాసికి తెలంగాణ ఫోటోగ్రఫీ అకాడమీ అవార్డు



**విశ్వంభర, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రానికి చెందిన వర్ధమాన ఫోటోగ్రాఫర్ పంతకాని రాజు తెలంగాణ ఫోటోగ్రఫీ అకాడమీ నిర్వహించిన ఫోటోగ్రఫీ కాంపిటేషన్ లో ఉత్తమ ఛాయాచిత్రం అవార్డు విజేతగా నిలిచారు. ఆయన ఒరిస్సా గిరిజన తెగ " బొండా " మహిళల జీవన సంస్కృతి,సంప్రదాయాలపై తీసిన ఛాయాచి త్రానికి ఈ అవార్డు లభించింది..దేశంలోని 125 మంది నిష్ణాతులైన ఫోటోగ్రఫీ కళాకారులు తీసిన 600 ఛాయాచిత్రాలు పోటీలో ఉండగా తాను తీసిన ఛాయాచిత్రం ఈ అవార్డు కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని ఫోటో గ్రాఫర్ పంతకాని రాజు అన్నారు..తనను ఎంపిక చేసిన తెలంగాణ ఫోటోగ్రఫీ అకాడమీ ప్రెసిడెంట్ రావులపల్లి సునీత ,వైస్ ప్రసిడెంట్ సంపత్ కుమార్,అకాడమీ కార్యదర్శి బండి వి రమణలకు రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఆగష్టు 19న అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవం రోజున తెలంగాణ ఫోటోగ్రఫీ అకాడమీ వారు ఈ అవార్డును అందించడం జరుగుతుందని తెలిపారు.



# కదిలిన జిల్లా యంత్రాంగం

## జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశానుసారం వర్కాల గ్రామాన్ని సందర్శించిన డీఎల్పీఓ రామేశ్వరరావు

**విశ్వంభర ఎఫెక్ట్**

**విశ్వంభర చింతపల్లి ఆగస్టు 2:** ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో గ్రామపంచాయితీ ట్రాక్టర్ అనే శీర్షికతో మంగళవారం విశ్వంభర దినపత్రికలో వచ్చిన వార్తకు నల్లగొండ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశానుసారం శుక్రవారం డివిజన్ పంచాయతీరాజ్ ఆఫీసర్ రామేశ్వరరావు చింతపల్లి మండలం వర్కాల గ్రామాన్ని సందర్శించి గ్రామ పంచాయితీలోని రికార్డులను పరిశీలించారు. గ్రామపంచాయితీ నిధులచే వచ్చిన ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్, ఏ ఇతర పనిముట్లు అయినా సొంత అవసరాలకు వాడుకోవద్దని కేవలం గ్రామాభివృద్ధికి మాత్రమే ఉపయోగించాలని ఆయన తెలిపారు. గ్రామపంచాయతీ ట్రాక్టరుతో గ్రామంలోని చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడంతోపాటు, హరితహారం, పల్లె ప్రకృతి వనం లాంటి మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేయాలన్నారు. మరలా ఇలాంటి ఘటనలు పురావృతమైతే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పంచాయితీ కార్యదర్శి పద్మరెడ్డి ని హెచ్చరించారు. గ్రామం అభివృద్ధి చెందేందుకు గ్రామస్తులతో మమేకమై ఏ రాజకీయ పార్టీలకు ఏకపక్షంగా ఉండకుండా ప్రజలందరినీ ఏకతాటిపై కలుపుకొని మండలంలోని వర్కాల గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలి అన్నారు.

# స్వచ్ఛదనం-పచ్చదనంపై వీడియో కాన్ఫరెన్స్

**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి :** స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు నిర్వహణపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛదనం-పచ్చదనం 5 రోజుల కార్యక్రమాల షెడ్యూల్ ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రకటించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో గ్రామాలు, వార్డులను జల్లెడ పట్టి వ్యర్థాలు తొలగించి పరిశుభ్రం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ఈ నెల 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు నిర్వహణపై శుక్రవారం ఐడీఓసీ కార్యాలయం నుండి పంచాయతీ రాజ్, వైద్య, ఆర్ డబ్ల్యూఎస్, ఇరిగేషన్, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతి కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వహణపై వ్యాస రచన, వక్తృత్వం పోటీలు నిర్వహించి బహుమతులు అందచేయాలని సూచించారు. ప్రతి రోజు విద్యార్థులకు ఈ కార్యక్రమం నిర్వహణపై ప్రార్థనా సమయంలో విద్యార్థులు వివరించి తద్వారా సమాచారం ప్రతి ఇంటికి చేరే విధంగా అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో ఈ నెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం పేరిట పారిశుధ్యం, వైద్య సేవలు, మంచినీటి ట్యాంకులు క్లీనింగ్ చేయుట, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయుట, పచ్చదనం పెంపుకు మొక్కలు



నాటడం, జ్వర నియంత్రణ చర్యలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సీజన్ వ్యాధులు ప్రబలే కాలమని అందువల్ల పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టేందుకు ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని ఆయన తెలిపారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలు నిర్వహణకు గ్రామ, మున్సిపల్ వార్డుల స్థాయిలో టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచదనం - పచ్చదనం కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకటించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ.

### 5వ తేదీన చేపట్టాల్సిన పనులు

గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు, మహిళా సంఘాలు, యువత, ప్రముఖులతో కార్యక్రమం నిర్వహణ యొక్క ప్రాధాన్యతను తెలియచేయుటకు పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. గ్రామ, మున్సిపల్ స్థాయిలో ప్రతి ఇంటి నుండి వ్యర్థాలు సేకరించుట, అట్టి వ్యర్థాలతో వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేయాలని తెలిపారు. పారిశుధ్యం, మొక్కల పెంపకం, సీజనల్ వ్యాధులపై విద్యార్థులులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీఓ నారాయణ రావు, సీపీఓ శామ్యూల్, డీఆర్డీఓ నరేష్, వైద్యాధికారి డా మధుసూదన్, పీఆర్ ఈ ఈ దిలీప్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర రావు, అన్ని మండలాల మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతి కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రపంచ రికార్డు సాధించిన విక్టోరియాకు ఎమ్మెల్యే అభినందన



**విశ్వంభర, కల్వకుర్తి :** ఇంగ్లాండ్ నుంచి ఫ్రాన్స్ వరకు అట్లాంటిక్ మహాసముద్రం ఈదిన తొలి తెలుగు మహిళగా ప్రపంచ రికార్డు సృష్టించింది ఆమనగల్ మండలానికి చెందిన స్విమ్మర్ గంధం విక్టోరియాని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా మరిన్ని రికార్డులు సృష్టించి దేశానికి, రాష్ట్రానికి, కల్వకుర్తి నియోజకవర్గానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని అందుకుగాను కాంగ్రెస్ ప్రభుత్వ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు నార్య నాయక్, అశోక్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల అక్రమ అరెస్టులు ఖండించాలి



**విశ్వంభర, రంగారెడ్డి :** తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 12,769 గ్రామ పంచాయతీలలో ఐదు సంవత్సరాల పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి గ్రామాలను అభివృద్ధి చేసిన సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర సచివాలయం ముందు తాజా మాజీ సర్పంచులు నిరసన దీక్షకు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు నిరసన కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరవుతున్న సందర్భంలో సర్పంచులను ఎక్కడికక్కడ అక్రమ అరెస్టు చేయడాన్ని రాష్ట్ర సర్పంచుల సంఘం తీవ్రంగా ఖండించింది. గత ప్రభుత్వం ఒత్తిడి మేరకు సర్పంచులు అప్పులు చేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1500 కోట్ల రూపాయలు బిల్లులు పెండింగులో ఉన్నాయని, బిల్లులు అందక సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని సంఘం అధ్యక్షులు తెలిపారు. గత ప్రభుత్వం అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్న ఇంకా బిల్లులు చెల్లించకపోవడం మాజీ సర్పంచులను తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నాయని అన్నారు. గాంధేయ మార్గంలో సచివాలయం ముందు చేయతలపెట్టిన నిరసన దీక్షకు పోలీసులు అడుగడుగున అడ్డుతగిలి అక్రమ అరెస్టులు చేయడం సరికాదని, అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ పెండింగులో ఉన్న బిల్లులు చెల్లించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి, జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సుర్వీ యాదయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, ఉపాధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, వివిధ జిల్లాల, మండలాల సర్పంచుల సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

## సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు




**విశ్వంభర, చివ్వేంల :** కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేసిందని సూర్యాపేట జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ చివ్వేంల మండల విస్తృత స్థాయి నిర్మాణ కౌన్సిల్ సమావేశం మండల కేంద్రంలో రేగటి లింగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సూర్యాపేట జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేసిందని రైతు వ్యతిరేక విధానాలతో రైతాంగానికి తీవ్ర నష్టాన్ని కలిగించే చట్టాలను కేంద్ర ప్రభుత్వం చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన టువంటి ఆరు గ్యారెంటీలను అమలుపరచాలని 2లక్షల రూపాయల రుణమాఫీలో అవకతవకలను బ్యాంక్, వ్యవ సాయ అధికారులు అందుబాటులో ఉండి రైతులకు సకాలంలో రుణాలు అందే విధంగా చూడాలని, కొత్త రుణాల ను రైతులకు అందించి ఆదుకోవాలని, వెంటనే అర్హులైన అటువంటి పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జారీ చేయాలని, చివ్వేంల మండల కేంద్రంలో అర్హులైన అందరికీ ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మండవ వెంకటేశ్వర్లు, బొమ్మగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం అధ్యయనం చేస్తూ పార్టీ ప్రజా సంఘాల బలోపేతం కొరకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఖమ్మం పాటి రాము, జిల్లా కమిటీ సభ్యులు బూర వెంకటేశ్వర్లు, సీనియర్ సీపీఐ నాయకులు ఖమ్మంపాడు అంతయ్య, ఏఐటీయుసీ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, పొదిల లింగయ్య, రామలింగం, దుర్గయ్య, అయితే రాజు లింగయ్య, ఎల్లమ్మ, వెంకటమ్మ, ఉమా, నాగమణి, వెంకటేష్, ఆవుల మల్లేష్, రాములు, సిగ సైదులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాటేపల్లి వద్ద విద్యార్థుల రాస్తారోకో



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మూటకొండూరు మండలం కాటేపల్లి గ్రామం వద్ద మోత్కూరు-రాయగిరి ప్రధాన రహదారిపై బస్సులు ఆపకుండా పోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్ళే విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. విద్యార్థులకు అనుకున్న సమయానికి విద్యాలయాలకు చేరుకోక పోవడంతో విద్యాభ్యాసానికి ఆటంకం కలుగుతుందని తెలిపారు. ఆలస్యంగా వెళ్లడంతో తరగతులలో ఉపాధ్యాయులు చేప్పె పాఠాలు అర్థం కాకపోవడంతో విద్యార్థులు ఆగ్రహంతో శుక్రవారం రోజు కాటేపల్లి స్టేజీ వద్ద రాస్తారోకో చేశారు. వారు మాట్లాడుతూ ఉదయం సాయంత్రం వేళల్లో పాఠశాల, కళాశాలలకు వెళ్ళే విద్యార్థులకు అనుకూలంగా బస్సులను నడపాలని కోరారు. రాస్తారోకో చేస్తున్న విద్యార్థుల వద్దకు మోటాకోండూర్ పోలీసులు చేరుకుని విద్యార్థులకు సర్దిచెప్పి ధర్నా కార్యక్రమాన్ని విరమింప చేశారు.

# పారిశుధ్యం పనులు ప్రతి రోజు చేయాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం శుక్రవారం పరిషత్ కార్యాలయంలో వనమాహోత్సవం, పారిశుధ్య కార్యక్రమాల పైన సమీక్షా సమావేశం నిర్వహించిన ఎంపీడీఓ రాములు నాయక్. ఎంపీడీఓ మాట్లాడుతూ వనమాహోత్సవం కార్య క్రమంలో గ్రామాల్లో పెద్ద ఎత్తున్న ప్లాంటేషన్ పనులు చే యాలనీ ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం పనులు ప్రతి రోజు చేయాలని, సీజనల్ వ్యాధులు రాకుండా శాని టేషన్ చేయించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమా వేశంలో పాల్గొన్న ఎంపీఓ జులూరు పద్మావతి, ఏపీఓ బోడిగే రమేష్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు మల్లేష్, శ్రీశైలం, యాదిరెడ్డి, నిర్మల, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

# శివాలయ నిర్మాణానికి పది లక్షల విరాళం

**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లి మండలం మల్లారెడ్డి పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయంలో శివాలయం గుడి నిర్మించడానికి పది లక్షల రూపాయలను కర్మన్ ఘట్ ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి కుటుంబ సభ్యులు విరాళంగా అందజేసి నట్టు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు మల్లారెడ్డిపల్లి ఆంజనేయ స్వామి దేవాలయం కమిటీ తరుపున గ్రామ ప్రజలు ధన్యవాదములు తెలిపారు. ఆలయ నిర్మాణానికి, గ్రామ అభివృద్ధికి సహకరింస్తున్న నల్ల రఘుమారెడ్డి కుటుంబం సభ్యులకు మల్లారెడ్డిపల్లి గ్రామ ప్రజలు రుణపడి ఉంటామని తెలిపారు.

# మండల సీపీఐ కార్యదర్శిగా మారుపాక వెంకటేశం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో గురువారం సీపీఐ ఆత్మకూరు(ఎం) మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశం మారుపాక మల్లేష్ అధ్యక్షతన జరిపారు. కౌన్సిల్ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శిగా మారుపాక వెంకటేష్, సహాయ కార్యదర్శిగా బత్తిని నరేష్ లను ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన మండల కార్యవర్గ కౌన్సిల్ సభ్యులకు, సీపీఐ జిల్లా నాయకులకు వారు ధన్యవాదాలు తెలియజేశారు. మాకు ఇచ్చిన బాధ్యతలను దృష్టిలో ఉంచుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని నిత్యం ప్రజల మధ్యనే ఉంటామని, ప్రభుత్వం నుండి వచ్చే ప్రతిఫలాలు అర్హులైన పేద ప్రజలకు ఆందేలా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. సీపీఐ పార్టీ తరపున ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామని తెలిపారు.



# అంగన్వాడిలో తల్లిపాల వారోత్సవాలు

**విశ్వాంబర, తలకొండపల్లి :** తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ సెక్టార్ రెండవ అంగన్వాడీలో సూపర్వైజర్ తిరుమల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలను గంటలోపు త్రాగించాలని అమ్మ పాలు అమృతం, బంగారం కంటే విలువైనవని, ముర్రు పాలు తాగిన బిడ్డలో గుండెజబ్బులు, క్యాన్సర్, బీపీ, తీవ్ర శ్వాసకోశ వ్యాధులు, ఎలర్జీ వ్యాధులు, ఎదుర్కొనే శక్తి ఎక్కువగా ఉంటుందని తల్లిపాలు సులభంగా జీర్ణం అవుతాయి కనుక తల్లి పాలను తప్పకుండా పసిబిడ్డలకు త్రాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ తిరుమల, అంగన్వాడి టీచర్స్ నస్రీన్ బేగం, భూషణమ్మ, వసంత లక్ష్మి, ఏ.ఎన్.ఎం సుజాత, ఆశ వర్కర్ కవిత, తల్లులు, గర్భిణీలు పాల్గొన్నారు.




# సివిల్స్ అభ్యర్థుల మృతి కేసు

## సీబీఐ విచారణకు హైకోర్టు ఆదేశం

**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలోని ఓల్డ్ రాజేందర్ నగర్‌లో రావూస్ కోచింగ్ సెంటర్‌లో వరదల కారణంగా ఇటీవల ముగ్గురు సివిల్ సర్వీస్ అభ్యర్థులు మరణించిన ఘటన దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఢిల్లీలోని కోచింగ్ సెంటర్‌లో సివిల్స్‌కు ప్రిపేరవుతున్న అభ్యర్థుల మృతి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటనపై సీబీఐ విచారణకు ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ఈ ఘటన నేపథ్యంలో ఢిల్లీలోని కోచింగ్ సెంటర్ల పరిస్థితిపై అధికార యంత్రాంగం తనిఖీలు చేపట్టింది. అక్రమంగా బేస్‌మెంట్స్‌లో కొనసాగుతున్న కోచింగ్ సెంటర్లపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. కాగా, ఢిల్లీ లోని ఓల్డ్ రాజేందర్ నగర్‌లో గల ఓ కోచింగ్ సెంటర్‌లోకి వరద నీరు ప్రవేశించి ముగ్గురు విద్యార్థులు మ-రణించిన విషయం తెలిసిందే. రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. శనివారం రాత్రి 7 గంటల సమయంలో రావుస్ స్టడీ సర్కిల్ బేస్‌మెంట్‌లోకి ఒక్కసారిగా వరద నీరు చేరింది. ఈ సమయంలో బేస-మెంట్‌లో ఉన్న లైబ్రరీలో దాదాపు 18 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 15 మంది ఎలాగోలా బయటపడగా, ముగ్గురు మాత్రం నీటిలో మునిగిపోయారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఢిల్లీ అగ్నిమాపక శాఖ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వచ్చి వారిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది.

# నీట్ పెట్టకముందు

# అమ్మకానికి వైద్య విద్య సీట్లు

- పీజీ సీట్లను రూ.8 నుంచి13 కోట్లకు అమ్మకానికి పెట్టారు
- రాజ్యసభలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా వ్యాఖ్యలు..

**విశ్వంభర, దిల్లీ :** కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా నీట్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. నీట్ ప్రవేశపెట్టకముందు దేశంలో వైద్య విద్య వ్యాపారంగా ఉందని, పీజీ సీట్లు అప్పట్లో రూ. 8కోట్ల నుంచి రూ. 13కోట్లకు అమ్మకానికి పెట్టేవారని పేర్కొన్నారు. నీట్‌పై రాజ్యసభ ఎంపీ మహ్మద్ అబ్దుల్లా ప్రవేశపెట్టిన ప్రైవేట్ మెంబర్ బిల్లుపై శుక్రవారం జరిగిన చర్చలో నడ్డా జోక్యం చేసుకుని ఈ వ్యాఖ్యలు చేశారు. తొలుత ఆరోగ్య శాఖ మంత్రిగా తన హయాంలో



నీట్‌ను తీసుకురాక ముందు వైద్య విద్యలో అవినీతి పెచ్చరిల్లిందని గుర్తుచేశారు. తాను ఆరోగ్య శాఖ మంత్రిగా నీట్‌ను ప్రవేశపెట్టే సమయంలో పీజీ సీటు రూ. 8 కోట్లు పలికేదని, రేడియాలజీ వంటి విభాగంలో సీట్లు రూ. 12-13కోట్లకు అమ్మకానికి పెట్టేవారని ఆయన పేర్కొన్నారు. నీట్ విధానం అమలుకు ముందు విద్యార్థులు దేశ వ్యాప్తంగా వైద్య పరీక్షల కోసం ప్రయాణించాల్సి వచ్చేదని వివరించారు. సమయం, డబ్బు వెచ్చించడంతో పాటు వైద్య విద్యా వ్యవస్థలో విద్యార్థులు అవినీతిని ఎదుర్కోవాల్సి వచ్చేదని అన్నారు. వైద్య విద్యలో సీట్లను బహిరంగ మార్కెట్‌లో అమ్మకానికి పెట్టి వ్యాపారంలా మార్చేశారని చెప్పారు. స్వార్థపర శక్తుల ప్రయోజనాల కోసం వైద్య విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని అన్నారు. కాగా, పేపర్ లీక్ కేసులు, నీట్ పరీక్షల్లో అవకతవకల నేపథ్యంలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.



# 300దాటిన వయనాడ్ మృతుల సంఖ్య

### లభించని 49మంది చిన్నారుల ఆచూకీ
### ప్రతికూల వాతావరణంలోనూ గాలిస్తున్న రెస్క్యూ బృందాలు

**దిల్లీ:** కేరళలోని వయనాడ్లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య 300 దాటింది. ఈ క్రమంలో 49 మంది చిన్నారుల ఆచూకీ లభించలేదని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. వీరు మరణించడం లేదా గల్లంతైనట్లు విద్యాశాఖ మంత్రి శివన్కుట్టి పేర్కొన్నారు. వరదల్లో ఓ హైస్కూల్ మొత్తం కొట్టుకుపోయిందన్న ఆయన.. అనేక భవనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. “ఇప్పటివరకు ఉన్న నివేదికల ప్రకారం.. 49 మంది చిన్నారులు మరణించడం లేదా గల్లంతయ్యారు. వెల్లరిమలలోని ఉన్నత పాఠశాల మొత్తం ధ్వంసమైంది. ముండక్కైతోపాటు పలు చోట్ల పాఠశాలలు దెబ్బతిన్నాయి. ప్రాణాలతో బయటపడిన విద్యార్థులు సర్టిఫికెట్లు, పుస్తకాలు కోల్పోయారు. వీరికి సహాయం చేసేందుకు ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం” అని విద్యాశాఖ మంత్రి శివన్కుట్టి వెల్లడించారు. కొండచరియలు విరిగిపడిన ఘటనలో అనేక మంది ఆచూకీ లేకుండా పోయింది. వీరికోసం రెస్క్యూ బృందాలు ప్రతికూల వాతావరణంలోనూ తీవ్రంగా గాలిస్తున్నాయి. ఇప్పటివరకు 200లకు పైగా మృతదేహాలకు పోస్టుమార్టం చేసినట్లు సమాచారం. కాగా మరో 218 మంది ఆచూకీ గల్లంతైనట్లు వయనాడ్ జిల్లా అధికారులు వెల్లడించారు. 94 రిలీఫ్ క్యాంపుల్లో దాదాపు 10వేల మందికి పునరావాసం కల్పిస్తున్నట్లు చెప్పారు.




### బీమా పాలసీలు, ప్రీమియంపై
## జీఎస్టీని ఉపసంహరించాలి
### మమతా బెనర్జీ

**విశ్వంభర, కోల్‌కతా:** జీవిత, ఆరోగ్య బీమా పాలసీలు, ప్రీమియంపై జీఎస్టీని ఉపసంహరించాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ డిమాండ్ చేశారు. బీమాపై 18 శాతం పన్నును కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించడాన్ని విమర్శించారు. ప్రజా వ్యతిరేక నిర్ణయమని కేంద్ర ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. దీనిని సమీక్షించాలని కోరుతూ నిర్మలా సీతారామన్‌కు మమతా బెనర్జీ లేఖ రాశారు. ఊహించని కష్ట సమయాల్లో ఆర్థిక భద్రత అందించడం జీవిత, ఆరోగ్య ఇన్సూరెన్స్ ప్రాథమిక లక్ష్యమని తెలిపారు. అలాంటి సమయాల్లో వ్యక్తులు, వారి కుటుంబాలు కష్టాలను తట్టుకునేలా చేయడంలో ఈ పాలసీలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. కాగా, బీమా పాలసీలు, ప్రీమియంపై 18 శాతం జీఎస్టీ విధించడం సామాన్యులపై ఆర్థిక భారాన్ని పెంచుతుందని మమతా బెనర్జీ ఆందోళన వ్యక్తం చేశారు. అదనపు భారం వల్ల చాలా మంది వ్యక్తులు కొత్త పాలసీలు తీసుకోకుండా లేదా ఇప్పటికే ఉన్న బీమా కవరేజీని కొనసాగించకుండా నిరోధించే అవకాశం ఉందని తెలిపారు. దీంతో వారు ఊహించని ఆర్థిక ఇబ్బందులకు గురవుతారని అన్నారు. ఈ నేపథ్యంలో బీమా పాలసీలు, ప్రీమియంపై 18 శాతం జీఎస్టీ విధింపును సమీక్షించాలని ఆ లేఖ ద్వారా కోరారు. మరోవైపు పన్నులపై నిర్ణయం తీసుకునే జీఎస్టీ కౌన్సిల్ ఆగస్టులో సమావేశం కానున్నది.

### కేంద్ర మంత్రిని కూర్చోమన్న
## స్పీకర్ ఓం బిర్లా.. ఎందుకంటే?


**న్యూఢిల్లీ:** లోక్‌సభ సమావేశాల్లో అరుదైన సంఘటన జరిగింది. ఒక ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి స్పందించారు. అయితే ఆ ప్రశ్న అర్థం కాకపోవడంతో ఆయన శాఖకు సంబంధించిన సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో జోక్యం చేసుకున్న స్పీకర్ ఓం బిర్లా సీటులో కూర్చోవాలని ఆ మంత్రికి చెప్పారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. శుక్రవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో రాజస్థాన్‌లోని కరౌలీ-ధోల్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ భజన్ లాల్ జాతవ్, జాతీయ రహదారి ప్రమాణాల గురించి ప్రశ్న అడిగారు. తన పార్లమెంటరీ నియోజకవర్గంలో మూడు పుణ్యక్షేత్రాలు ఉన్నాయని, వాటి రోడ్లను జాతీయ రహదారులుగా గుర్తించే యోచన కేంద్ర ప్రభుత్వానికి ఉందా? అని ప్రశ్నించారు. కాగా, కేంద్ర రోడ్డు రవాణా శాఖ సహాయ మంత్రి అజయ్ టామ్టా ఈ ప్రశ్నపై స్పందించారు. ఒక ఎంపీ మహారాష్ట్ర గురించి ప్రశ్న అడిగినట్లు తెలిపారు. ప్రతిపక్షం స్పందిస్తూ మహారాష్ట్ర కాదు రాజస్థాన్ అని అన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా ఆ ప్రశ్న గురించి మంత్రికి తెలియజేశారు. అయితే 2014కు ముందు ఆ తర్వాత జాతీయ రహదారులకు సంబంధించిన



సమాచారాన్ని మంత్రి చదివారు. 2014 నాటికి 91,281 కిలోమీటర్ల జాతీయ రహదారి ఉండగా, ప్రధాని మోదీ హయాంలో 1,41,136 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను నిర్మించినట్లు చెప్పారు. దీంతో ఎంపీ అడిగిన ప్రశ్న మంత్రి అజయ్‌కు అర్థం కాలేదని స్పీకర్ గ్రహించారు. కేంద్ర మంత్రిని కూర్చోమని ఆయన సైగ చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## ఐఎస్ఎస్ యాత్రకు ప్రధాన వ్యోమగామిగా శుభాన్షు శుక్లా

**దిల్లీ:** భారత్ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్ యాన్' కోసం ఇస్రో తీవ్ర కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మిషన్ 2025లో చేపట్టనుండగా.. దీనికి ముందే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) మన వ్యోమగామి ఒకరు వెళ్లనున్నారు. భారత్-అమెరికా సంయుక్తంగా చేపడుతోన్న ఈ మిషన్లో ప్రధాన వ్యోమగామిగా శుభాన్షు శుక్లాను ఇస్రో ఎంపిక చేసింది. గగన్ యాన్ కు



ఎంపికైన నలుగురు వ్యోమగాముల్లో ఈయనే అతిపిన్న వయస్కుడు కావడం గమనార్హం. ఇస్రో చేపడుతోన్న హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్ కోసం అమెరికాకు చెందిన యాక్సియం స్పేస్తో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపింది. ఇందుకోసం ప్రధాన వ్యోమగామిగా శుక్లాను ఎంపిక చేసిన ఇస్రో.. బ్యాకప్ గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ను ఎంచుకుంది. ఏదైనా ప్రమాదం లేదా అనివార్య కారణాల వల్ల ప్రధాన వ్యోమగామి వెళ్లలేకపోతే ఆయన స్థానంలో బ్యాకప్ ఉన్న వ్యక్తిని పంపిస్తారు. ఆగస్టు తొలివారంలోనే వీరికి శిక్షణ మొదలవుతుందని ఇస్రో ప్రకటించింది. 1985లో యూపీలోని లఖనవూలో శుభాన్షు శుక్లా జన్మించారు. 2006 జూన్లో ఫైటర్ విమానాల పైలట్గా చేరారు. దాదాపు 2వేల గంటలు గగనవిహార అనుభవం సాధించారు. గగన్యాన్కు ఎంపికైన ఈయన ఇప్పటికే రష్యాలో శిక్షణ పూర్తిచేసుకున్నారు. ప్రస్తుతం ఇస్రో సారథ్యంలో మరింత శిక్షణ పొందుతున్నారు. వచ్చే ఏడాది చేపట్టనున్న గగన్ యాన్ యాత్రకు ఎంపికైన నలుగురు వ్యోమగాముల పేర్లను ఇదివరకే ఇస్రో ప్రకటించింది. భారత వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అంగద్ ప్రతాప్, అజిత్ కృష్ణన్, వింగ్ కమాండర్ శుభాన్షు శుక్లా వ్యోమనౌకలో రోదసీలోకి వెళ్లనున్నారు. భారత నేల నుంచి స్వదేశీ వ్యోమనౌకలో అంతరిక్షంలోకి వెళ్లనున్న మొదటి భారతీయ బృందంగా వీరు ఘనత దక్కించుకోనున్నారు.



### మొబైల్ హాట్‌స్పాట్ షేర్ చేసేందుకు
## నిరాకరించిన భార్య
### హత్య చేసిన భర్త

**చండీగఢ్:** మొబైల్ హాట్‌స్పాట్ షేర్ చేసేందుకు భార్య నిరాకరించింది. దీంతో ఆగ్రహించిన భర్త ఆమెను హత్య చేశాడు. ఆ తర్వాత ఇంటి నుంచి పారిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. హర్యానాలోని రోహ్‌తక్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జూలై 30న మదీనా గ్రామానికి చెందిన అజయ్ కుమార్, అతడి భార్య రేఖ వారి ఇంట్లో మొబైల్ ఫోన్లు వినియోగిస్తున్నారు. ఆ సమయంలో అజయ్ మొబైల్ డేటా అయి-పోయింది. దీంతో మొబైల్ హాట్‌స్పాట్ ఆన్ చేయమని భార్యను కోరాడు. కాగా, తన మొబైల్ డేటా తక్కువగాఉందని భార్య రేఖ చెప్పింది. హాట్‌స్పాట్‌ను ఆన్ చేసేందుకు ఆమె నిరాకరించింది. దీంతో ఆగ్రహించిన అజయ్ పదునైన ఆయుధంతో భార్యపై దాడి చేశాడు. ఆమెను హత్య చేసి ఇంటి నుంచి పారిపోయాడు. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రేఖ కుటుంబం ఫిర్యాదుతో ఆమె హత్యపై కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న భర్త అజయ్‌ను అదే రోజు అరెస్ట్ చేశారు. రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు.




### వికలాంగులైన చిన్నారుల మృతికి
## బాధ్యులపై చర్యలు చేపట్టాలి

- షెల్టర్ హోం మరణాలపై ప్రియాంక చతుర్వేది కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ:** ఢిల్లీలోని ఆశా కిరణ్ షెల్టర్ హోంలో మరణాలపై శివసేన యూబీటీ నేత ప్రియాంక చతుర్వేది స్పందించారు. ఎన్నికలకు ముందు ప్రతి ఒక్కరూ మహిళల అంశాలను లేవనెత్తుతారని, ప్రతి ఒక్కరికీ మహిళల ఓట్లు కావాలని కానీ, ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మహిళల గురించి పట్టించుకోరని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా కిరణ్ షెల్టర్ హోంలో మానసిక వికలాంగులైన చిన్నారుల మృతికి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని ప్రియాంక చతుర్వేది డిమాండ్ చేశారు. మహిళలకు తప్పనిసరిగా న్యాయం జరగాలని ఆమె ఆకాంక్షించారు. మరోవైపు ఢిల్లీలోని ఆశా కిరణ్ షెల్టర్ హోంలో వెలుగుచూసిన మరణాలపై రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ స్పందించారు. గత 20 రోజులుగా ఢిల్లీ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆశా కిరణ్ షెల్టర్ హోంలో 13 మంది మరణించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మరణాలకు కారణాలేంటనేది ఇప్పటివరకూ బయటపడలేదని అన్నారు. తాను ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్‌గా ఉన్న సమయంలో అక్కడి పరిస్థితిని తనిఖీ చేశానని చెప్పారు. అక్కడి పరిస్థితి ఏమీ బాగా లేదని, సరైన సిబ్బంది లేరని, వైద్యులు అందుబాటులో ఉండరని తెలిపారు.



# బీఎస్ఎఫ్ డీజీ తొలగింపు

### కేంద్రం అనూహ్య నిర్ణయం

**దిల్లీ:** దేశ సరిహద్దు భద్రతా దళం బీఎస్ఎఫ్‌న్ సంబంధించి కేంద్ర ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నితిన్ అగర్వాల్‌తోపాటు డిప్యూటీ స్పెషల్ డీజీ (పశ్చిమ) వైబీ ఖురానియాలను తొలగించింది. తక్షణమే వారిని తమ రాష్ట్ర కేడర్లకు వెళ్లిపోవాలని ఆదేశించింది. నితిన్ అగర్వాల్ కేరళ కేడర్ 1989 బ్యాచ్ అధికారి కాగా, ఖురానియా ఒడిశాకు చెందిన 1990 బ్యాచ్ అధికా రి. బీఎస్ఎఫ్ చీఫ్‌గా నితిన్ అగర్వాల్ గతేడాది జూన్లో బాధ్యతలు చేపట్టారు. పాకిస్థాన్ సరిహద్దు బలగాలకు స్పెషల్ డీజీ (పశ్చిమ) ఖురానియా నేతృత్వం వహిస్తున్నారు. ఆయా బాధ్యతల నుంచి వీరిని తక్షణమే తొలగిస్తున్నట్లు కేబినెట్ నియామకాల కమిటీ వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. బీఎస్ఎఫ్కు చెందిన 2.65 లక్షల మంది పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దులకు రక్షణగా నిలుస్తున్న విషయం తెలిసిందే.



## ఏపీలో కొత్త ఎక్సైజ్ పాలసీ
# ముహూర్తం ఖరారు

**విశ్వంభర, అమరావతి :** ఏపీలో గత వైసీపీ ప్రభుత్వంలో అమలు చేసిన మద్యం విధానానికి త్వరలో మంగళం పాడేందుకు కూటమి సర్కార్ సిద్ధమవుతోంది. దీని స్థానంలో కొత్తగా మరో ఎక్సైజ్ పాలసీని అమల్లోకి తెచ్చేందుకు చర్యలు ప్రారంభించింది. ఇందుకోసం ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న మద్యం విధానాన్ని అధ్యయనం చేసేందుకు నాలుగు బృందాల్ని ఏర్పాటు చేసింది. ఇందులో ఒక్కో టీమ్ లో ముగ్గురు అధికారుల చొప్పున ఉన్నారు. వీరు పది రోజుల్లో ఆయా రాష్ట్రాల్ని సందర్శించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు. దీని ఆధారంగా కొత్త ఎక్సైజ్ పాలసీ రూపుదిద్దుకోనుంది. ఏపీలో ప్రస్తుతం గత వైసీపీ మద్యం పాలసీయే అమలవుతోంది. దీని ప్రకారం ప్రభుత్వ ఆధ్వర్యం లోనే మద్యం దుకాణాలున్నాయి. గతంలో వైసీపీ అధికారంలోకి రాకముందు ప్రైవేటు కాంట్రాక్టర్లు వేలం ద్వారా మద్యం షాపుల్ని చేజిక్కించుకునేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం మాత్రం ఈ విధానం రద్దు చేసి తామే మద్యం వ్యాపారం చేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా భారీ ఎత్తున సిబ్బందిని కూడా నియమించుకుంది. ఇప్పుడు వీరిని తొలగించి ప్రభుత్వం తిరిగి ప్రైవేటు వ్యక్తులకు కాంట్రాక్టులు ఇచ్చే అవకాశముంది. గతంలో దశలవారీ మద్య నిషేధం అమలు చేస్తామని అధికారం చేపట్టిన వైసీపీ సర్కార్.. ఆ తర్వాత అరకొరగా షాపులు తగ్గించి తిరిగి వాటిని పెంచేసింది. నాసిరకం బ్రాండ్లను తెచ్చి అసలు బ్రాండ్లను రాష్ట్రంలోకి రానివ్వకుండా అడ్డుకుంది. మద్యం పంపిణీ, సరఫరాపై తీవ్ర ఆంక్షలు విధించింది. దీని వల్ల దొడ్డిదారిన ప్రభుత్వ పెద్దలకు మాత్రమే లబ్ది చేకూరింది. దీంతో ఇప్పుడు తిరిగి కూటమి సర్కార్ వేలం పాట నిర్వహించి మద్యం షాపుల్ని ప్రైవేటుకు కట్టబెట్టనుంది. ఈ మేరకు ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసేందుకు నాలుగు టీమ్స్ ఏర్పాటు చేసింది. ఈ టీమ్స్ నివేదిక ఆధారంగా అక్టోబర్ 1 నుంచి కొత్త విధానం అమలు చేయనుంది.



## తిరుమల యాత్ర భక్తులకు దివ్యానుభూతిని కల్పించేలా చర్యలు

**టీటీడీ ఈవో శ్యామలరావు**

**విశ్వంభర, అమరావతి :** తిరుమలకు వచ్చే భక్తులందరికీ మెరుగైన సేవలు అందించి దివ్యానుభూతిని కల్పించేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భక్తులకు శ్రీవారి దర్శనం, వసతి, ఇతర సౌకర్యాలు మరింత మెరుగ్గా కల్పించేందుకు, అందరి సమన్వయంతో ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరించడం తన పూ-ర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు చెప్పారు. తిరుమలలోని హెూటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, పరిశుభ్రమైన, నాణ్యమైన, రుచికరమైన ఆహార పదార్థాలను అందివ్వాలని ఆదేశాలు జారీ చేశామని భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాదానం ఇచ్చారు. ఇప్పటికే ఆహార పదార్థాల తయారీదారులు , హెూటల్ సిబ్బందికి ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులతో శిక్షణ నిర్వహించినట్లు వివరించారు.

### శ్రీవారి బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు..

ఈ ఏడాది అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు జరుగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయని ఈవో ప్రకటించారు. బ్రహ్మోత్సవాల పనులను సెప్టెంబరు చివరినాటికి పూర్తి చేస్తామని వివరించారు. ఆగస్టు 15 నుంచి 17వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు జరుగనున్నాయని, ఆగస్టు 14న అంకురార్పణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. శ్రీవారి ఆలయం వద్ద గల పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించి పైపులైన్ల మరమ్మతులు, సివిల్ పనులు చేపట్టేందుకు ఆగస్టు 1 నుంచి పుష్కరిణిని మూసివేశామని ఈయన వెల్లడించారు. శ్రీవారి భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు వీలుగా పుష్కరిణి పైభాగంలో షవర్లు ఏర్పాటు చేశామన్నారు.

### ఆఫ్‌లైన్‌లో రోజుకు వెయ్యి శ్రీవాణి దర్శనం టికెట్లు..

సామాన్య భక్తులకు దర్శన సమయాన్ని పెంచేందుకుగాను జూలై 22వ తేదీ నుండి ఆఫ్‌లైన్‌లో రోజుకు 1000 శ్రీవాణి దర్శనం టికెట్లను మాత్రమే జారీ చేయాలని నిర్ణయించామని శ్యామలారావు తెలిపారు. శ్రీవాణి దాతలకు తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో 900, మిగిలిన 100 టికెట్లను విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కౌంటర్‌లో జారీ చేస్తున్నామని వివరించారు.

### తిరుమలలో దళారుల ఏరివేతకు చర్యలు..

శ్రీవారి భక్తులకు అవసరమైన వసతి, దర్శనం, ఆర్జితసేవ టికెట్లకు సంబంధించి మోసగిస్తున్న అనేక మంది దళారులను ఎప్పటికప్పుడు కనిపెట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని ఈవో తెలిపారు. టీటీడీ ఐటి వ్యవస్థను మరింత బలోపేతం చేసి ఆర్జిత సేవలు, దర్శనం, వసతి తదితర సేవల బుకింగ్‌లో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు చర్యలు చేపట్టామని అనన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీఈవో, అధికారులు పాల్గొన్నారు.

# అమరావతిలో యూఏఈ భారీ పెట్టుబడులు

**యూఏఈ అంబాసిడర్‌తో టి.జి.భరత్ బేటీ**

**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఏపీలో పెట్టుబడులు తీసుకురావటానికి చంద్రబాబుతో పాటు మంత్రులు తీవ్రంగా కష్టపడుతున్నారు. పారిశ్రామికంగా ఏపీని అభివృద్ధి చేస్తేనే సంపద సృష్టి జరుగుతుందని భావించి ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇదే క్రమంలో గత వైసీపీ హయాంలో పెట్టుబడులు పెట్టబోమని వెనక్కు వెళ్ళిన యూఏఈ ఇప్పుడు చంద్రబాబు హయాంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహం చూపిస్తుంది. అందులో భాగంగా తాజాగా మరో కీలక అడుగు పడింది. యూఏఈ – ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ రౌండ్ టేబుల్ సమావేశం విజయవాడలోని ఓ హెూటల్‌లో ఏపీ ఎకనామిక్ డెవలప్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో యూఏఈ – ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్, ఇన్వెస్ట్‌మెంట్ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. యూఏఈ అంబాసిడర్ అబ్దుల్ నాసిర్ జమాల్ అల్‌షాలీ, ఏపీతో పాటు దుబాయ్ వ్యాపార ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను మంత్రి టి.జి భరత్ వారితో చర్చించారు.




### ఏపీలో పెట్టాలనుకున్న ప్రాజెక్ట్‌లపై చర్చ..

యూఏఈ అంబాసిడర్ అబ్దుల్ నాసిర్ జమాల్ అల్‌షాలీ మాట్లాడుతూ ఏపీలో పెట్టాలనుకున్న ప్రాజెక్టులు గత ఐదేళ్లలో పక్కకు వెళ్లాయన్నారు. మొదటగా ఈ ప్రాజెక్టుల సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. త్వరిత గతిన వీటని ట్రాక్ పెట్టేందుకు పని చెయ్యాలన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు తాము ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. ఏపీలో పరిశ్రమలు పెట్టేందుకు అన్ని విధాలా ప్రభుత్వ సహకారం అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రకాల పరిశ్రమలు పెట్టేందుకు అవకాశం ఉందన్నారు. యూఏఈ నుండి ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ తెలిపారు. గడిచిన ఐదేళ్లలో లులూతో పాటు పలు కంపెనీలు ఏపీ నుండి వెళ్లిపోయాయని చెప్పారు. తమ ప్రభుత్వంలో యూఏఈ నుండి భారీగా పెట్టుబడులు తీసుకొస్తామన్నారు.

## ఏపీలో మెట్రో రైల్
# ప్రాజెక్టు పై కీలక నిర్ణయం..!!

**మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీగా రామకృష్ణారెడ్డి నియామకం**

**విశ్వంభర, అమరావతి :** ఏపీలో మెట్రో రైల్ ప్రాజెక్టు మ-రోసారి తెర మీదకు వచ్చింది. ఏపీ ప్రభుత్వం తాజాగా ఆంధ్రప్రదేశ్ మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీ గా రామకృష్ణారెడ్డిని మరోసారి నియమించింది. ఈ మేరకు పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన మూడేళ్లపాటు ఎంఆర్‌సీఎండీగా కొనసాగనున్నారు. రామకృష్ణా రెడ్డి గతంలోనూ ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీగా పనిచేశారు. ప్రస్తుతం ఎండీగా పనిచేస్తున్న జయమన్మథరావును రిలీవ్ చేసారు. రెండు నగరాల్లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలోని విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైల్ ఏర్పాటు కోసం సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సి ఉంది. దానికి గానూ ఒక ఏడాది గడువు విధిస్తూ చట్టంలోని షెడ్యూల్ 13లో పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2015 అక్టోబర్ 29న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంస్థగా ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఏర్పాటైంది. విజయవాడ, విశాఖ నగరాల్లో మెట్రో రైల్ అభివృద్ధి లక్ష్యం. ఆ తర్వాత విజయవాడ మెట్రోని అమరావతి వరకూ పొడిగించాలని ప్రతిపాదన సిద్ధం చేశారు. నాటి మెట్రో ప్రతిపాదనలు 2014–19 కాలంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విజయవాడ మెట్రో రైలు ప్రతిపాదనను పట్టాలెక్కించారు. రెండుకారిడార్లలో మెట్రోరైలు నిర్మాణానికి ప్రతిపాదనలు, డీపీఆర్‌లు తయారు చేశారు. మొదటి కారిడార్ మహాత్మాగాంధీ రోడ్ ద్వారా వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ వరకు, రెండవది బీఆర్‌టీఎస్ రోడ్, రైల్వేస్టేషన్ నుంచి రామవర్పాడు రింగ్ నుంచి పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ వరకు నిర్మించాలని ప్రతిపాదించారు. ఎండీగా ఉన్న ఎన్ పీ రామకృష్ణారెడ్డి సారథ్యంలో అమరావతి మెట్రో కోసమంటూ దిల్లీ మెట్రో రైల్ ప్రాజెక్ట్ అధికారి శ్రీధరన్ తో ఎంవోయూ కూడా కుదుర్చుకున్నారు. డీపీఆర్ కూడా



సిద్ధం చేసి కేంద్రానికి ప్రతిపాదించారు. కానీ దానిని కేంద్రం తిరస్కరించింది. లైట్ మెట్రో ప్రాజెక్ట్ పేరుతో చేసిన ప్రయత్నం ముందుకు సాగలేదు. కొరియా, మలేసియా సంస్థల సహకారం తీసుకుని ముందుకు సాగుతామని ఏపీ ప్రభుత్వం చెప్పినప్పటికీ కేంద్రం నుంచి సహకారం లేకపోవడంతో అది ముందుకు సాగలేదు. తదుపరి విశాఖ మెట్రో రీజియన్ డెవలప్ మెంట్ అథారిటీ(వీఎంఆర్డీయే) పరిధిలో మెట్రో ప్రాజెక్ట్ తో పాటుగా విజయవాడ నగరంలో మెట్రో ప్రాజెక్టు కోసం ఏపీ మెట్రో రైల్ కార్పోరేషన్ లిమిటెడ్(ఏపీఎంఆర్సీఎల్) పనిచేస్తుందని ప్రకటించారు. తిరిగి, ఇప్పుడు తాజా నియామకంతో ఈ ప్రతిపాదనలు పట్టాలెక్కే అవకాశం ఉంది.


## విశాఖ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బెదిరింపులను
# ధీటుగా ఎదుర్కోవాలి

**వైసీపీ అధినేత వైఎస్ జగన్**

**విశ్వంభర, అమరావతి :** ఉమ్మడి విశాఖపట్నం స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ బెదిరింపులకు పాల్పడే అవకాశముందని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి విశాఖ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ ఎన్నికల్లోనూ మెజారిటీ లేకపోయినా ప్రలోభాలు, బెదిరింపులు, కుట్రలతో గెలిచేందుకు చేసే ప్రయత్నాలను ధీటుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. విశాఖ జిల్లాలో వైసీపీకి భారీ మెజార్టీ ఉందని పేర్కొన్నారు. గెలువలేమని తెలిసినా కూడా చంద్రబాబు అభ్యర్థిని నిలబెడుతారని అన్నారు. పార్టీ నాయకుల అభిప్రాయాల మేరకు వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణ పేరును ఖరారు చేస్తున్నట్లు ప్రకటించారు. అభ్యర్థి గెలుపు కోసం పార్టీ నాయకులంతా ఐక్యంగా పనిచేయాలని సూచించారు. వైసీపీకి చెందిన విశాఖ ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. పార్టీ ఫిరాయింపునకు పాల్పడ్డ ఆయనపై వైసీపీ అధిష్ఠానం ఫిర్యాదుతో మండలి చైర్మన్ ఆయనపై అనర్హత వేటు వేశారు. దీంతో ఇక్కడ ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతుంది. ఆగస్టు 6న ఉపఎన్నికకు నోటిఫికేషన్ విడుదల, అదేరోజు నుంచి నామినేషన్ల స్వీకరణ, ఆగస్టు 13 వరకు నామినేషన్లకు ఆఖరు గడువు , 14న పరిశీలన, 16న ఉపసంహరణ ప్రక్రియ ఉ



ంటుందని ఎన్నికల అధికారులు వివరించారు. ఆగస్టు 30న ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉపఎన్నిక, సెప్టెంబరు 3వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందని వివరించారు. ఉమ్మడి విశాఖపట్నం ఉమ్మడి జిల్లా పరిధిలోని విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జిల్లా ప్రజాపరిషత్, మండల ప్రజాపరిషత్ సభ్యులు కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.



## వైఎస్ జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో
# బిందు సేద్యం నిర్వీర్యం
### ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు

**విశ్వంభర, అమరావతి :** ఏపీలో ఐదేండ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్ జగన్ రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. కేంద్రం నుంచే వచ్చే నిధులను మళ్లించి బిందు సేద్యాన్ని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. శుక్రవారం వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రైతుల పట్ల తీవ్ర కక్ష పూరితంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని వెల్లడించారు. బిందు సేద్యానికి కావల్సిన పనిముట్లకు తక్షణమే రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. వైసీపీ పాలనలో రూ.1167 కోట్ల బకాయిలు పెట్టిందని విమర్శించారు. దేశంలోనే అన్నపూర్ణ రాష్ట్రంగా వెలుగొందిన ఆంధ్రప్రదేశ్‌ను చివరిస్థానంలోకి తీసుకెళ్లారని ఆరోపించారు.



## మళ్లీ పడిపోయిన ఫారెక్స్ రిజర్వు నిల్వలు

- 3.47 బిలియన్ డాలర్లకు చేరాయని ఆర్బీఐ ప్రకటన

**విశ్వంభర (బిజినెస్) :** ఫారెక్స్ రిజర్వు నిధులు మళ్లీ పడిపోయాయి. జూలై 26తో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వు నిధులు 3.471 బిలియన్ డాలర్లు పడిపోయి 667.386 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని శుక్రవారం ఆర్బీఐ ఓ ప్రకటనలో తెలిపింది. అంతకు ముందు వారం జూలై 19తో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు జీవిత కాల గరిష్ట స్థాయి 670.857 బిలియన్ డాలర్లకు చేరుకున్న సంగతి తెలిసిందే. ఫారెక్స్ రిజర్వు నిల్వల్లో కీలకమైన జూలై 26తో ముగిసిన వారానికి ఫారిన్ కరెన్సీ అసెట్స్ 1.171 బిలియన్ డాలర్లు పతనమై 586.877 బిలియన్ డాలర్లకు చేరాయి. గోల్డ్ రిజర్వు నిధులు సైతం 2.297 బిలియన్ డాలర్లు పతనమై 57.695 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్బీఐ తెలిపింది. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్డీఆర్ఎస్) ఐదు మిలియన్ డాలర్లు పడిపోయి 18.202 బిలియన్ డాలర్ల వద్ద స్థిర పడ్డాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)లో భారత్ రిజర్వు నిల్వలు మాత్రం 2 మిలియన్ డాలర్లు పుంజుకుని 4.612 బిలియన్ డాలర్ల వద్ద స్థిర పడ్డాయి.

# రాహుల్, అక్షర్ సూపర్ ఇన్నింగ్స్

## భారత్ - శ్రీలంక తొలి వన్డే టై



**విశ్వంభర, స్పోర్ట్స్:** పొట్టి సిరీస్‌లో శ్రీలంకను వైట్ వాష్ చేసిన భారత జట్టు వన్డే సిరీస్‌లో బోణీ చేసే చాన్స్ కోల్పోయింది. విజయానికి ఒక్క పరుగు అవసరమైన వేళ ఒకే ఓవర్లో రెండు వికెట్లు కోల్పోయి మ్యాచ్‌ను టైగా ముగించింది. స్వల్ప ఛేదనలో కెప్టెన్ రోహిత్ శర్మ(58) హాఫ్ సెంచరీతో కదం తొక్కగా.. కేఎల్ రాహుల్(31, అక్షర్ పటేల్(33)లు సాధికారక ఇన్నింగ్స్ ఆడారు. ఆఖర్లో శివం దూబే(25) తన స్టయిల్లో చెలరేగాడు. విజయానికి ఒక్క పరుగు అవసరమైన వేళ చరిత అలసంక(3/30) మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వరుస బంతుల్లో దూబై, అర్ష్‌దీప్ సింగ్(0)లను ఎల్బీగా వెనక్కి పంపాడు. అంతే మమ్యాచ్ టైగా ముగిసింది. లంక నిర్దేశించిన స్వల్ప ఛేదనను ఓపెనర్ రోహిత్ శర్మ(58) ధాటిగా ఆరంభించాడు. అరంగేట్ర పేసర్ మహ్మద్ షిరాజ్, స్పిన్నర్ దునిత్ వెల్లలాగే బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. మూడో ఓవర్ తొలి బంతికే ఎల్బీగా ఔటయ్యే ప్రమాదం తప్పించుకున్న రోహిత్ మరింత రెచ్చిపోయాడు. 33 బంతుల్లోనే అర్ధ శతకం బాదడంతో టీమిండియా పవర్ల ప్లేలో వికెట్ కోల్పోకుండా 71 రన్స్ చేసింది. టీమిండియా స్కోర్ బుల్లెట్టులా ఉరికింది. భారత ఇన్నింగ్స్ జోరుగా సాగుతున్న వేళ దునిత్ వెల్లలాగే లంకకు తొలి బ్రేక్ ఇచ్చాడు. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్(16)ను ఎల్బీగా ఔట్ చేసి ఈ జోడీని విడదీశాడు. ఆ తర్వాత విరాట్ కోహ్లీ(24), శ్రేయస్ అయ్యర్(23)లు విఫలమయ్యారు. 132కే ఐదు వికెట్లు పడిన జట్టును కేఎల్ రాహుల్(31), అక్షర్ పటేల్(33)లు ఆదుకున్నారు. వీళ్లిద్దరూ లంక స్పిన్నర్లు సమ-ర్థంగా ఎదుర్కొంటూ ఇన్నింగ్స్ నిర్మించారు. ఐదో వికెట్‌కు 57 పరుగులు జోడించి జట్టును గెలుపు బాట పట్టించారు. అయితే.. రాహుల్‌ను ఔట్ చేసిన హసరంగ లంకకు బ్రేకిచ్చాడు. ఆ కాసేపటికే అసలంక(330) అక్షర్ పోరాటాన్నిముగించాడు. ఆ తర్వాత వచ్చిన శివం దూబే(25) ధనాధన్ ఇన్నింగ్స్‌తో విజయసమీకరణాన్ని మార్చేశాడు. అసలంక వేసిన 48వ ఓవర్ మూడో బంతిని బౌండరీకి పంపి స్కోర్ సమం చేశాడు. ఒక్క రన్ కొడితే విజయమే అనుకున్న వేళ నాలుగో బంతికి దూబే ఎల్బీగా ఔటయ్యాడు. ఆ తర్వాత బంతికే అర్ష్‌దీప్ సింగ్(0) సైతం ఎల్బీగా దొరికిపోయాడు. అంతే.. క్షణాల వ్యవధిలోనే గెలుస్తుందనుకున్న టీమిండియా టైతో సరిపెట్టుకుంది. టాస్ గెలిచిన ఆతిథ్య జట్టుకు సిరాజ్ షాకిస్తూ.. ఓపెనర్ అవిష్క ఫెర్నాండో(1)ను వెనక్కి పంపాడు. 7 పరుగులకే తొలి వికెట్ కోల్పోయిన లంకను ఓపెనర్ పథుమ్ నిశాంక(52), కుశాల్ మెండిస్(14) ఆదుకునే ప్రయత్నం చేశారు. రెండో వికెట్‌కు 39 రన్స్ జత చేసిన ఈ జోడీని శివం దూబే విడదీశాడు. ఆ తర్వాత వచ్చిన సదీర సమరవిక్రమ, కెప్టెన్ చరిత అసలంక(14)లు నిరాశపరిచారు.ఓ వైపు వికెట్లు పడుతున్న నిశాంక అద్భుత అర్ధ శతకంతో జట్టును ఆదుకున్నాడు. 101 పరుగుల వద్ద అతడు ఔటయ్యాక యువ ఆల్‌రౌండర్ దునిత్ వెల్లలాగే(67 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. జనిత్ లియాంగె(20), వనిందు హసరంగ(24)లతో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్‌లను దీటుగా ఎదుర్కొన్న వెల్లలాగే వన్డేల్లో తొలి అర్ధ శతకం బాదాడు. అకిల ధనంజయ(17)తో కలిసి కీలక భాగస్వామ్యం నిర్మించాడు. జట్టు స్కోర్ 200 దాటించి పరువు కాపాడాడు. చివరి ఓవర్ దాకా వెల్లలాగే ధాటిగా ఆడడంలో లంక 230 పరుగులకు పరిమితమైంది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్‌లు రెండేసి వికెట్లు పడగొట్టారు.





## సెమీస్‌లో లక్ష్యసేన్..

### చరిత్ర సృష్టించిన యువ షట్లర్

**పారిస్:** పారిస్ ఒలింపిక్స్‌లో భారత యువ షట్లర్ లక్ష్యసేన్ చరిత్ర సృష్టించాడు. విశ్వ క్రీడల్లో సెమీ ఫైనల్లో అడుగుపెట్టిన భారత తొలి పురుష షట్లర్‌గా రికార్డు నెలకొల్పాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో చైనీస్ తైపీకి చెందిన చౌ థియెన్ చెన్‌పై లక్ష్య సేన్ గెలుపొంది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో 19-22, 21-15, 21-12తో చెన్‌కు భారత కెరటం చెక్ పెట్టాడు. 16వ రౌండ్ మ్యాచ్‌లో భారత్‌కే చెందిన హెచ్‌హెస్ ప్రణయ్ పై గెలుపొందిన లక్ష్యసేన్ క్వార్టర్స్‌లోనూ గర్జించాడు. తొలి సెట్‌లో వెనకబడిన భారత కెరటం.. రెండో సెట్‌లో పంజా విసిరాడు. 21-15తో చెన్‌పై ఆధిపత్యం చెలాయించాడు.



## సెమీస్‌లో ఓటమి..

### కాంస్యం వేటలో ధీరజ్, అంకిత

**విశ్వంభర, స్పోర్ట్స్ :** మిక్స్‌డ్ టీమ్ ఆర్చరీ సెమీ ఫైనల్లో బొమ్మదేవర ధీరజ్, అంకిత భకత్ జోడీ విఫలమైంది. వరల్డ్ నంబర్ 1 దక్షిణ కొరియా జోడీ చేతిలో ఓటమి పాలైంది. శుక్రవారం హోరాహోరీగా సాగిన నాలుగు సెట్ల పోరులో స్పెయిన్ జంటపై గెలుపొందిన ధీరజ్, అంకిత ద్వయం ఫైనల్ బెర్తు మాత్రం సాధించలేకపోయింది. కొరియా జంట 2-6తో నిరాశపరిచింది.అయితే.. భారత జోడీకి ఒలింపిక్ మెడల్ గెలిచేందుకు మరో చాన్స్ ఉంది. కాంస్య పతక పోరులో అమెరికా ఆర్చర్ల టీమ్ బ్రాడీ ఎల్లిసన్, కాసే కౌఫ్‌హోల్డ్‌తో ధీరజ్, అంకిత తలపడనున్నారు. యూఎస్‌ఏ ఆర్చర్ల విషయానికొస్తే.. ఎల్లిసన్ ఇప్పటికే మూడు సార్లు ఒలింపిక్ మెడల్ సాధించాడు.ఇక మహిశల సింగిల్స్‌లో కౌఫ్‌హోల్డ్ వరల్డ్ నంబర్ 1 ర్యాంకర్. దాంతో, ధీరజ్, అంకితలకు గట్టి పోటీ తప్పకపోవచ్చు. ఆర్చరీ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో దక్షిణ కొరియా, జర్మనీ జోడీలు ఢీ కొట్టనున్నాయి.



## ఐటీఆర్ ఫైలింగ్‌లో కొత్త రికార్డు

### 7.28 కోట్లు దాటిన ఐటీ రిటర్న్స్

**విశ్వంభర (బిజినెస్) :** గత ఆర్థిక సంవత్సరం ( 2023-24) ఐటీ రిటర్న్స్‌లో సరికొత్త రికార్డు నమోదైంది. 2022-23 ఐటీ రిటర్న్స్‌తో పోలిస్తే 7.5 శాతం వృద్ధితో 7.28 కోట్ల పై చిలుకు ఐటీఆర్‌లు నమోదయ్యాయని ఆదాయం పన్ను విభాగం శుక్రవారం తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం ఐటీఆర్ దాఖలు చేయడానికి జూలై 31తో గడువు ముగిసింది. 2024-25 అంచనా సంవత్సర ఐటీ రిటర్న్స్ జూలై 31 నాటికి 7.28 కోట్లకు పైగా ఫైల్ అయ్యాయి. 2023-24 అంచనా సంవత్సర ఐటీ రిటర్న్స్ 6.77 కోట్ల ఫైలింగ్స్ తో పోలిస్తే 7.5 శాతం ఎక్కువ అని ఓ ప్రకటనలో తెలిపింది. '2024-25 అంచనా సంవత్సరంలో మొత్తం 7.28 కోట్ల ఐటీఆర్ ఫైలింగ్స్‌లో కొత్త ఆదాయం పన్ను విధానం కింద 5.27 కోట్ల ఐటీఆర్‌లు ఫైల్ కాగా, పాత ఆదాయం పన్ను విధానం కింద 2.01 కోట్ల ఐటీఆర్‌లు ఫైల్ అయ్యాయి' అని వివరించింది. దీంతో పన్ను చెల్లింపుదారుల్లో సుమారు 72 శాతం మంది కొత్త ఆదాయం పన్ను విధానాన్ని ఎంచుకుంటే, 28 శాతం మంది పాత ఆదాయం పన్ను విధానంలో ఐటీఆర్ ఫైల్ చేశారు. 2024-25 అంచనా సంవత్సరంలో అడిటింగ్ అవసరం లేని వేతన జీవులు ఐటీఆర్ ఫైల్ చేయడానికి 2024 జూలై 31 తుది గడువు. ఒక్క రోజే అత్యధికంగా 69.92 లక్షల ఐటీఆర్‌లు ఫైల్ అయ్యాయి. తొలిసారి ఐటీఆర్ ఫైల్ చేసిన వారు 58.57 లక్షల మంది ఉన్నారు. ఆదాయం పన్ను పరిధి విస్తృతం అవుతుందని చెప్పడానికి ఇది సంకేతం అని ఆదాయం పన్ను విభాగం వివరించింది. ఐటీఆర్ ఫైల్ చేయడం కోసం ఆదాయం పన్ను విభాగం ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీన.. అంటే ఆర్థిక సంవత్సరం తొలి రోజే 'ఈ-ఫైలింగ్ పోర్టల్'లో ఐటీఆర్ ఫామ్స్ (ఐటీఆర్-1, ఐటీఆర్-2, ఐటీఆర్-4, ఐటీఆర్-6) అందుబాటులోకి తెచ్చింది. ఇలా ఆర్థిక సంవత్సరం ప్రారంభం నాడే ఐటీఆర్ ఫామ్స్ అందుబాటులోకి తేవడం చారిత్రాత్మకంగా నిలిచింది. మొత్తం 7.28 కోట్ల ఐటీఆర్‌ల్లో ఐటీఆర్ -1 ఫామ్ కింద 45.77 శాతం అంటే 3.34 కోట్లు, ఐటీఆర్-2 ఫామ్ కింద 1.09 కోట్ల మంది (14.93 శాతం), ఐటీఆర్-3 ఫామ్ కింద 91.10 లక్షల మంది (12.5 శాతం0, ఐటీఆర్ -4 ఫామ్ కింద 1.88 కోట్ల మంది (25.77 శాతం), ఐటీఆర్ -5 నుంచి ఐటీఆర్ -7 ఫామ్స్ వరకూ 7.48 లక్షల మంది (1.03 శాతం) ఐటీఆర్ ఫైల్ చేశారు. 43.82 శాతం మంది 'ఈ-ఫైలింగ్ పోర్టల్'లో ఆన్ లైన్ ఐటీఆర్ యుటిలిటీ సేవలను వినియోగించుకుని ఐటీఆర్ ఫైల్ చేస్తే, మిగతా వారు ఆఫ్ లైన్ చానళ్ల ద్వారా దాఖలు చేశారు. మొత్తం 7.28 కోట్ల ఐటీఆర్‌ల్లో 6.21 కోట్ల పై చిలుకు ఐటీఆర్‌ల ఈ-వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారు. వాటిలో ఆధార్ ఆధారిత ఓటీపీ ద్వారా 5.81 కోట్ల పై చిలుకు (93.56 శాతం) మంది ఈ-వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారు. జూలై 31 వరకూ వేతన జీవులు, ఐటీ ఫైల్ చేస్తున్న వారి నుంచి వచ్చిన సుమారు 10.64 లక్షల సందేహాలను ఈ-ఫైలింగ్ హెల్ప్ డెస్క్ నివృత్తి చేసింది.

## దేశంలో రూ.20.64 లక్షల కోట్లకు చేరిన యూపీఐ పేమెంట్స్



**విశ్వంభర (బిజినెస్) :** దేశంలో డిజిటల్ పేమెంట్స్ భారీగా పెరుగుతోన్నాయి. ముఖ్యంగా యూపీఐతో భారీగా లావాదేవీలు కొనసాగుతోన్నాయి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. యూపీఐ ద్వారా చెల్లింపు చేయడం చాలా సులభం కావడంతో చాలా మంది యూపీఐని వాడుతున్నారు. నెల నెలకు యూపీఐ పేమెంట్స్ పెరుగుతోన్నాయి. జులై లో యూపీఐ చెల్లింపులు భారీగా పెరిగాయి. జులైలో యూపీఐ లావాదేవీలు కొత్త రికార్డును సృష్టించాయి. ఈ నెలలో యూపీఐ ద్వారా 1,444 కోట్ల లావాదేవీలు జరిగాయి. రూ.20.64 లక్షల కోట్లు ఒక ఖాతా నుంచి మరో ఖాతాకు బదిలీ అయ్యాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) గణాంకాల ప్రకారం జూన్‌లో రూ.20.07 లక్షల కోట్ల లావాదేవీలు జరిగాయి. మేలో యూపీఐ ద్వారా రూ. 20.44 లక్షల కోట్లు బదిలీ అయ్యాయి. యూపీఐ ద్వారా లావాదేవీలు రూ. 20 లక్షల కోట్లు దాటడం ఇది వరుసగా మూడోసారి. వార్షిక ప్రాతిపదికన జూలై 2023లో యూపీఐ ద్వారా మొత్తం 9,964 కోట్ల లావాదేవీల ద్వారా రూ. 15.33 లక్షల కోట్లు బదిలీ అయ్యాయి. గత సంవత్సరంతో పోలిస్తే యూపీఐ లావాదేవీల సంఖ్యలో 45 శాతం, మొత్తంలో 35 శాతం పెరుగుదల నమోదు అయింది. జూన్ 2024లో యూపీఐ ద్వారా 1,389 కోట్ల లావాదేవీల ద్వారా రూ. 20.07 లక్షల కోట్ల బదిలీ అయ్యాయి. జూన్ నెలతో పోలిస్తే జులై నెలలో లావాదేవీల సంఖ్యలో 3.96 శాతం పెరుగుదల నమోదు అయింది. మొ-ంత్తంలో 2.84 శాతం పెరుగుదల ఉంది. యూపీఐని నియంత్రించే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినెలా ప్రారంభంలో దేశవ్యాప్తం గా యూపీఐ లావాదేవీల గణాంకాలను విడుదల చేయడం గమనార్హం. ఎన్పీసీఐ భారతదేశంలో యూపీఐని నియంత్రిస్తుం ది. యూపీఐ అనేది వర్చువల్ చెల్లింపు సేవ, దీని ద్వారా మీరు కోడ్ ద్వారా ఎలాంటి బ్యాంక్ ఖాతా, నంబర్ లేకుండానే ఒక ఖాతా నుంచి మరొక ఖాతాకు డబ్బును బదిలీ చేయవచ్చు.

## ఉద్యోగులకు షాకిచ్చిన టెక్ దిగ్గజం ఇంటెల్

### 18 వేల మందిపై వేటు




**విశ్వంభర (బిజినెస్) :** కరోనా మహమ్మారి వ్యాప్తి తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం సంకేతాల నేపథ్యంలో దాదాపు అన్ని సంస్థలు తమ ఉద్యోగుల్ని ఎడాపెడా పీకేసిన విషయం తెలిసిందే. చిన్నా, పెద్ద కంపెనీలన్న తేడా లేకుండా అన్ని సంస్థలూ ఉగ్యోలకు లేఆఫ్స్ ప్రకటించాయి. ఈ ఏడాది కూడా చాలా సంస్థలు లేఆఫ్స్‌ను కొనసాగించాయి. అమెజాన్, ట్విట్టర్, మెటా, మైక్రోసాఫ్ట్, గూగుల్ ఇలా ఎన్నో దిగ్గజ కంపెనీలు ఉద్యోగుల్ని తొలగించాయి. భారత్‌కు చెందిన ప్రముఖ ఐటీ సంస్థలూ ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గించుకున్నాయి. అయితే ఇటీవలే పరిస్థితులు మెరుగుపడ్డాయి అనుకునేలోపే కొత్త ఆర్థిక సంవత్సరంలో మరోసారి లేఆఫ్స్ పర్వం ఉద్యగులను ఆందోళనకు గురిచేస్తోంది.తాజాగా అమెరికాకు చెందిన ఎలక్ట్రానిక్ చిప్‌ల తయారీ సంస్థ ఇంటెల్ భారీఎత్తున ఉద్యోగాల తొలగింపుకు సిద్ధమైంది. సంస్థలో పనిచేస్తున్న దాదాపు 18 వేల మందిని తొలగించాలని నిర్ణయించింది. కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్యలో ఇది దాదాపు 15 శాతానికి సమానం. ఈ మేరకు కంపెనీ సీఈవో కీలక ప్రకటన చేశారు. 'రెండో త్రైమాసికం ఫలితాలు నిరాశపరిచాయి. చాలా నిరాశాజనకంగా ఉన్నాయి. ఉత్పత్తులు, తయారీ ప్రక్రియలో ఎన్నో మైలురాళ్లను అధిగమించినప్పటికీ.. ఫలితాలు ఆశించిన స్థాయిలో మాత్రం లేవు. దీంతో కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. రానున్న రోజుల్లో ఇంకా కఠిన సవాళ్లతో కూడిన పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది' అని తెలిపారు. ఇటీవలే ముగిసిన త్రైమాసికంలో కంపెనీ 1.6 బిలియన్ డాలర్ల వరకు నష్టం నమోదు చేసింది. ఇక ఇంటెల్ కంపెనీలో గత ఏడాది చివరి నాటికి 124,800 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో 15 శాతం మందిని తొలగించాలని తాజాగా కంపెనీ నిర్ణయించింది. ఇప్పుడు ఉద్యోగుల్ని తొలగించడం వల్ల ప్రతి సంవత్సరం ఇంటెల్‌కు.. 20 బిలియన్ డాలర్ల వరకు ఖర్చులు తగ్గుతాయని అంచనా.

## ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓ ప్రారంభం




**విశ్వంభర (బిజినెస్) :** ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓ ఆగస్ట్ 2న సబ్‌స్క్రిప్షన్ కోసం అయింది. ఓలా ఐపీఓకు 1వ రోజు మంచి స్పందన వచ్చింది. రిటైల్ పోర్షన్ 1.33 రెట్లు సబ్‌స్క్రిప్షన్‌ను పొందగా, ఉద్యోగుల కోసం రిజర్వ్ చేసిన భాగం 4.37 రెట్లు సబ్‌స్క్రిప్షన్ ను అయింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ కొనుగోలుదారుల (క్యూఐబిలు) కోసం రిజర్వ్ చేయబడిన భాగం ఇంకా ఎలాంటి సబ్‌స్క్రిప్షన్‌ను పొందలేదు. నాన్-ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు తమ మొత్తం రిజర్వ్ చేసిన కోటాలో 13% సబ్‌స్క్రైబ్ చేసుకున్నారు. మొత్తంమీద, ఓలా ఎలక్ట్రిక్ లో 29% మధ్యాహ్నం 2:10 గంటలకు సబ్‌స్క్రైబ్ అయింది. రూ. 6,145.56 కోట్లను సమీకరించే లక్ష్యంతో ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓ తీసుకొస్తున్నారు. ఓలా ఎల్రకిక్ ను 2017లో భావిష్ అగర్వాల్ స్థాపించారు. ఈ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ పేరుతో ఎలక్ట్రిక్ వాహనాలని విక్రయిస్తోంటోంది. కంపెనీ ఓలా ఫ్యూచర్‌ఫ్యాక్టరీలో ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ ప్యాక్‌లు, మోటార్లు, వాహన ఫ్రేమ్‌లతో సహా కీలకమైన భాగాలను తయారు చేయడంపై దృష్టి సారిస్తుంది.ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓ అనేది బుక్-బిల్ట్ ఇష్యూగా ఉంది. ఇందులో రూ. 5,500 కోట్ల విలువైన 72.37 కోట్ల షేర్లు తాజా ఇష్యూ కాగా.. రూ. 645.56 కోట్లు విలువైన 8.49 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ కింద విక్రయిస్తున్నారు. ఆగస్టు 2, 2024 నుంచి ఆగస్టు 6, 2024 వరకు సబ్‌స్క్రిప్షన్ కోసం ఐపిఓ ఓపెన్ అయి ఉంటుంది. షేర్ల కేటాయింపు ఆగస్టు 7, 2024న ఖరారు చేస్తారని తెలుస్తోంది. షేర్లు బీఎస్‌ఈ, ఎన్సీఈ లలో లిస్టింగ్ కానుంది. ఓలా ఎలక్ట్రిక్ ఐపిఓ ధర బ్యాండ్ ఒక్కో షేరుకు రూ.72 నుంచి రూ.76 మధ్య నిర్ణయించింది. దరఖాస్తుల కోసం కనీస లాట్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఒక్కో లాట్ లో 195 షేర్లు ఉంటాయి. రిటైల్ ఇన్వెస్టర్‌లకు కనీసం రూ. 14, 820 పెట్టుబడి పెట్టాలి. ఆగస్టు 1, 2024 నాటికి, ఉదయం 11:02 గంటలకు ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓ కోసం గ్రే మార్కెట్ ప్రీమియం (జీఎంపి) రూ. 12.20 ప్రీమియంతో ట్రేడవుతోంది.

# బాలయ్య కేవలం లీడర్ మాత్రమే కాదు..

## బిగ్ బాస్ బ్యూటీ దివి



**విశ్వంభర, సినిమా :** బిగ్ బాస్ బ్యూటీ దివి వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నా.. హీరోయిన్‌గా మాత్రం ఆఫర్లు రావడం లేక సైడ్ కారెక్టర్లతోనే సరి పెట్టుకుంటుంది. బిగ్ బాస్ కంటే ముందు దివికి మరీ చిన్న పాత్రలు వచ్చేవి. కానీ బిగ్ బాస్ తరువాత అంతో ఇంతో పర్వలేదు. దివి చేసిన వెబ్ సిరీస్ అంతగా హిట్ అవ్వలేదు. ఇప్పుడు దివి బాలయ్యతో ఓ సినిమా చేస్తోంది. బాబీ దర్శకత్వంలో బాలయ్య చేస్తున్న చిత్రంలో దివి ఓ ముఖ్య పాత్రలో కనిపించ వచ్చని తెలుస్తుంది. బాబీ బర్త్ డేను బాలయ్య గ్రాండ్‌గా సెట్స్‌లో సెలెబ్రేట్ చేసినట్టుగా కనిపిస్తోంది. ఈ మేరకు దివి వేసిన పోస్ట్ వైరల్ అవుతోంది. 'జై బాలయ్య.. డియర్ బాలకృష్ణ గారు మీతో పని చేసిన ఈ అనుభవం గురించి ప్రత్యేకంగా నేను పంచుకోవాలని అనుకుంటున్నాను, సెట్స్ మీద మీ ప్రజెన్స్, ఎనర్జీ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది, మీరు పంచే నవ్వులు, క్రియేట్ చేసే ఆహ్లాదకరమైన వాతావరణం, అందరితో కలిసిపోయే తత్వం, అందరినీ ప్రోత్సహించే విధానం ఎప్పటికీ మర్చిపోలేను. టీంలోని ప్రతీ మెంబర్‌కు మీరు రెస్పెక్ట్ ఇస్తారు, వాళ్ల స్థాయిని పట్టించుకోరు. అవే మీ కారెక్టర్‌ను ప్రతిబింబిస్తాయి. మీ గొప్పదనాన్ని చాటిచెబుతాయి. మీరు కేవలం లీడర్ మాత్రమే కాదు. గొప్ప మనిషి, మీతో పని చేసే అవకాశం రావడం గౌరవంగా ఫీల్ అవుతున్నాను. మీ నుంచి డెడికేషన్, ప్యాషన్ వంటి విషయాలెన్నో నేర్చుకున్నాను. హ్యాపీ బర్త్ డే బాబీ. మీకు ఈ బర్త్ డే అంతులేని సంతోషాన్ని తీసుకు రావాలి. మీ డెడికేషన్, టాలెంట్ గురించి ఎంత చెప్పినా తక్కువే. మీ ప్రభావం మా అందరిపై పడింది. ఇలాంటి టీంతో పని చేయడం నాకు ఎంతో సంతోషంగా ఉంది' అని దివి చెప్పుకొచ్చింది. ఇక ఈ మూవీ మీద అయితే ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలే ఏర్పడ్డాయి.

# 5న 'దేవర' సెకండ్ సాంగ్



**విశ్వంభర, సినిమా :** మ్యాన్ ఆఫ్ మాసెస్ జూ.ఎన్టీఆర్ నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ దేవర కోసం అభిమానులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు కొరటాల శివ ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నాడు. ఇక ఇప్పటికే రిలీజ్ అయిన ఈ చిత్ర పోస్టర్స్, ఫస్ట్ సింగిల్ సాంగ్, టీజర్‌లకు సాలిడ్ రెస్పాన్స్ దక్కింది. అయితే, ఈ సినిమా నుండి మేకర్స్ తాజాగా ఓ బిగ్ అప్డేట్ ఇచ్చారు. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ మూవీ రెండో సింగిల్ సాంగ్‌పై తాజాగా క్లారిటీ ఇచ్చారు. ఈ సినిమాలోని రెండో సాంగ్‌ను ఆగస్టు 5న రిలీజ్ చేయబోతున్నట్లు వారు ఓ పోస్టర్ ద్వారా వెల్లడించారు. ఇది ఓ రొమాంటిక్ సాంగ్‌గా ఉండబోతుందని ఈ పోస్టర్ చూస్తే అర్థమవుతోంది. అందాల జాన్వీ కపూర్ నడుముపై ఎన్టీఆర్ చేయి వేసి ఆమె కళ్లలోకి చూస్తున్నట్లుగా ఈ పోస్టర్ డిజైన్ చేశారు. ఇక ఈ సినిమాలో తారక్ ఓ సరికొత్త గెటప్ లో కనిపిస్తున్నాడు. జాన్వీ కూడా చాలా బ్యూటీఫుల్‌గా ఈ పోస్టర్‌లో ఉంది. అనిరుధ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను సెప్టెంబర్ 27న రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అయ్యారు.



# ప్రిన్సెస్ పాత్రలో నభానటేశ్

**విశ్వంభర, సినిమా :** ఇస్మార్ట్ శంకర్ సినిమా ద్వారా టాలీవుడ్ కు దగ్గరైన నటి నభా నటేశ్. ఆ తర్వాత 'డిస్కో రాజా', 'సోలో బ్రతుకే సో బెటర్', 'అల్లుడు అదుర్స్' వంటి సినిమాల్లోనూ తన ప్రతిభను నిరూపించుకుంది. ఓ ప్రమాదం కారణంగా ఆమె రెండేళ్లపాటు సినిమాలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఆపరేషన్ కూడా చేయించుకున్న నభా పూర్తిగా కోలుకుంది. ఇటీవలే 'డార్లింగ్' అనే సినిమాలో ప్రియదర్శి సరసన నటించింది. ప్రస్తుతం ఆమె చేతిలో రెండు సినిమాలున్నాయి. డార్లింగ్ సినిమాలో సిట్ పర్సనాలిటీ డిజార్డర్ సమస్యతో బాధపడుతున్న యువతిగా నభా కనిపించింది. ఈ సినిమాలో ఆమె చేసిన పాత్రకు ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మీడియాతో ఇంటరాక్ట్ అయిన నభా, తన గ్లామరస్ లుక్స్ అందరినీ ఆకట్టుకుంది. పువ్వు ఆకారంలో ఉన్న పొట్టి డ్రెస్ సింపుల్ మేకప్తో వచ్చిన నభా, ఫ్యాన్స్ ను కట్టిపడేసింది. ఈ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నభా నటేశ్ నిఖిల్ సరసన 'స్వయంభూ' మూవీలో కూడా నటిస్తోంది. పీరియాడిక్ జోనర్లో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రిన్సెస్ పాత్రలో కనిపించనుంది.

# బిగ్ బాస్ సీజన్ 8 టీజర్ రిలీజ్



**విశ్వంభర, సినిమా :** బుల్లితెర ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తు వస్తున్న సూపర్ పాపులారిటీ ఉన్న ఇండియన్ టీవీ రియాలిటీ షోల్లో టాప్‌లో ఉంటుంది తెలుగు బిగ్‌బాస్ షో (%దీఅస్త్రస్త్ర దీశీం%). కొత్త కొత్త టాస్కులు, గేమ్‌లు, ఛాలెంజెస్, కాంట్రవర్సీస్, వినోదాలతో సాగుతూ అందరినీ టీవీలకు కట్టిపడేస్తుంటుంది. అయితే తెలుగు బిగ్ బాస్ సందడి మళ్లీ షురూ కానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఏడు సీజన్లను సక్సెస్ ఫుల్ గా కంప్లీట్ చేసుకున్న ఈ సెలబ్రిటీ గేమ్ షో తర్వాతి సీజన్ ను ప్రారంభించేందుకు స్టార్ మా రెడీ అవుతోంది. ఇప్పటికే 8వ సీజన్‌కు సంబంధించి లోగోను విడుదల చేసిన నిర్వాహకులు తాజాగా టీజర్‌ను వదిలారు. కమెడియన్ సత్య పాత్రతో పరిచయమైన టీజర్‌లో నాగార్జున వరాలు అందించే జీనీ పాత్రలో కనిపించారు. ఈసారి మరింత ఎంటర్‌టైన్ అవ్వబోతున్నట్లు టీజర్ చూస్తే అర్థమవుతుండగా.. 'ఒక్కసారి కమిట్ ఐతే లిమిటే లేదు' అంటూ నాగార్జున చెప్పిన డైలాగ్ ప్రేక్షకులను అలరిస్తోంది. నాగార్జున గత కొన్ని సీజన్‌ల నుంచి తెలుగు బిగ్ బాస్‌కు హోస్ట్‌గా చేస్తున్న విషయం తెలిసిందే. ఇక సీజన్ 8కు కూడా హోస్ట్‌గా నాగార్జున కనిపించబోతున్నారు. అయితే ఈ సీజన్ 8 డేట్ మాత్రం అనౌన్స్ చేయలేదు. సెప్టెంబర్ మొదటి వారం నుంచి ఈ బిగ్ బాస్ 8 ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోవైపు సీజన్ 8 స్టార్ట్ కాకముందే ఈ హౌస్ లోపలికి స్టార్ కాస్ట్ వెళ్ళబోతున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం కూడా జరుగుతోంది. ఇందులో విష్ణు ప్రియ, రితూ చౌదరి, అమృత ప్రణయ్, బంచిక్ బబ్లు, యూట్యూబర్ అనిల్, యాదమ్మ రాజు, ఖయ్యూమ్ అలీ, సోనియా సింగ్ బిగ్ బాస్ సీజన్8 కంటెస్టెంట్స్‌గా ఎంపికైట్లు సమాచారం. అంతే కాకుండా మరికొందరి పేర్లు కూడా సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అందులో ముఖ్యంగా సెలబ్రిటీల జాతకాలు చెబుతూ ఫేమస్ అయిన వేణు స్వామి, క్రికెటర్ అర్జున్, అబ్బాస్, నటుడు రోహిత్, ఇలా పలువురు పేర్లు చాలా రోజుల నుంచి వినిపిస్తున్నా దీనిపై ఎలాంటి క్లారిటీ లేదు.

# విజయ్ దేవరకొండ మూవీ ఎప్పుడంటే



**విశ్వంభర, సినిమా :** రౌడీ హీరో విజయ్ దేవరకొండ, స్టార్ డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'VD 12' నుంచి ఓ సాలిడ్ పోస్టర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. అందులో విజయ్ వర్షంలో తడుస్తున్న ఓ కొత్త లుక్‌లో కనిపించి ఆకట్టుకున్నారు. ఇక ఈ సినిమా టైటిల్‌ను ఈ నెలలో (ఆగస్టు) విడుదల చేస్తున్నట్లు పేర్కొన్న మేకర్స్, 2025 మార్చి 28న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే గతంలో ఈ సినిమాలో విజయ్ ఓ సూపర్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తారని మేకర్స్ హింట్ ఇచ్చారు. దానికి తగ్గట్లుగానే ఓ అఫీషియల్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. కానీ ఇప్పుడీ పోస్టర్ చూస్తుంటే ఇందులో విజయ్ డిఫరెంట్ షేడ్స్ ఉన్న రోల్‌లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా ఇందులో ఓ స్ట్రాంగ్ ఫ్లాష్ బ్యాక్ కూడా ఉండనున్నట్లు పోస్టర్ ద్వారా అర్థమవుతోంది. ఇక ఈ సినిమాలో మ్యూజిక్ సెన్సేషన్ అనిరుథ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. గిరీశ్ గంగాధరన్ సినిమాటోగ్రాఫర్‌గా నటిస్తుండగా, నేషనల్ అవార్డు విన్నర్ నవీన్ నూలి ఈ చిత్రానికి ఎడిటర్‌గా బాధ్యతలు అందుకున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే 60 శాతం షూటింగ్ జరిగినట్లు సమాచారం. ఇక విజయ్ దేవరకొండ ఈ సినిమాతో పాటు 'VD 14' అనే పీరియాడిక్ డ్రామాలో నటిస్తున్నారు. 1854 నుంచి 1878 మధ్యలో జరిగిన కథతో ఈ చిత్రం తెరకెక్కుతుంది. ఇందులో విజయ్ తండ్రిగా, కొడుకుగా ఇలా డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారట.

# షుగర్ వ్యాధి వచ్చే ముందు కనిపించే లక్షణాలు



**విశ్వంభర, ఫీచర్ :** ప్రస్తుత కాలంలో ప్రపంచాన్ని వణికిస్తున్న వ్యాధుల్లో ఒకటి.. మధుమేహం. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ చేయకపోవడం, జన్యువులు వంటి వివిధ కారణాల వల్ల చాలా మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. డయాబెటిస్ ఒక్కసారి వచ్చిందంటే.. రోజూ మందులు వేసుకుంటూ జాగ్రత్తలు పాటించడం తప్ప వేరే మార్గం లేదు. ఇది ఇలా ఉంటే.. మెజార్టీ జనాలకు షుగర్ వచ్చే ముందు కనిపించే లక్షణాలు ఏంటో తెలియదు. దీనివల్ల శరీరంలో గ్లూకోజ్ స్థాయులు పెరిగి గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు, కంటి చూపు తగ్గిపోవడం వంటి ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు నిపుణులు. అయితే, డయాబెటిస్ వచ్చే ముందు మన శరీరంలో ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయో.. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ 'డాక్టర్ రవిశంకర్ ఇరుకులపాటి' వివరిస్తున్నారు. ఆ వివరాలు తెలుసుకుందా...

**ప్రీ డయాబెటిస్ :** కొద్దిపాటి లక్షణాలతో కనిపించే మధుమేహాన్ని 'ప్రీ డయాబెటిస్' అంటారు. దీనివల్ల గుండె రక్తనాళాల జబ్బు, మరణాల ముప్పు పెరుగుతుంది. ప్రీ డయాబెటిస్ ఉన్నవారిలో గ్లూకోజ్ మమూలు కన్నా ఎక్కువగానే ఉంటుంది కానీ, మధుమేహంగా నిర్ధారించే అవకాశం అంత ఎక్కువగా ఉండదని వైద్యులు చెబుతున్నారు.

**తరచుగా మూత్రవిసర్జన చేయడం :** తరచూ మూత్రవిసర్జన చేయడం డయాబెటిస్ ఉందనడానికి మొదటి సంకేతం. రాత్రి సమయంలో కూడా ఎక్కువసార్లు మూత్రవిసర్జనకు వెళ్లాల్సి వస్తే ప్రీ డయాబెటిస్ ఉన్నట్లు గుర్తించాలంటున్నారు డాక్టర్ రవిశంకర్.

**దాహం ఎక్కువగా వేయడం :** తరచూ నీళ్లు తాగినా కూడా ఎక్కువగా దాహం వేస్తుంటే.. మధుమేహం వచ్చే అవకాశం ఉన్నట్లు గుర్తించాలి. షుగర్ వల్ల రక్తంలో చక్కెర స్థాయులు ఎక్కువగా ఉంటాయి. దీనివల్ల తరచూ మూత్రవిసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. దీంతో దాహం ఎక్కువగా వేస్తుందని చెబుతున్నారు.

**ఆకలి ఎక్కువగా వేయడం :** ఆహారం సరిపడినంత తిన్న తర్వాత కూడా ఆకలి వేస్తుంటే అది ప్రీ డయాబెటిస్ సంకేతంగా గుర్తించాలి. శరీరానికి తగినంత గ్లూకోజ్ అందకపోవడంతో ఇలా ఆకలి ఎక్కువగా వేస్తుందంటున్నారు.

**అలసట :** రాత్రి బాగా నిద్రపోయినా ఉదయాన్నే అలసటగా ఉంటే.. మధుమేహం పొంచి ఉన్నట్లు అర్థం చేసుకోవాలి. అలాగే కొద్ది దూరం నడవగానే అలసిపోవడం, కొన్ని మెట్లు కూడా ఎక్కలేకపోవడం వంటి లక్షణాలు కూడా ప్రీ డయాబెటిస్ ఉందనడానికి ఒక సంకేతం.

**కంటిచూపు తగ్గిపోవడం :** వయసు పైబడుతున్నా కొద్ది కంటిచూపు తగ్గిపోవడం సహజమే. కానీ, ప్రీ డయాబెటిస్ వల్ల కంటిలోని రక్తనాళాలు దెబ్బతిని కంటిచూపు తగ్గిపోతుంది. అలాగే ఎటువంటి వ్యాయామాలు చేయకపోయినా, డైట్ పాటించకపోయినా కూడా అప్రయత్నంగా బరువు తగ్గడం మధుమేహానికి సంకేతం కావొచ్చు. ఇంకా గాయాలు త్వరగా మానకపోవడం కూడా ప్రీ డయాబెటిస్ లక్షణాలలో ఒకటి. చివరిగా పైన తెలిపిన లక్షణాలలో ఏవి కనిపించినా కూడా వెంటనే వైద్యుడిని సంప్రదించి బ్లడ్ షుగర్ టెస్ట్ చేయించుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.

# కొవ్వు కరిగించే అద్భుతమైన సూపర్ డ్రింక్స్



**విశ్వంభర, ఫీచర్ :** శరీరంలో అదనపు కొవ్వు గురించి ఇకపై ఆందోళన చెందవల్సిన అవసరం లేదు. ఈ కింది న్యాచురల్ డ్రింక్స్ సాయంతో సులభంగా బరువు తగ్గొచ్చు. మార్కెట్లో దొరికే రసాయన పానీయాలు కాకుండా ఈ సహజసిద్ధ పానియాలు రోజూ క్రమం తప్పకుండా తాగితే సరి. కొవ్వు తగ్గడంతోపాటు బరువు కూడా అదుపులో ఉంటుంది. ఉసిరిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది జీవక్రియను పెంచుతుంది. శరీరంలోని అదనపు కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది. శరీరంలో అదనపు కొవ్వు గురించి ఇకపై ఆందోళన చెందవల్సిన అవసరం లేదు. ఈ కింది న్యాచురల్ డ్రింక్స్ సాయంతో సులభంగా బరువు తగ్గొచ్చు. మార్కెట్లో దొరికే రసాయన పానీయాలు కాకుండా ఈ సహజసిద్ధ పానియాలు రోజూ క్రమం తప్పకుండా తాగితే సరి. కొవ్వు తగ్గడంతోపాటు బరువు కూడా అదుపులో ఉంటుంది. ఉసిరిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది జీవక్రియను పెంచుతుంది. శరీరంలోని అదనపు కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది. ఒక గ్లాసుడు నీళ్లలో 2 నుంచి 3 టీస్పూన్ల ఉసిరి రసాన్ని కలిపి, రోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో సేవిస్తే, కొవ్వు తగ్గడమే కాకుండా చర్మ కాంతిని పునరుద్ధరిస్తుంది. జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నిమ్మకాయల్లో కూడా విటమిన్ సి ఉంటుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలోని జీవక్రియను మెరుగుపరుస్తుంది. ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో సగం నిమ్మకాయ రసాన్ని పిండాలి. ఈ నీటిని పరగడుపున తాగితే 7 రోజుల్లోనే ఫలితాన్ని పొందొచ్చు. కొబ్బరి బోండం నీళ్లలో అధిక పోషకాలు, తక్కువ కేలరీలు ఉంటాయి. ఇవి బరువు తగ్గడానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. జీవక్రియను పెంచడం ద్వారా శరీర తేమను నిలపుకోవడానికి, అదనపు కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది. మీరు ప్రతిరోజూ ఒక గ్లాస్ నీళ్లు తాగినా మేలే. అలాగే అల్లం టీ కూడా శరీర ఉష్ణోగ్రత, జీవక్రియను పెంచడానికి సహాయపడుతుంది. అల్లం టీ తాగలేకపోతే కొన్ని అల్లం ముక్కలను వేడి నీటిలో వేసి పది నిమిషాలు మరిగించి ఆ నీటిని తాగినా చాలు. యాపిల్ సైడర్ వెనిగర్‌లో ఎసిటిక్ యాసిడ్ పుష్కలంగా ఉంటుంది. ఈ పానీయం పొట్ట, నడుము కొవ్వును పోగొట్టడానికి అద్భుతమైన ఔషధం. ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో ఒక టేబుల్ స్పూన్ ఆపిల్ సైడర్ వెనిగర్, ఒక టీస్పూన్ తేనె కలిపి భోజనానికి ముందు తాగాలి. ఇది శరీరంలో కొవ్వును ఇట్టే కరిగిస్తుంది. బ్లాక్ కాఫీ చాలా కెఫిన్ ఉంటుంది. ఇది శరీరం జీవక్రియ రేటును పెంచడానికి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. కానీ చక్కెర లేని బ్లాక్ కాఫీ మాత్రమే తాగాలి. పంచదార, పాలు అస్సలు వేసుకోకూడదు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana.
Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com